VISALAANDHRA Phone 5301 ఉదయం ★★ Regd No. H. 201

విశాలాంధ్ర

702988

సంపుటి 19 సంచిక 27] విజయవాడ 15—4—1969 మంగళవారం [6 పేజీలు 12 పై.

"విశాలాంధ్ర"
చందా వివరాలు
దినపత్రిక 12 పైసలు, ఆదివారం సంచిక 15 పైసలు

	ఏజంటుద్వారా		పోస్టుద్వారా
సంవత్సరానికి	రు. 44—00	....	రు. 58—00
6 నెలలకు	22—00	....	29—00
3 నెలలకు	11—25	....	14—50
నెలకు	3—75	....	5—00

తెలంగాణాలో హింసాయుత చర్యలు

బెజవాడ గోపాలరెడ్డి ఖండన

డెహరాడూన్, ఏప్రిల్ 14

తెలంగాణాలో హింసాయుతచర్యలను ఉత్తర ప్రదేశ్ గవర్నర్ బెజవాడ గోపాలరెడ్డి నేడిక్కడ ఖండించారు.

'ప్రధాని హామీలను గౌరవించి వాటి అమలుకు సహకరించండి'

తెలంగాణా ప్రజలకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య విజ్ఞప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 14

భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ హామీలను, వ్యక్తం చేసిన అభిప్రాయాలను గౌరవించ వలసిందిగాను, ఆ హామీలకు సహకరించ వలసిందిగాను ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య నేడు తెలంగాణా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్ నాయకులు, వారెంత వారైనప్పటికీ, వారి హామీలను తెలంగాణా ప్రజలు విలువ నివ్వడం లేదని ఆయన నేడిక్కడ పత్రికా గోష్ఠిలో చెప్పారు. అందు వలన ఇకముందు తెలంగాణాప్రజలకు ఇతరు లెవ్వరూ కాకుండా ప్రధాన మంత్రి హామీ లివ్వాలని ఇటీవల ప్రధాని ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి సమావేశంలో తాను విజ్ఞప్తి చేశానని ఆయన చెప్పారు.

ప్రధాని అందుకు అంగీకరించి హామీల నిచ్చారని శ్రీ సంజీవయ్య అన్నారు.

ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ నాయకులపై తెలంగాణా ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారని చెప్పారు

ఇప్పటికైనాసరే ప్రధాని మరి కొంతమంది తెలంగాణా నాయకులతో చర్చలు జరిపి వారిలోగల సందేహాలను, భయాందోళనలను అనుమానాలను తొలగించాలని ఆయన ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ప్రత్యక్ష చర్చలద్వారా అపోహలను తొలగించుకోవచ్చు నన్నారు.

ప్రస్తుతం తెలంగాణాలో జరుగుతున్నది ప్రజాఉద్యమం కాదని భావించేవారు దుర్భ్రమలలో నివశిస్తున్నారని ఆయన అన్నారు

మీరు సమగ్ర ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలమా లేక ప్రత్యేక తెలంగాణాకు అనుకూలమా అన్న ప్రశ్నకు ఆయన జవాబిస్తూ తన అభిప్రాయాలను ప్రధానమంత్రికి స్పష్టంచేశానని, తగు సమయం ఆసన్నమైనప్పుడు తన అభిప్రాయాన్ని బహిరంగంగా ప్రకటిస్తానని శ్రీ సంజీవయ్య చెప్పారు.

ఈ సూటి ప్రశ్నకు సూటిగా జవాబివ్వడం ద్వారా ఆ సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారానికి ఏవిధమైన అవకాశమున్నా అది దెబ్బతింటుందన్నారు.

ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలను అరెస్టు చేయడం, నిర్బంధించడం అవాంఛనీయమైనదని, సికింద్రాబాద్‌లో ఏప్రిల్ 4 న జరిగిన పోలీసు కాల్పులు తొందరపాటుతో కూడినవని ఆయన అన్నారు.

జైలులోను వెలుపలనున్న నాయకులను ఆయన కలుసుకోబోతున్నారు

సర్వీసుల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు దృష్ట్యా ఏర్పడ్డ పరిస్థితిని అధిగమించడానికి రాజ్యాంగ సవరణ అవసరమని ఆయన చెప్పారు.

వేలాది నాన్ ముల్కీ ఉద్యోగులను ఆంధ్ర ప్రాంతానికి తరలించడానికి వీలు కలిగించబడిన జనవరి 19 ఒప్పందాన్ని ఆయన ఖండించారు. చర్య అమానుషం, ఆత్మహత్యా సదృశ్యం. ఆచరణ యుక్తమైనది కాదు. అవాస్తవిక మైనదని అన్నారు. నాన్ ముల్కీ ఉద్యోగులను మొత్తంగా కాకుండా దశలవారీ ఆంధ్రకుమార్చాలన్నారు.

వెనుకబడిన ప్రాంతాల, వెనుకబడిన సమస్యలు పరిష్కరింప బడకపోయినట్లయితే యీనాడు తెలంగాణాలో చెలరేగిన ఉద్యమం వంటి ఉద్యమాలు రేపు రాయలసీమలోను, మరునాడు వెనుకబడిన కులాలవారిలోను, తరగతులవారిలోను తలెత్తవచ్చు.

పరిస్థితిని అంచనా వేయడానికి కేంద్ర మంత్రివర్గ కమిటీ తెలంగాణాలో పర్యటించాలన్న అభిప్రాయాన్ని ప్రకటించారు ఆంధ్రప్రదేశ్ నాయకు పట్ల, ప్రస్తుతమంత్రి వర్గంపట్ల తెలంగాణా ప్రజలు విశ్వాసానికి కోల్పోయారని ఆయన విగ్గరగా అన్నారు.

ప్రస్తుత పరిస్థితి పరిష్కారానికి ప్రధాన మంత్రి మరికొందరు తెలంగాణా నాయకులతో సంప్రదించాలన్నారు.

ఏప్రిల్ 28 న కేంద్ర సలహా సంఘ సమావేశం

హైదరాబాదు, ఏప్రిల్ 14

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ వలన ఏర్పడిన ప్రభుత్వ అధికార్ల సమస్యలను పరిశీలించేందుకు కేంద్ర సలహా సంఘం ఏప్రిల్ 28, 29 తేదీలలో సమావేశ మవుతుంది.

ఈసలహా సంఘంను రాష్ట్రాలపునర్వ్యవస్థీకరణ చట్టం క్రింద ఏర్పాటు చేశారు. సంఘాధ్యక్షులు శ్రీ కే.యం.దామ్లే (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్) సలహా సంఘంలో వున్న రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తి శ్రీ పి. యస్. స్వాప్, న్యాయశాఖ మాజీ కార్యదర్శి శ్రీ భండార్కర్‌లు, యింకా యితర సభ్యులు ఏప్రిల్ 27 వ తేదీన యిక్కడకు వస్తారు.

ఉద్యోగాల పంపిణి, సామాన్య సమస్యలు, వేతన నిర్ణయం మొదలయిన సమస్యలపై రాష్ట్ర ప్రభుతానికి 737 కేసులు సమర్పించబడినవి. నష్టపోయిన ఉద్యోగులు స్వయంగా సలహా సంఘం ముందు తమ సమస్యలను వివరించుతారు.

సబార్డినేట్ సర్వీసులకు సంబంధించి రాష్ట్ర సలహా సంఘం ఏప్రిల్ 29 వ తేదీ నుండి ఒక వారం రోజులపాటు సమావేశ మవుతుంది యిప్పటివరకు రాష్ట్ర సలహా సంఘానికి 2,400 కేసులు నివేదించబడినవి.

కొండా లక్ష్మణ్‌కు ప్రధాని ఆహ్వానం

హైదరాబాద్, ఏప్రిల్ 14

తెలంగాణా సమస్యపై సంభాషణలు జరిపేందుకు ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధిమాజీ రాష్ట్ర సమాచార శాఖ మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్‌బాపూజీని ఆహ్వానించారు.

బుధవారంనాడు శ్రీ లక్ష్మణ్ ఢిల్లీలో వుంటారని భావిస్తున్నారు.

ఇజ్రాయిల్ - ఈజిప్ట్‌ల మధ్యవిమానయుద్ధం

టెల్అవీవ్ ఏప్రిల్ 14

సూయజ్ కాలువ వద్ద నేడు ఇజ్రాయిల్, ఈజిప్టు విమానాల మధ్య విమానయుద్ధం జరిగింది.

ఈజిప్టుకు చెందిన ఒక మిగ్ విమానాన్ని కూల్చివేసినట్లు ఇజ్రాయిల్ సైనికాధికారులు ప్రకటించు కున్నారు. మిగ్ విమానం ఈజిప్టుభూభాగంలో పడిపోయినట్లు సైనికాధికారి తెలియజేశారు.

పోరాటంలో తమవైపు ఎటువంటినష్టాలు జరగలేదని తమ విమానాలన్నీ క్షేమంగా తిరిగివచ్చాయని సైనికాధికారి తెలియజేశారు.

సామర్లకోటవద్ద

స్పిరిట్ టాంక్ ప్రేలి యిద్దరు మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 14

సామర్లకోటవద్ద షుగర్ ఫ్యాక్టరీలో స్పిరిట్ ట్యాంక్ ప్రమాద వశాత్తు ప్రేలిపోవటం వలన యిద్దరు వ్యక్తులు చనిపోయారు.

చనిపోయిన వారిలో ఒక ప్రొహిబిషన్ కానిస్టేబిల్ కూడా వున్నారు. ఈ సంఘటన గత శనివారంనాడు జరిగినట్లు పోలీసు ప్రధాన కార్యాలయానికి నేడు అందిన వార్తలు తెలుపుతున్నాయి.

ప్రేలుడులో మరో మూడు కాళీ టాంక్కులు భవనం రేకులు దెబ్బతిన్నాయి. నష్టం దాదాపు 8000 రూపాయలు వరకు వుంటుందని అంచనా వేశారు.

పోలీసు కాల్పుల్లో ఒకరి మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 14

నిజామాబాద్‌కు 25 మైళ్ళలోగల ముర్దాడ్ గ్రామంలో విన్న ఉదయం తెలంగాణా ఆందోళనకారులపై పోలీసు కాల్పులు జరుపగా ఒకరు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. నేటి ఉదయం ఇక్కడికి అందిన అధికార సమాచారం ఈవిషయాన్ని తెలియజేసింది.

ఆందోళనకారుల సమూహం పోలీసులపై రాళ్ళు విసిరినట్లు, కొందరు పోలీసులు గాయపడినట్లు చెప్పబడింది వారిని చెదరగొట్టడానికి పోలీసులు లాఠీ ఛార్జీ జరిపారు. అది నిరుపయోగ మైనందున కాల్పులు జరుపవలసి వచ్చినట్లుఆసమాచారం తెలుపుతున్నది.

చనిపోయిన వ్యక్తి 65 సంవత్సరాల వయస్సు గలవారని నిజామాబాద్ జిల్లాతెలంగాణా కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు చెప్పారు. ఆ వ్యక్తి తూటా దెబ్బ తగిలి వెంటనే అక్కడి కక్కడే మృతిచెందారు. 27-30 సంవత్సరాల వయస్సు గల మరో యిద్దరు గాయపడ్డారని ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా 25 మందిని కస్టడీలోనికి తీసుకున్నట్లు తెలియవచ్చింది.

ప్రభుత్వ హామీలు ఉద్యోగులను సంతృప్తి పరచలేదు

హైదరాబాద్, ఏప్రిల్ 14

ప్రస్తుత పరిస్థితిలో ప్రభుత్వం ప్రకటించిన హామీలు తెలంగాణా ఉద్యోగులను సంతృప్తి పరచలేవని తెలంగాణా అసోసియేషన్ల, యూనియన్ల సంయుక్త సమితి కన్వీనర్ శ్రీ ఏ. రామబ్రహ్మం ప్రకటించారు

ముల్కీ నిబంధనలను పునరుద్ధరించాలని, తెలంగాణా ఉద్యోగుల సమస్యలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన ఉన్నతాధికార సంఘాన్ని ఏర్పాటు చేయాలని, తెలంగాణా ఉద్యోగులు గత కొలది రోజులుగా ఆందోళన చేస్తున్నారని శ్రీ రామబ్రహ్మం వివరించారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని యిచ్చే హామీలు ఉద్యోగులను సంతృప్తి పరచలేవని ఆయన అన్నారు,

1947 లో హైదరాబాద్ పేకమిషన్ ప్రతిపాదనపై వేతన వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలని శ్రీ రామబ్రహ్మం అన్నారు

తెలంగాణా ప్రాంతంలోని విలేజిలెవెల్ వర్కర్లుకూడ, ఉపాధ్యాయులు, యన్. జి. వోలు. పంచాయతీరాజ్ ఉద్యోగులతోపాటు సమ్మె చేయాలని నిర్ణయించుకున్నారని శ్రీ రామబ్రహ్మం తెలియజేశారు.

మానుకోటలో లారీ దగ్ధం

మానుకోట, ఏప్రిల్ 14

వరంగల్‌జిల్లా మానుకోటలో యీ నెల 11 వ తేదీన వాటర్ సప్లయికి సంబంధించిన లారీ నొకదానిని రోడ్డుపైన ప్రత్యేక తెలంగాణావాదులు కిరసనాయిల్‌పోసి తగుల బెట్టారు.

బస్సు ముందుభాగం ఇంజన్‌తో సహా కాలిపోయింది. వెంటనే కొందరు అచ్చటి వచ్చి మంటలు చల్లార్చకపోతే లారీ పూర్తిగా కాలిపోయి వుండేది

సమ్మెలో పాల్గొనరాదని మరికొన్ని యూనియన్ల నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 14

రేపటి సమ్మెలో పాల్గొనరాదని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ ఫెడరేషన్ నిర్ణయించుకుంది,

వైద్యం, ఆరోగ్యం, మెడిసిన్, వాటర్ వర్క్సు ఎలక్ట్రిసిటీబోర్డు, హైదరాబాద్ మున్సిపాలిటీ యింకా యితర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న వారిలో 50 000 మంది ఈ ఫెడరేషన్ సభ్యులని నేడు సమాచార శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలియచేయబడింది.

సచివాలయంలో పనిచేస్తున్న 4 వతరగతి ఉద్యోగులు కూడ రేపటి సమ్మెలో పాల్గొనరాదని నిర్ణయించుకున్నారు.

జనార్దనరావు ప్రకటన

ఏప్రిల్ 15 వ తేదీన జరిగే సమ్మెలో పాల్గొనరాదని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయుల అసోసియేషన్ నిర్ణయించుకున్నదని అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ జనార్దనరావు ప్రకటించినట్లు సమాచార శాఖ ప్రకటించింది.

రేపటి సమ్మెలో పాల్గొన వద్దని అసోసియేషన్ ప్రాథమిక ఉపాధ్యాయులందరికీ విజ్ఞప్తి చేసింది

తెలంగాణా ఉద్యోగులకు జరిగినఅన్యాయ విషయాలలో ప్రభుత్వం న్యాయం చేకూర్చాలని అసోసియేషన్ డిమాండ్ చేసింది.

తెలంగాణా సమస్యపై అఖిలపక్ష సమావేశం

శ్రీ మీర్ అక్బర్ అలీఖాన్ సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 14

తెలంగాణా సమస్యను పరిష్కరించుకొనుటకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని పార్లమెంటుసభ్యుడు శ్రీ మీర్ అక్బర్ అలీఖాన్ సూచించారు. ఏప్రిల్ 11వ తేదీన లోక్‌సభలో తెలంగాణా సమస్యపై ప్రధాన మంత్రి చేసిన ప్రకటనను తాను చాలా జాగ్రత్తగా పరిశీలించానన్నారు ప్రధానమంత్రి ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్న నాయకులతో ప్రధానమంత్రి ప్రకటనను గురించి చర్చలు జరిపానన్నారు. రాష్ట్రైక్యతను కాపాడాలనే ప్రధానమంత్రి ఉద్దేశ్యంతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానన్నారు కాని రాష్ట్రైక్యతను కాపాడుటకు పాటుపడేవారి ప్రయత్నాలకు ప్రధాని ప్రకటన ఏ విధంగాను సహాయపడదన్నారు.

రాష్ట్రంలోనిపరిస్థితులను ఇదేవిధంగాకొనసాగనిస్తే, ఇతర రాష్ట్రాల్లోకూడా ఇలాంటి పరిస్థితులే తల ఎత్తగలవనే హెచ్చరికతో భయ సందేహాలను తాను అభినందిస్తున్నానన్నారు. ప్రజలలో విశ్వాసం సడలిపోయిన నప్పుడు, పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనె పరిష్కారమార్గాన్ని రాజకీయ నాయకులు కనుగొనాలన్నారు.

సబ్బుల ధరలు తగ్గించే సూచన

లోక్‌సభలో మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

సబ్బుల ధర తగ్గించడానికై సబ్బుల పరిశ్రమతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్టు కేంద్ర పెట్రోలియం, రసాయనాల మంత్రి శ్రీ డి. ఆర్. చావన్ నేడు లోక్‌సభలో వెల్లడించారు.

ముడిసరుకులధరలు ఇటీవలతగ్గినదృష్ట్యా సబ్బు ధరలు తగ్గించడానికి ప్రయత్నాలు జరుపుతున్నట్టు శ్రీ చావన్. శ్రీ లిమాయే ప్రశ్నకు సమాధాన మిచ్చారు.

లాండ్రీ సబ్బులు, టాయిలెట్ సబ్బుల టన్ను ధర రు. 280 లు, రు. 500 లు సవంబరులో పెంచడం జరిగిందని అందుకు కారణంవిదేశాలనుంచిఅవసరాలమేరకుకొవ్వు లభ్యం కాకపోవడమే నన్నారు. దిగుమతి కొవ్వును సరఫరా చేయడానికి ప్రభుత్వ వాణిజ్య సంస్థ అంగీకరించిందని, కాని పరిశ్రమల అవసరాల మేరకు కొవ్వు సరఫరా చేయలేకపోయిం దన్నారు. వేరుశెనగ నూనె ధరకూడా విపరీతంగా పెరిగిందన్నారు.

ప్రభుత్వ వాణిజ్యసంస్థ కొవ్వును సరిగా పంపిణీ చేయడంలేదన్న విషయాన్ని శ్రీ చావన్ ఖండించారు.

వాడకందార్లను దృష్టిలో వుంచుకోకుండా ఒక్క ఉత్పత్తిదార్లను మాత్రమే దృష్టిలో వుంచుకుని, ధరల పెరుగుదలను ప్రభుత్వం అనుమతించిందని శ్రీ లిమాయే విమర్శించారు.

ఈ విధంగా ధరలను పెంచడాన్ని ప్రభుత్వం చూస్తూ వూరుకుంటే, రక్షణ శాఖకు, ఇతర శాఖలకు పెద్ద యెత్తున సబ్బులు కొను

(మిగతా 2 వ పేజీలో)

బద్రి విశాల్ పిట్టి రాజీనామా

హైదరాబాద్ ఏప్రిల్ 14

యస్. యస్. పి. కేంద్ర పార్లమెంటరీ బోర్డు కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు యస్. యస్. పి. కి చెందిన రాష్ట్ర శాసనసభ సభ్యుడు శ్రీ బద్రీ విశాల్ పిట్టి నేడు ప్రకటించారు.

ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు తెలంగాణా ప్రజల ఆందోళనలో పూర్తిగా పాల్గొనేందుకుగాను తాను కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు ఆయన ప్రకటించారు.

పరిస్థితి ప్రాధాన్యతను యస్. యస్. పి. జాతీయ కమిటీ గుర్తించలేదని నేడు విడుదల చేసిన ప్రకటనలో శ్రీ పిట్టి పేర్కొన్నారు.

దోపిడీ చేయబడ్డామనే భావన అన్ని వర్గాల తెలంగాణా ప్రజలలో ఏర్పడింది. ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు మినహా సమస్యను పరిష్కరించేందుకు మరోమార్గం లేదని తాను అభిప్రాయపడ్డానని ఆయన వివరించారు. సమైక్యత కొరకు చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమయినట్లు రుజువయిందని శ్రీ పిట్టి అన్నారు.

దుమ్ముగూడెంలో పోస్టాఫీసుకు నష్టం

భూకంపనలో

భద్రాచలం, ఏప్రిల్ 14

గత రాత్రి 8.41 గంటల ప్రాంతంలో సంభవించిన భూకంపంలో భద్రాచలం ఏజన్సీ ప్రాంతంలోని దుమ్ముగూడెం తపాలా కార్యాలయ భవనం కొంత కూలిపోయింది. మరికొన్ని భవనాలు బీటలు వారాయి.

తొలి వార్తలు

(5 వ పేజీలో)

తరిగొప్పులలో అస్వస్థవ్యక్తి మృతి

తరిగొప్పుల, ఏప్రిల్ 14

గన్నవరం తాలూకా తరిగొప్పుల పరిసర గ్రామంలో 13 వ తేదీరాత్రి 8 గంటలకు 3 సెకండ్లపాటు భూమి ప్రకంపించింది. ఇండ్లలో మంచాలపై నున్నవారు కొందరు క్రిందపడ్డారు. ఇండ్లపై పెంకులు ధ్వని వచ్చాయి. పాములపాడులో ఇంటిపైనుండి పెంకులు క్రిందపడ్డాయి, ప్రజలు భయభ్రాంతులై వీధులలోకి గంటవరకు లోపలకు భయందో వెళ్ళలేకపోయారు. కొంతకాలం నుండి అస్వస్థతతోనున్న వక్కల రామారావు అనేవ్యక్తి వేంపాడులో ఈ సమయంలో మంచంఅదిరి ప్రాణం కోల్పోయాడని చెప్పబడుతుంది.

కొత్తగూడెంలో

నిన్నరాత్రి కొత్తగూడెం పట్టణంలోకూడా రాత్రి 8 గంటల 55 నిమిషాలకు భూమి కంపించింది.

పెద్ద శబ్దంతో వచ్చిన భూకంపానికి ఇండ్లు వూగిపోయాయి. కొన్ని భవనాల గోడలు పగుళ్ళిచ్చాయి.

సినిమాహాలులలో ప్రేక్షకులు తమ సీట్ల మీదనుండి క్రిందకు పడిపోయారు. బాపు కేంద్రం వద్ద కొన్ని ఇండ్లు పడిపోయాయి. సినిమా హాలుల్లో క్రిందపడటం వలన 15 మంది గాయపడ్డారు. ఒక బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు.

చావన్ బర్తరఫ్‌కై డిమాండ్

లోక్‌సభలో ప్రధానికి శ్రీ డాంగే విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

రాష్ట్రాల పట్ల భిన్నమైన వైఖరులను అవలంబిస్తున్న హోం శాఖా మంత్రి శ్రీ వై. బి. చావన్‌ను బర్తరఫ్ చేయవలసిందిగా కమ్యూనిస్టు పక్ష నాయకులు శ్రీ యస్. ఎ. డాంగే డిమాండ్ చేశారు. వెంటనే శ్రీ చావన్‌ను తొలగించవలసిందిగా శ్రీ డాంగే ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

కోసిపూర్ కాల్పులపై రక్షణ శాఖామంత్రి ప్రకటనను, బెంగాల్ బంద్‌పై హోంమంత్రి ప్రకటనలపై చర్చను ప్రారంభిస్తూ శ్రీడాంగే చావన్‌ను డిస్‌మిస్ చేయాలనే డిమాండు చేశారు,

బెంగాల్ బంద్ కాల్పులపై వివరాలను వివరిస్తూ దాదాపు రు. 20 కోట్లు నష్టం కలిగించిన శివసేన దురంతాలపైన ప్రకటన చేయని శ్రీచావన్, బెంగాల్‌సమ్మెపై మాత్రం ప్రకటన చేశారు, అని శ్రీ డాంగే అన్నారు. ఆర్థికజీవితం స్తంభించినందుకుకాక, కమ్యూనిస్టుల మెజారిటీగాగల ఐక్యసంఘటన ప్రభుత్వాన్ని నష్టపరిచేందుకు శ్రీ చావన్ ప్రకటన చేశారని శ్రీ డాంగే అన్నారు.

శ్రీ చావన్ రాజకీయ యుద్ధాన్ని చేస్తున్నారని ఆయన అన్నారు.

తనకు యిష్టంలేని మంత్రివర్గాన్ని అభాసుపాలు చేసేందుకు శ్రీచావన్ రాజ్యాంగంలోని 256 257 ఆర్టికల్స్‌ను ప్రస్తావించారు. ప్రజాస్వామ్య సంఘటనకు చెందిన మంత్రివర్గంపై శ్రీ చావన్ యుద్ధాన్ని ప్రకటించారని శ్రీ డాంగే విమర్శించారు.

ముఖ్యమైన వాటర్ సప్లయి. ఆస్పత్రులు. అంతర్జాతీయ రవాణాలలో రాష్ట్ర ప్రభుత్వం సమ్మెకు అనుమతించలేదన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న ఈ మంచి వైఖరిని హోం శాఖామంత్రి తన ప్రకటనలో ప్రస్తావించి వుండవలసిందని శ్రీ డాంగే అన్నారు.

ఆంధ్రప్రదేశ్, బొంబాయి, బెంగాల్‌లలో అనేక సందర్భాలలో సైన్యాన్ని వినియోగించడం జరిగింది, అయితే ఏ హోంమంత్రి ఒక వైఖరిని తీసుకోలేదు అని శ్రీ డాంగే అన్నారు,

కోశిపూర్ కాల్పులపైన్యాయ విచారణను ఏర్పాటు చేసేముందు శ్రీ చావన్ రాష్ట్ర ప్రభుత్వాన్నిసంప్రదించలేదు శ్రీచావన్ బిర్లాల బంటు అని శ్రీ డాంగే విమర్శించారు.

పశ్చిమ బెంగాల్‌లో పరిశ్రమలు ఎదుర్కొంటున్నాయని మొదటిరోజుసమావేశంలో ప్రసంగించిన వాణిజ్యమండలి అధ్యక్షుడు శ్రీ మోడీ కొంతమంది పారిశ్రామికవేత్తల అభ్యంతరంతో తన ప్రకటనను సరిదిద్దుకున్నారు, శ్రీ మోడీ నుండి ఏ దైన

(మిగతా 2 వ పేజీలో)

శాసనమండలి సభ్యుని అరెస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 14

శాసనమండలి సభ్యులు శ్రీ జి. వి. సుధాకరరావును నేడు పోలీసులు 151 సెక్షన్ క్రింద ఆయన నివాసంవద్ద అరెస్టు చేశారు.

ప్రత్యేక తెలంగాణా ఆందోళనలో శ్రీ సుధాకరరావు కూడా వున్నట్లు భావిస్తున్నారు.

గుండె మార్పిడి రోగి మృతి

టెక్సాస్, ఏప్రిల్ 15

ఆరునెలల క్రితం హూస్టన్‌లో గుండె మార్పిడి చేసిన రోగి విలియమ్ హారిసన్ నిన్న చనిపోయారు. హూస్టన్‌లో గుండె మార్పిడిజరిగిన రోగులలో హారిసన్ 18 వ వాడు.

ఆంధ్రలోని

పొగాకునిల్వలకొనుగోలుకు ప్రభుత్వవ్యాపారసంస్థనిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13

ఆంధ్రప్రదేశ్ పొగాకుమార్కెట్ లోనికి ప్రవేశించి కోట్లరూపాయల విలువచేసే నిల్వలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వవ్యాపార కార్పొరేషన్ నిశ్చయించింది.

దానికి సంబంధించిన వివరాలు తయారు చేయబడుతున్నాయి.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ కె. రఘురామయ్యతో సహా అనేక మంది పార్లమెంట్ సభ్యులు ఈ విషయమై కేంద్ర విదేశీ వాణిజ్యమంత్రి శ్రీ బి. ఆర్ భగత్‌వద్దకు రాయబారం జరిపిన విషయం పాఠకులెరిగినదే

20 మంది బీహార్ ఉపాధ్యాయుల అరెస్టు

పాట్నా ఏప్రిల్ 14

ధర్నా జరుపుతున్నందుకు బీహార్ యూనివర్శిటీకి చెందిన 20 మంది ఉపాధ్యాయులను నేడు అరెస్టు చేశారు.

నాల్గవ ప్రణాళికలో లక్ష 25 వేల పంపు సెట్లకు విద్యుత్ సప్లై

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

నాల్గవ ప్రణాళికా కాలంలో 1 లక్ష 25 వేల పంపుసెట్లకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయుటకు ప్రభుత్వం నిశ్చయించినట్లు ఇంధన విద్యుత్‌శాఖమంత్రి శ్రీ కె. యల్. రావు నేడు లోక్‌సభలో తెలియజేశారు.

జాతీయ గ్రిడ్‌ను ఏర్పాటు చేయుటలోగల అవరోధాలను నాల్గవ ప్రణాళికలో తొలగించి వేయటం జరుగుతుందన్నారు 5 వ ప్రణాళికలో తీగలు వేయుట పూర్తిచేయుటం జరుగుతుందన్నారు. ఈ పనులన్నీ పూర్తయితే దేశంలోని ఏ ప్రాంతానికి విద్యుచ్ఛక్తికొరత వుండబోదన్నారు.

కేంద్ర విద్యామంత్రితో జెకోస్లోవేకియా యువకుల భేటి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

30 మంది సభ్యులు గల జెకోస్లోవేకియా యువజన ప్రతినిధివర్గం నేడు కేంద్ర విద్యాశాఖ మంత్రి శ్రీ వి. కె. ఆర్. వి. రావును కలుసుకుంది.

ప్రతినిధివర్గంలో వివిధ రంగాలలో పని చేసే యువతి, యువకులు వున్నారు.

భారత దేశంలో జెకోస్లోవేకియా యువజన ప్రతినిధివర్గం గడిచిన 15 రోజులలో బొంబాయి, ఉదయపూర్, జైపూర్, ఆగ్రా పట్టణాలలో పర్యటించింది.

యువజన ప్రతినిధివర్గం పర్యటనను జెకోస్లోవేకియా యువకుల, విద్యార్థుల ట్రావెలింగ్‌బ్యూరో ఏర్పాటు చేసింది. జెకోస్లోవేకియాలో యువజనసంఘాలు పని చేసే విధానాలను ప్రతినిధివర్గం మంత్రికి వివరించింది.

ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కార్మికోద్యమానికి గొడ్డలిపెట్టు

రాజ్‌బహదూర్‌గౌడ్ ప్రభృతుల ఉద్ఘాటన

హైదరాబాద్, ఏప్రిల్ 14

ప్రత్యేక తెలంగాణావాదం స్వార్థపరులైన భూస్వామ్యవర్గం తాతా, బిర్లాలవంటి పెట్టుబడిదారీ వర్గం సృష్టించిన నినాదమనీ. యిదిబలమైన కార్మికోద్యమానికి గొడ్డలి పెట్టనీ, భూస్వామ్యవర్గం తమగుప్పిట్లోకి అనువుగా అధికారాన్ని మలుచుకొని. మధ్యయుగాలనాటి భూస్వామ్య పాలనను తిరిగి కొనసాగించడానికి లేవనెత్తిన సంకుచిత నినాదమనీ, యిది తెలంగాణా ప్రజలకు అత్యంత హానికరమని డాక్టర్ రాజబహదూర్‌గౌడ్ ప్రభృతులు నిన్న నల్లగొండ జిల్లా, రామన్నపేట తాలూకా ఆత్మకూరులో ఉద్ఘాటించారు.

శ్రీ చంద్రయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో దాదాపు 5 వేల మంది పాల్గొన్నారు.

శ్రీ గౌడ్ ప్రసంగిస్తూ, అశేషత్యాగాలతో సాధించిన విశాలాంధ్రకు ఈనాడుభూస్వామ్య వర్గం, స్వార్థపరులైన పాలక వర్గం, వ్యతిరేక మురా నాయకులంతా చిచ్చు పెట్టి,

(మిగతా 2 వ పేజీలో)


ఈ నెల 16 విడుదల!
తన దేశం కోసం, తన ప్రజల కోసం శత్రువుల నెదిరిస్తూ, అనంతమైన పోరాటాలు సాగించి, భయానక కరమైన సన్నివేశాలల్లో చిక్కుకొని, తనకు తానే విడిపించుకొంటూ దుష్టపునాహాలకు ఎదురీదిన అసమాన గూఢచారి గాథ. ఇంతవరకు విడుదలయిన ఎన్నెన్నో ఇంగ్లీషు, హాలీవుడ్ చిత్రాలను తలదన్నేలా నిర్మించిన అసలు సిసలు భారతీయ చిత్రం.
మరచిపోలేని మధుర బ్రహ్మాండమైన వినోదం!
సాగర్ ఫిలింస్ సమర్పించు
గూఢచారి సి.ఐ.డి. 999
VIJAYA
నిర్మాత: సి.హెచ్. సీతారామరాజు
విజయ రిలీజ్.

షట్సూత్ర పథకానికి ఇజ్రాయిల్ తిరస్కృతి

జెరూసలెం, ఏప్రిల్ 14

జోర్డాన్‌రాజు హుస్సేన్ యిటీవల వాషింగ్టన్ నుండి ప్రతిపాదించిన షట్సూత్రశాంతి పథకాన్ని ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి అబ్బాఎబాన్ నిన్న తిరస్కరించాడు.

పరస్పర సార్వభౌమత్వాన్ని గౌరవించుకునే రాజ్యాలు తమ మధ్యగల యుద్ధపరిస్థితిని తొలగించుకోటానికి సంప్రదింపులొక్కటే మార్గమనీ, యుద్ధానికి దారితీసిన పరిస్థితులకు తిరిగి వెళ్ళడంద్వారా శాంతి సాధింపబడదనీ ఎబాన్ అన్నారు.

కాందిశీకుల సమస్యకు అంతర్జాతీయ పరిష్కారం విషయంలో ఇజ్రాయిల్ సూచనలకు రాజు హుస్సేన్ ఎందు కంగీకరించ లేదని ఎబాన్ ప్రశ్నించారు.

నాజరు తరపున హుస్సేన్‌రాజు మాట్లాడుతున్నామని చెపుతున్నాడు. నాజరే స్వయంగా యీ ప్రతిపాదనలు చెయ్యవచ్చు కదా అని ఎబాన్ ప్రశ్నించారు.

గున్నార్ జారింగ్ ద్వారా అరబ్బులు ఇజ్రాయిల్‌తో జరిపిన సంప్రదింపులను బట్టి ఇజ్రాయిల్ 1967 యుద్ధానికి పూర్వపు స్థానాలనుండి యింకా వెనక్కు- 1947 నాటి స్థానాలకు మరలవలని వుంటుందనీ. యీ సూచన అర్థశూన్యమైనదని ఎబాన్ చెప్పారు.

జోర్డాన్‌రాజు ప్రకటన

న్యూయార్క్, ఏప్రిల్ 14

1967 నాటి ఐ. రా. స. తీర్మానాన్ని అంగీకరించానని చెప్పుకొంటున్న ఇజ్రాయిల్ తనషట్సూత్ర శాంతిపథకాన్ని అంగీకరించక పోవడానికి కారణమేమీ కనిపించటం లేదని జోర్డాన్ రాజు హుస్సేన్ చెప్పారు.

వాడు ఐరాస సూత్రాల ప్రాతిపదికను ఆమోదించక, ఆక్రమిత అరబ్బు భూభాగాలనూ, జెరూసలెంనూ పట్టుకు ప్రాకులాడుతూ ఉన్నట్లయితే ఇజ్రాయిల్‌తో సంప్రదింపుల అవసరం ప్రసక్తేలేదని రాజు చెప్పారు.

అరబ్బు భూభాగాలనుండి ఇజ్రాయిల్ ఉపసంహరించుకున్నట్లయితే, ఇజ్రాయిల్‌తో ప్రత్యక్ష సంప్రదింపులు జరుపుతారా అన్న ప్రశ్నకు ఐరాస ప్రతినిధి గున్నార్ జారింగ్ ద్వారా జరుపుతామని చెప్పారు. అంటే ప్రత్యక్ష సంప్రదింపులు జరపరన్నమాటేనా? అని ప్రశ్నించగా యిప్పుడే చెప్పలేనని చెప్పారు.

పశ్చిమాసియా ప్రశ్నకు న్యాయబద్ధ, శాంతియుత పరిష్కారం కనుగొనబడితే పాలస్తీనా వాసులందరూ అత్యధిక అరబ్బు గెరిల్లాలతోపాటు దాన్ని ఆమోదిస్తారని తాను ఆశిస్తున్నానని రాజు చెప్పారు.

ఇజ్రాయిల్ అణ్వాయుధాలను యిప్పటికే తయారుచేసి యుండకపోతే ఆరునెలల్లోగా తయారు చేస్తుందని మరోప్రశ్నకు జవాబిస్తూ రాజుహుస్సేన్ చెప్పారు.

ఒక టెలివిజన్ ప్రసారంలో పాల్గొంటూ యుద్ధాపూర్వపు సరిహద్దుల ప్రాతిపదికపై కొన్ని సర్దుబాట్లు చేసుకోవచ్చుననీ, తన షట్సూత్రపథకాన్ని గెరిల్లాలతోసహా అరబ్బులందరూ బలపరుస్తున్నారనీ అరబ్బు దేశాలపై సైనిక శక్తిలో ఇజ్రాయిల్ కొన్నేళ్ళపాటు అధిక్యత కలిగియుంటుందని తానంగీకరిస్తున్నాననీ, అయితే కాలక్రమేణా ఇజ్రాయిల్‌పై అరబ్బు రాజ్యాలు ఆధిక్యతను సంపాదించి తీరుతాయని రాజు చెప్పారు.

జెరూసలెంపై అరబ్బులకుగల హక్కులు గుర్తింపబడినట్లయితే, జెరూసలెంను అంతర్జాతీయ నగరంగా చెయ్యటానికి తాను ఒప్పుకోజాలకపోయినా, దాన్ని ప్రశాంత మహానగరంగా తయారుచెయ్యటానికి కాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు.

ఇజ్రాయిల్ ఉపసంహరణ జరిగితే తూర్పు పాలస్తీనాలోని అరబ్బులు స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరచుకుంటారని తా ననుకోటం లేదని చెప్పారు.

తర్వాతకూడా జోర్డాన్ రాజ్యాల కూటమి సమైక్యంగా వుంటుందని చెప్పారు.

సూయజ్ కాల్వమీదుగా ఇజ్రాయిల్ - ఈజిప్టు దళాల మధ్య కాల్పులు

బీరుట్, ఏప్రిల్ 14

సూయజ్ కాల్వ మీదుగా ఈజిప్టు - ఇజ్రాయిల్ దళాలమధ్య నిన్న మధ్యాహ్నం ప్రారంభమైన కాల్పులు యింకా కొనసాగుతున్నాయి.

ఇస్మాయిలియా - కంటారాలమధ్య 40 కిలో మీటర్ల వెడల్పున సూయజ్ కాల్వ మీదుగా నిన్నజరిగిన పోరాటం 95 నిముషాల పాటుజరిగింది. ఈపోరాటంలో ఇజ్రాయిల్‌కు విశేషమైన నష్టాలు జరిగినట్లు తెలుస్తోంది. 15 మంది ఇజ్రాయిలీ సైనికులు చనిపోయారని ఈజిప్టు ప్రతినిధి తెలిపారు.

ఇజ్రాయిల్‌కు చెందిన రెండు జెట్ విమానాలు అరబ్బు భూభాగంలోనికి చొచ్చుకు వెళ్ళడమే యీ పోరాటానికి తక్షణ కారణమైనట్లు తెలుస్తోంది.

బాగ్దాద్‌లో నల్గురుఅమెరికన్ ఏజెంట్ల ఉరితీత

బాగ్దాద్, ఏప్రిల్ 14

అమెరికా తరపున గూఢచారి చర్యలకు పాల్పడ్డారన్న ఆరోపణపై మరో నలుగురు ఇరాకీలు మొన్న యిక్కడ ఉరితీయబడ్డారు. దీనితో గత మూడు నెలల్లో ఉరితీయ్యబడిన ఇరాకీల సంఖ్య 26 కు చేరుకుంది.

టోక్యో, ఏప్రిల్ 14

జనవరి ప్రారంభంనుండి ఏప్రిల్ తొలి భాగం మధ్యకాలంలో 350 మంది ప్రభుత్వ సైనికులను థాయిలాండ్ కమ్యూనిస్టు గెరిల్లాలు హతమార్చారని చైనా నిన్న తెలిపింది.

శంకరాచార్య ప్రకటనపై ప్రత్యక్షచర్యలు

శ్రీ సంజీవయ్య హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 14

అస్పృశ్యతపై ప్రకటన చేసిన పూరీ శంకరాచార్యపై చర్య తీసికొనకపోతే తామే ఆయనపై సత్వర చర్యలు తీసుకోవడానికి ఉద్యుక్తులౌతామని కేంద్రమాజీ మంత్రి శ్రీ డి సంజీవయ్యనేడిక్కడ ప్రకటించారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత రాజ్యాంగంలో షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక రక్షణలకుహామీలేర్పరచబడిన 20 సంవత్సరాలతరువాత పూరీ శంకరాచార్య యింకా అస్పృశ్యతను గురించి ప్రకటన చేయటంపట్ల శ్రీ సంజీవయ్య ఒక పత్రికా గోష్ఠిలో తన ఆగ్రహాన్ని వెల్లడించారు.

అస్పృశ్యతపై ప్రకటన చేసిన పూరీశంకరాచార్యపైన్యాయచర్యకు కేంద్రం, లేదారాష్ట్ర ప్రభుత్వం చర్యలుతీసుకోవాలనితానుమరో43 మంది పార్లమెంటుసభ్యులు కేంద్రప్రభుత్వానికి మెమోరాండంసమర్పించినట్లుశ్రీ సంజీవయ్య చెప్పారు.

ప్రభుత్వం శంకరాచార్యపై చర్యలు తీసుకోవడానికి విఫలమైతే, షెడ్యూల్డు కులాలు, తెగలు ఆ పనిచేయడానికి ఒక గొప్ప ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి ఉద్యుక్తులౌతాయని ఆయనమెమోరాండంలో పేర్కొన్నారు.

నేటినుండే శంకరాచార్యపై చర్యతీసుకోవాలని తాము గడువు పెట్టామని. అయితే ప్రధాన మంత్రి కొద్దికాలమైనందున యింకా పొడిగించమని కోరగా, 4 లేదా 5 రోజులు గడువిచ్చామని ఆయన చెప్పారు.

శ్రీ శంకరాచార్య తానా ప్రకటన చేయలేదని చెబుతున్నారని ఒక విలేకరి యడుగగా ఆ వివరాలను గూడా దృష్టిలో వుంచుకోవాలి అని అన్నారాయన.

ప. జర్మనీ కమ్యూనిస్టు పార్టీ విజ్ఞప్తి

జి. డి. ఆర్. గుర్తింపుకు

బాన్, ఏప్రిల్ 14

ఎనిమిది నెలల క్రితమే స్థాపించబడిన పశ్చిమ జర్మనీ కమ్యూనిస్టుపార్టీ (డి.కె.పి.) తూర్పు జర్మనీని పశ్చిమ జర్మనీ గుర్తించాలని నిన్న ప్రకటించింది.

పశ్చిమ జర్మనీ కమ్యూనిస్టుపార్టీ తన ప్రథమ మహాసభలో దీర్ఘకాల సాంఘిక, రాజకీయ మార్పులను కోరుతున్న పార్టీ తమ దొక్కటేననికూడ ప్రకటించారు.

కమ్యూనిస్టుపార్టీపై 1956 లో పశ్చిమ జర్మనీ సుప్రీంకోర్టు విధించిన నిషేధపు టుత్తరువును రద్దు చేసుకోవాలనీ, మితవాద నేషనల్ డెమోక్రటిక్ పార్టీని రద్దు చేయాలనికూడా మహాసభ కోరింది.

మున్సిపల్ కార్మికు అధికారుల మధ్య ఒప్పందం

సమ్మె సంకల్పం విరమణ

(విశాలాంధ్ర విలేకరి)

గుంటూరు, ఏప్రిల్ 14

మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ అధికారులమధ్యయీనెల 11వ తేదీన జిల్లాలేబర్ ఆఫీసర్ సమక్షంలో ఒప్పందం కుదిరిన ఫలితంగా యీ నెల 16 వ తేదీన ప్రారంభం కావలసిన మునిసిపల్ కార్మికసమ్మె విరమించారు.

అధికారులకు మునిసిపల్ కార్మిక సంఘానికి సెక్షన్ 12 (3) వివాదాల చట్టం 1947 క్రింద ఈ ఒప్పందం కుదిరింది.

ఈ ఒప్పందం ప్రకారం 110 మంది అదనపు కార్మికులను నియమించడానికి మున్సిపల్ కౌన్సిల్ అంగీకరించి ప్రభుత్వ అధికారులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్నది. వారిని నియమించుకొనడానికి కృషి చేస్తామని హామీ యిచ్చారు.

అదనపు సిబ్బంది నియామకంలో సీనియారిటీ అమలు జరుపుతారు.

గత 15 సంవత్సరాలనుండి తాత్కాలిక పద్ధతులపై వున్న 17 మలేరియా పోస్టులను పర్మనెంటు చేయడానికి కౌన్సిల్ ఆమోదంతో ప్రభుత్వాన్ని కోరడానికి అంగీకరించారు.

చనిపోయిన లేక రిటైర్ అయిన కార్మికులకు బోనస్ ఫండ్ నెలరోజులలోగా యిచ్చుటకు ప్రస్తుత పరిస్థితులలో రెండు నెలలలో యిచ్చుటకు అంగీకరించారు.

ప్రస్తుతంవున్న కార్మికుల కాలనీని రిపేరు చెయ్యడం అదనంగా 786 ఇండ్లు కట్టించడానికి అంగీకరించారు.

కనీస వేతన కమిటీ రిపోర్టు ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని కౌన్సిల్ తీర్మానం ద్వారా ప్రభుత్వాన్ని అడగడానికి అంగీకరించారు.

సంప్రదింపులలో కార్మికుల తరపున సంఘం అధ్యక్షులు చిన్నముని ప్రధాన కార్యదర్శి బి. కోటేశ్వరరావు కార్యదర్శి భూపతి వీరరాఘవులు మున్సిపల్ అధికారుల తరపున డిప్యూటీ సెక్రటరీ శ్రీ నాగేశ్వరరావు హెల్త్ ఆఫీసర్ కె. వి. సుబ్బారావు పాల్గొన్నారు

కాలికట్ కార్పొరేషన్ కార్మికుల సమ్మె

కాలికట్, ఏప్రిల్ 14

కాలికట్ మునిసిపాలిటి కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్నందువల్ల పట్టణంలోని రోడ్లన్నీ చెత్తా చెదారంతో నిండివున్నవి.

కరువు భత్యాన్ని పెంచవలసిందిగా కోరుతూ గత మూడు దినములనుండి దాదాపు వేయిమంది కార్మికులు సమ్మె చేస్తున్నారు.

కార్పొరేషన్ అధికారులకు, కార్మిక నాయకులకుమధ్య జరిగినచర్చలు విఫలమయ్యాయి.

ఏప్రిల్ 10 నుండి కరువుభత్యాన్నిపెంచుతామని గత డిసెంబరులో మేయరు తమకు హామీ యిచ్చినట్లు కార్మిక నాయకులు చెపుతున్నారు. అలాంటి హామీని తాను యివ్వలేదని మేయరు శ్రీ శంకరనారాయణ చెపుతున్నారు.

కరువు భత్యాన్ని పెంచుటకు చాలా ఖర్చు అవుతుంది. కనుక కౌన్సిల్ మీటింగులో ఈ విషయాన్ని గురించి నిర్ణయం తీసుకోవలసి వుంటుందన్నారు.

వేర్పాటు ఉద్యమ విరమణకు కమ్యూనిస్టునాయకులవిజ్ఞప్తి

దేవరకొండ తాలూకా పర్యటనలు

హైదరాబాద్, ఏప్రిల్ 14

భారత కమ్యూనిస్టుపార్టీ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యవర్గసభ్యుడు డాక్టర్ రాజబహదూర్‌గౌడ్, ప్రదేశ్ కౌన్సిలు సభ్యురాలు శ్రీమతి ఆరుట్ల కమలాదేవి, నల్గొండ జిల్లాకమ్యూనిస్టు నాయకుడు శ్రీ మోటూరి పరంధామయ్య, కార్యదర్శి శ్రీ యు. నారాయణరావు, దేవరకొండ తాలూకా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ రామ శర్మ యీనెల 10, 11, 12 తేదీల్లో దేవరకొండ తాలూకాలో జరిపిన పర్యటన సందర్భంగా గుండేపల్లి (దిండి ప్రాజెక్టు), కంకుదుర్రు, గడియగౌరారం లలో సభలను, సదస్సులను జరిపారు

తెలంగాణా అభివృద్ధి, తెలంగాణా వాసుల ఉద్యోగాల విషయంలో జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం జరపవలసిందేననీ, అయితే 4 కోట్ల తెలుగు మహాజనుల సమైక్యతను, ఆంధ్ర ప్రదేశ్ సమైక్యతను కాపాడేందుకు కృషి చెయ్యమనీ నాయకులు తమ ఉపన్యాసాల్లో ప్రజలను ఉద్బోధించారు.

దేశమంతటలోనూ వేర్పాటు ధోరణులను రెచ్చగొట్టి మొత్తం దేశాన్ని బలహీనపరచే ఆంధ్రప్రదేశ్ విభజనను కేంద్రప్రభుత్వంగాని, బాధ్యతాయుతమైన ఏ రాజకీయ పార్టీగాని అంగీకరించ జాలదు.

జరిగిన అన్యాయాలకు వేర్పాటు పరిష్కార మార్గం కాకపోవడం మాట అటుంచి. తెలంగాణానూ, ఆంధ్రప్రదేశ్‌లోని మిగతాభాగాన్ని బలహీనపరుస్తుందని నాయకులు వివరించారు.

భూస్వామ్య, పెట్టుబడిదారీ స్వార్థపర శక్తులు ప్రజల్లో అసంతృప్తిని రెచ్చగొట్టి, భ్రాతృహత్యా సదృశమైన పోరాట మార్గంలోకి దాన్ని మళ్ళించాలని కోరుతున్నారు, ప్రస్తుత వేర్పాటు ఉద్యమం ఆ స్వార్థపరులకు మాత్రమే ఉపయోగపడుతుంది. కాగా, వారి యీ కుట్రలను గుర్తించకుండా వామపక్ష ప్రజాతంత్ర శక్తులు తమను తాము కాపాడుకోవాలని కమ్యూనిస్టు నాయకులు హెచ్చరించారు.

వేర్పాటు నినాదాన్ని విడిచిపెట్టి,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు మిగులు నిధుల పూర్తి వినియోగానికి, తెలంగాణా శీఘ్రతరాభివృద్ధికి, ఉద్యోగాలకు చట్టబద్ధ రక్షణలకు పోరాడవలసిందిగా "కుపితయువకులకు" వారు విజ్ఞప్తి చేశారు.

అలా చేసిననాడు వారి యీడిమాండులను రాష్ట్రంలోని, మొత్తం దేశంలోని యావత్తు ఉత్తమ శక్తులూ బలపరుస్తాయని వారు చెప్పారు.

ఆత్మహత్యాసదృశమైన వేర్పాటు నినాదాన్ని విడిచిపెట్టిననాడు మాత్రమే తెలంగాణాకు జరిగిన అన్యాయాలను పూర్తిరద్దు చెయ్యడానికి రాష్ట్రవ్యాపితమైన బ్రహ్మాండమైన 'బంద్' ఉద్యమాన్ని నిర్వహించగలుగుతామని నాయకులు చెప్పారు.

కొండ ప్రాంతాలకు పూర్తిరాష్ట్ర ప్రతిపత్తి

అస్సాం పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ సత్యాగ్రహం

షిల్లాంగ్, ఏప్రిల్ 14

అస్సాం కొండప్రాంతాలను సంపూర్ణ ప్రతిపత్తిగల ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని డిమాండుచేస్తూ పీపుల్సు డెమొక్రటిక్ పార్టీకిచెందిన ముగ్గురు నాయకులు రాజభవన్ ఎదుట నేడు రెండవ దఫాగా నిరవధిక సత్యాగ్రహం ప్రారంభించారు. 22 మంది కార్యకర్తలు 12 గంటలపాటు సత్యాగ్రహం చేస్తున్నారు.



సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల నిరాహారదీక్ష జరిపిన ఒంగోలు సి.యస్.ఆర్. శర్మ కళాశాల అధ్యాపకులు

యస్. యమ్. జోషి రాజీనామా: యస్.యస్.పి అధ్యక్ష పదవికి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

సంయుక్త సోషలిస్టుపార్టీ అధ్యక్ష పదవికి శ్రీ యస్. యమ్ జోషి రాజీనామాయిచ్చారు.

పార్టీలోని వ్యక్తులు తమ తమ నైతిక విలువలను పెంపొందించుకొనుటకు, పార్టీ నాయకులు తమ బాధ్యతలను గుర్తెరుంగుటకు, తోడ్పడుతుందనే వుద్దేశ్యంతో నే తాను రాజీనామా చేసినట్లు ఆయన నేడొక ప్రకటన ద్వారా తెలియజేశారు.

పార్టీ నాయకత్వాన్ని విమర్శిస్తూ శ్రీజార్జి ఫెర్నాండెజ్ ఇటీవల చేసిన ప్రకటనను పేర్కొంటూ, పార్టీనాయకత్వంపై విశ్వాసం లేకపోవుటవల్లనే సహజంగా అలాంటి ప్రకటనలు చేస్తుంటారని శ్రీజోషి అన్నారు. ఈ లాంటి పరిస్థితులలో తాను రాజీనామా చేయటమే మంచిదని భావిస్తున్నానన్నారు.

డాక్టర్ రామమనోహర్ లోహియా కాలంలో పార్టీకున్న పేరుప్రతిష్టలు యిప్పుడు లేవని అన్నారు. పార్టీలోని అసూయా ద్వేషాలను అరికట్టుటకు ముఠాతత్వాలు ఒకరిపై ఒకరు విమర్శించుకొనుట ఏ విధంగాను తోడ్పడదని తన తోటి నాయకులు చెప్పారని, కాని అలా చెప్పినవారే ముఠాతత్వాలను బలపరుస్తున్నారని అన్నారు. బహిరంగంగా ఒకరినొకరు విమర్శించుకొనే విషయమై పార్టీలోని వ్యక్తులంతా తీవ్రంగా ఆలోచించాలని అన్నారు.

రాజ బహదూర్ ప్రసంగం

[1 వ పేజీ తరువాయి]

తెలుగు జాతినే చీల్చచూస్తున్నారు. 'ఆంధ్రులారా వెనుక్కు పొండి' అనే నినాదాన్ని లేవనెత్తి, ఆంధ్ర శబ్దానికే అపార్థం కల్పించ చూస్తున్నారు. ఇది ఆంధ్ర జాతికే కళంకమని చెప్పారు.

ప్రతాపరుద్రుని అనంతరం రెడ్డిరాజులు, కమ్మ భూస్వాములు, వెలమదొరలు తమ స్వార్థంకోసం తెలుగుజాతిని చీల్చారు, అమరావతి, కొండవీడు, రాచకొండలను రాజధానులుగా చేసుకొని, తెలుగుజాతిని మూడు ముక్కలుగా పాలించారు.

ఏకమైన తెలుగు జాతి తిరిగి బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుటిల రాజనీతికిగురైంది. నైజాం, సర్కారు, రాయలసీమ జిల్లాలను బ్రిటిష్ వారికి ధారాదత్తంచేసి, తెలుగుజాతిని మూడుముక్కలుగా చీల్చి, తమ నిరంకుశ పాలన కొనసాగించారు,

ముక్కచెక్కలై, తెలుగు జాతి అశేషత్యాగాలకోర్చి 1956లో విశాలాంధ్రను సాధించాం. ఆనాటి పెద్దమనుషుల ఒప్పందాన్ని 12 ఏళ్ళుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాచి, తెలంగాణా ప్రజలకు తీరని ద్రోహం చేసింది. 12 ఏళ్ళ పాపాలకు చిహ్నంగా మిగిలిన బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వానికి గోరీకట్టకుండా 'ఆంధ్రులారా వెనుక్కుపొండి' అనే నినాదం లేవనెత్తటం అత్యంత విచారకరమన్నారు.

భూస్వాముల సృష్టి అయిన ప్రత్యేక తెలంగాణా వాదాన్ని ప్రతిఘటించి, విశాలాంధ్ర సమైక్యతను కాపాడి, 12 సంవత్సరాల పాలనకు చిహ్నంగా మిగిలిన బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదించి, రాజ్యాంగ సవరణల ద్వారా తెలంగాణా రక్షణలను అమలు పరచడానికి పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీమతి ఆరుట్ల కమలాదేవి మాట్లాడుతూ- ప్రత్యేక తెలంగాణారాష్ట్రం తిరిగి నైజాం కాలంనాటి దొరలరాజ్యాన్ని కొనితెస్తుంది. ఇది పేద, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలనే హరించి వేస్తుంది. కాబట్టి విద్యార్థులందరూ యిది గుర్తించి, సమైక్యతావాదులతో తమ సంఘటిత శక్తిద్వారా బ్రహ్మానందరెడ్డిని గద్దెదించి, విశాలాంధ్ర ఐక్యతను కాపాడాలన్నారు.

శ్రీమతి బ్రిజ్‌రాణిగౌడ్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణా విషవలయంలో ప్రజలను బంధించాలని చూస్తున్నారు. ఇది తెలుగుప్రజలంతా గమనించాలన్నారు. ప్రజలను విషవలయంలో బంధింపచూసే భూస్వామ్యవర్గాన్ని శిక్షింపవలసిన బాధ్యత కార్మిక-కర్షకవర్గంపై ఉన్నదని గుర్తించి, రంగంలోకిదిగి, ప్రమాదకరమైన ప్రత్యేక తెలంగాణా వాదాన్ని ప్రతిఘటించి విశాలాంధ్ర సమైక్యతను కాపాడాలన్నారు. విద్యార్థులు యీ విషయం గుర్తించి, తమ శక్తిని సద్వినియోగం చేసి, సమైక్యతకై కృషిచేయాలన్నారు,

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంవల్ల తెలంగాణాకు ప్రయోజనం లేదు. తెలంగాణా ఆదాయం ప్రత్యేక తెలంగాణా ప్రభుత్వ యంత్రాంగానికే సరిపోతుంది. పారిశ్రామికంగా వెనుకబడుతుంది. దీనివల్ల నిరుద్యోగం పెరుగుతుంది. ఇది కార్మిక ఉద్యమానికి నష్టదాయకం కాబట్టి ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ప్రతిఘటించి తెలంగాణా రక్షణలకై పోరాడాలని, యిందుకు మొదటి గ్యారంటీగా బ్రహ్మానందరెడ్డిమంత్రివర్గం రాజీనామా చేయాలన్నారు.

నల్లగొండజిల్లా కమ్యూనిస్టుపార్టీ సహాయ కార్యదర్శి శ్రీ కె. రామచంద్రారెడ్డి, రామన్నపేట తాలూకా రైతు సంఘ కార్యదర్శి శ్రీ డి. నర్సిరెడ్డి ప్రత్యేక తెలంగాణా వాదాన్ని ప్రతిఘటించారు, ప్రఖ్యాత తెలంగాణా బుర్రకథ నాయకులు శ్రీ సుద్దాల హనుమంతు పాటలు పాడారు. బొందుగుల దళం వారిచే సాంస్కృతిక ప్రదర్శన జరిగింది. తరువాత శ్రీ జి. యాదగిరిరెడ్డికూడా ప్రసంగించారు

మోతీలాల్ కంపెనీ కార్మిక వివాదం పరిష్కారం

గుంటూరులో

గుంటూరు, ఏప్రిల్ 14

గుంటూరులో సంగడిగుంటలో వున్న మోతీలాల్ హరిప్రసాద్ అండ్ బ్రదర్స్ రిఫైనరీ అండ్ బాంక్ ఎక్స్‌పోర్టర్స్ ఇంపోర్టర్స్ కంపెనీ కార్మికుల యజమానుల మధ్య వివాదం పరిష్కారం అయినది.

ఈ కంపెనీలో ఈమధ్య ఆయిల్‌డబ్బాలు పోతున్నాయి ఈ కారణంతో యజమానులు జ్యోతిష్యులను పిలిపించి కార్మికులపై మాకుమ్మడిగానేరం ఆరోపించ జూశారు, కార్మికులు భయపడి 12 వ తేదీన పనులు మానుకొన్నారు. 14 వ తేదీ లోపల పనులలోనికి చేరాలని లేకపోతే 8 రోజుల పాట జీతం కోతపెడతానని యజమానులు నోటీసులు యిచ్చారు. కార్మిక నాయకులు శ్రీ కనపర్తి నాగయ్య జి. వి. కృష్ణారావు సంప్రదింపులలోపాల్గొన్న మీదట యజమానులు జ్యోతిష్యులతతంగాన్ని ఉపసంహరించుకోవడానికి తిరిగి కార్మికులను పనులలోనికి తీసుకోవడానికి అంగీకరించారు. యదావిధిగా కార్మికులు పనులలో పాల్గొన్నారు.

కాశ్మీర్ నాయకులతో శ్రీ చావన్ చర్చలు విఫలం

శ్రీనగర్, ఏప్రిల్ 14

కాశ్మీర్ ముఖ్యమంత్రి శ్రీ జి. యమ్. సాదిక్, శ్రీ మీర్‌ఖాశింల మధ్య తలఎత్తిన అభిప్రాయ భేదాలను తొలగించుటకు వారిరువురితో దేశీయాంగమంత్రి శ్రీ చావన్ జరిపిన చర్చలలో ఎలాంటి పరిష్కారమార్గం కుదర లేదని తెలుస్తుంది.

నిన్న మధ్యాహ్నం ఢిల్లీకి తిరిగివచ్చిన శ్రీ చావన్ చర్చలను గురించి ఎలాంటి విషయాలు వెల్లడించలేదు.

రాజధానికి బయలుదేరేముందు శ్రీ చావన్ శ్రీనగర్‌లోని కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను చూచారు. ఆయనవెంట ముఖ్యమంత్రి శ్రీ సాదిక్‌వున్నారు. తరువాత ముఖ్యమంత్రి శ్రీ సాదిక్, శ్రీ మీర్‌ఖాశింలతో కలసి విందారగించారు.

ముఖ్యమంత్రి శ్రీ సాదిక్ ఢిల్లీ వెళ్ళినపుడు తిరిగి చర్చలు కొనసాగగలవని అనుకొనుచున్నారు.

ప్రతి 5 గురి పిల్లలలో ఒకరికి దృష్టిలోపం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

ఢిల్లీ మునిసిపాలిటీ పాఠశాలల పిల్లలలో 5 గురిలో ఒక్కరికి దృష్టిలోపం వున్నట్లు అంధత్వ నిర్మూలన జాతీయ సంఘం వారు జరిపిన సర్వేవల్ల తెలుస్తుంది.

ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌వారు 7.012 మంది పిల్లలో పరిశీలించగా వారిలో 20శాతం పిల్లలు దృష్టిలోపం గలవాళ్ళు వున్నారు.

ఆరోగ్యశాఖ స్టేట్‌మంత్రి శ్రీచంద్రశేఖర్ పై విషయాన్ని నేడు లోక్ సభలో తెలియజేశారు.

ఎరువుల పరిశ్రమ అభివృద్ధికి రు. 1306కోట్లు:

విశాఖఎరువులఫ్యాక్టరీకిఅనుమతిమంజూరు

లోక్‌సభలో మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

నాల్గవప్రణాళికా కాలంలో ఎరువులపరిశ్రమ అభివృద్ధికి 1306 కోట్ల రూపాయల పెట్టుబడులను వినియోగిస్తామని కేంద్ర పెట్రోలియం రసాయనాల స్టేట్ మంత్రి శ్రీ డి. ఆర్. చావన్ నేడు లోక్ సభలో చెప్పారు.

ఈ కేటాయింపబడిన నిధులు ప్రస్తుతమున్న ఎరువుల కర్మాగారాలను విస్తరింపజేయడంతోపాటు క్రొత్త కర్మాగారాల నిర్మాణానికి ఉపయోగపడతాయని ఆయనఅన్నారు. ఈ మొత్తాన్ని ప్రయివేటు రంగానికి రు. 550 కోట్లు పబ్లిక్ రంగానికి రు. 756 కోట్లు కేటాయిస్తారు.

నాల్గవ ప్రణాళికలో తలపెట్టిన అన్ని విస్తరణ పథకాలు, కొత్త కర్మాగారాల నిర్మాణం పూర్తయితే 1973 74 నాటికి దేశం నత్రజని ఎరువులతో స్వయం సమృద్ధిని సాధిస్తుందని శ్రీ రామ్ స్వరూప్ విద్యార్థికి శ్రీ చావన్ చెప్పారు,

దుర్గాపూర్, కొచ్చిన్, మద్రాస్, బరౌనీ. కాన్పూరులలో కొత్త కర్మాగారాల నిర్మాణం పూర్తిగావస్తుంది.

నామ్‌రూప్, ఉద్యోగ మండల్ బరోడా వద్ద నున్న బజ్వా కర్మాగారాలను విస్తరింప జేయడం జరిగింది.

ట్రాంబే, కాండ్లా. గోవా, మంగుళూరులోని ఎరువులప్రాజెక్టులు, నిర్మాణంతోపాటు త్వరలో పనిగూడా ప్రారంభిస్తాయి.

మీర్జాపూర్, విశాఖపట్టణం మహారాష్ట్రలోని సేవానావలవద్ద ఎరువుల ఫ్యాక్టరీల స్థాపనకు అనుమతి ఇవ్వబడిందని విశాఖపట్టణంలోని కోరమండల్ ఎరువుల ఫ్యాక్టరీని విస్తరింప చేయడానికికూడా అనుమతి ఇవ్వబడినట్లు శ్రీ చావన్ చెప్పారు,

కోత్రా. రామగుండం తెలిచ్చేరి హాల్దియా ట్యుటికోరన్. వరదీప్, మిథాపూర్‌లలో కొత్త ఫ్యాక్టరీల స్థాపన పథకాలు పరిశీలించబడుతున్నాయి. నంగల్, కొచ్చిన్‌లలోనిఎరువులఫ్యాక్టరీల విస్తరణకు కూడా పరిశీలన జరుగుతున్నట్లు మంత్రి చెప్పారు.

మిథాపూర్ కర్మాగారంఏ దశలోవున్నదో తాను తెలుసుకోగోరుతున్నానని శ్రీతపురయ్య కోరారు, ప్రధాని లేదా మంత్రివర్గం దానిపై ఏదైనా నిర్ణయం చేసుకోబోతున్నదాయని ఆయన అడిగాడు.

పరిశీలనలో వున్న వాటిలో మిథాపూర్, కర్మాగారం కూడా ఒకటి. వీటిపై అంతిమ నిర్ణయానికి ఎంతకాలం పడుతుందో తాను చెప్పలేనని శ్రీ చావన్ చెప్పారు,

మిథాపూర్‌పై చర్చ

మిథాపూర్ ఎరువుల కర్మాగారంపై ప్రభుత్వం త్వరలోనే ఒక నిర్ణయానికి రావచ్చుననీ, అయితే ఖచ్చితమైన తేదీని తాను చెప్పజాలనని కేంద్ర పెట్రో, రసాయనాల స్టేట్ మంత్రి శ్రీ చావన్ నేడు లోక్ సభకు చెప్పారు.

మిథాపూర్ కర్మాగారం చాలాకాలం నుండి వివాదాస్పదమైన విషయంగావుందని, దీనిపై ప్రధాని నిర్ణయం తీసుకోగలరని జనవరిలో ప్రకటించబడగా తర్వాత మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుందని యిటీవలి ప్రకటనలు తెల్పుతున్నాయని శ్రీ తపురయ్య (స్వ) చెప్పారు.

అనేక ఎరువుల కర్మాగారాలతోపాటు మిథాపూర్ కర్మాగారాన్నికూడా త్వరలోనే మంత్రివర్గం నిర్ణయించగలదని శ్రీ చావన్ సభ్యునికి తెలియజేశారు.

సబ్బుల ధరలు

(1 వ పేజీ తరువాయి)

గోలచేసే ప్రభుత్వంపై ఈ ధరల ప్రభావం పడదా ? అని శ్రీ లిమాయే ప్రశ్నించారు.

దిగుమతి చేసుకున్న కొవ్వు పరిమాణంపై సబ్బుల ధరల తగ్గింపు ఆధారపడి వుంటుందన్నారు.

సబ్బులధరను ఉత్పత్తిదార్లు తగ్గించాలని పేర్కొన్నారు, లాండ్రీ సబ్బు టన్నుకు రు. 700 లు, టాయిలెట్ సబ్బు టన్నుకు రు. 1.100 లకు తగ్గించడం జరిగిందన్నారు.

67-68 సంవత్సరంలో సబ్బు ధరలు ఈవిధంగా తగ్గడానికి కారణం 127 టన్నుల కొవ్వు దిగుమతి చేసుకొనడమే అన్నారు.

ధరలు పెరిగినా సబ్బుల వాడకం తగ్గలేదని శ్రీతివారికి చావన్ తెలియజేశారు. ప్రస్తుతం 417 వేల సబ్బులను ఉత్పత్తి చేయడం జరుగుతుందని. గత సంవత్సరాలకన్నా ఇది ఎక్కువేనన్నారు.

విదేశాలనుంచికొవ్వుదిగుమతిచేసుకోవడం నిలిపివేసి, స్వదేశాలలో తయారైన కొవ్వును ఉపయోగించుకోడానికి, మనదేశంలో సరైన కొవ్వు పరిశ్రమ లేదన్నారు.

ఢాకాకు ప్రపంచ బ్యాంకు అధికారి రాక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

ప్రపంచ బ్యాంక్‌లోని పాకిస్తాన్ విభాగం నాయకుడు కరాచీనుండి నిన్న సాయంత్రం ఢాకా చేరుకున్నట్లు పాకిస్తాన్ రేడియో పేర్కొంది.

వివిధ ప్రాజెక్టులకు అవసరమగు నిధులను గురించి ఆయన పరిశీలిస్తారు.

చావన్ బర్తరఫ్‌కై డిమాండ్

(1 వ పేజీ తరువాయి)

నేర్పుకుని తన ప్రకటనను సరిదిద్దుకోగలరా? అని శ్రీ డాంగే, శ్రీ చావన్‌ను ప్రశ్నించారు.

గత 20 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘిస్తున్నది. ఈ విషయమై వారుఏటువంటి బాధను వ్యక్తం చేయటంలేదు, అని శ్రీ డాంగే పేర్కొన్నారు,

ప్రజాస్వామ్య పద్ధతిలో జాతీజీవనాన్ని నడపాలని ప్రధానమంత్రి ఆశించితే, ముందుగా చావన్‌ను డిస్‌మిస్ చేయటం ద్వారా మొదటి చర్యను తీసుకోవాలి.

శ్రీ చావన్‌ను ప్రస్తుతం అణచనట్లయితే ఆయన ఆయూబ్‌ఖాన్ మాదిరిగా చావన్ ఖాన్‌గా తయారవుతాడని శ్రీ డాంగే అన్నారు.

కోశీపూర్ కాల్పులను పి. యస్. పి. సభ్యుడు శ్రీ హెమబారువా విమర్శించారు, వాస్తవాలను తెలుసుకునేందుకు విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. విచారణ నివేదిక ప్రభుత్వానికి వ్యతిరేకమయినదైనా దానిని త్రొక్కి పెట్టరాదని అన్నారు.

ఉత్పత్తి లోటు: ప్రణాళిక తారుమారు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13

1968-69 వార్షిక ప్రణాళికను గత నెలలో యారుచేసిన ప్రణాళికసంఘం కొన్ని కీలకమైన లక్ష్యాల నిర్మాణాల అంచనాలలో లోటును చూపించింది.

రు. 2,337 కోట్ల ఖర్చుతో తయారుచేసిన యీ ప్రణాళిక రు. 200 కోట్ల లోటును సూచిస్తుంది.

మొత్తంమీద పారిశ్రామిక వస్తూత్పత్తి 8 శాతం పెరిగినా, ఉక్కు,ఎరువులఫుత్పత్తిలో యింకా తీవ్రమైన లోటు కన్పిస్తూనేవుంది. వ్యవసాయ రంగంలో కూడా గణనీయమైన అభివృద్ధి జరుగలేదు. అందువల్ల అనుకున్న దానికంటే 5 శాతం ఆర్థికరంగ పురోగతి కుంటుబడి పోయింది.

ప్రణాళికలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 102 మిలియన్ టన్నులు కాగా అంచనాప్రకారం అది 98 మిలియన్ టన్నులకు కుదించబడింది.

చెఱకు, నూనెగింజలు, ప్రత్తి, జనుము, కూడా ఆశించినంత ఉత్పత్తులు లేక పోగా లోటును చూపించాయి, హెచ్చు దిగుబడినిచ్చు వరివంగడాలను 210 లక్షల ఎకరాలలో వేయడానికి ప్రయత్నాలు జరిగినా. దానిపై ఖర్చుచేసిన ఎరువుల శాతం కూడా ఆశించిన దానికంటే తక్కువ అంచనా వేయబడింది.

17 లక్షల టన్నుల ఎరువులవాడకం జరుగుతుందని అనుకోగా 14 లక్షల టన్నుల మేరకే ఉపయోగం జరిగింది. 68 69 లో ప్రణాళికలో ఉక్కుకడ్డీల అంచనాలు 75 లక్షల టన్నులు కాగా ఉత్పత్తి 65 లక్షల టన్నుల లక్ష్యాన్ని అధిగమించలేకపోయింది.

ఎరువుల వాడకం, ఉత్పత్తులు తరిగిపోవడానికి అసమర్థులైన యజమానులనీ కమిషన్ నివేదికలో తెలిపింది. బొగ్గు, ఇనుప ఖనిజం, పరిశ్రమలలో ఉత్పత్తి లక్ష్యాలలోటు వాడకం లేనందువల్లనే జరిగిందనినివేదికలో పేర్కొన్నారు.

గన్నవరంలో అగ్ని ప్రమాదం

తరిగొప్పుల, ఏప్రిల్ 14

కృష్ణా జిల్లా గన్నవరంలో నిన్న సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించి రెండు ఇండ్లు దగ్ధమయ్యాయి.

సమీపంలోనే ఉపాధ్యాయ మహాసభ జరుగుచుండుటచే ఈ ఉపాధ్యాయులు మంటల నార్పివేశారు. ముఖ్యంగా వెంపాడు ఉపాధ్యాయుల ధైర్యంతో మంటలను అదుపులోకి తెచ్చి ప్రక్క ఇండ్లను సంరక్షించుటలో తీవ్ర కృషి చేశారు.

పశ్చిమ బెంగాల్ మంత్రివర్గంలో యస్. యస్. పి. ?

కలకత్తా, ఏప్రిల్ 14

పశ్చిమ బెంగాల్ మంత్రివర్గంలో సంయుక్త సోషలిస్టుపార్టీ చేరే విషయంపై రాజీ కుదిరినట్లు తెలుస్తుంది.

యస్. యస్. పి. చైర్మన్ శ్రీ జోషి ముఖ్యమంత్రి శ్రీ అజయ్‌ముఖర్జీకి వ్రాసిన లేఖకు జవాబు అందిన తరువాత పై విషయంలో తుది నిర్ణయం తీసుకోబడుతుందని పశ్చిమ బెంగాల్ యస్. యస్. పి. అధికారి నిన్న యిక్కడ తెలియజేశారు,

రొడీషియా సెంటర్‌పార్టీమహాసభ

శాలిస్‌బరి, ఏప్రిల్ 14

ప్రధాని ఇయాన్‌స్మిత్ రొడీషియన్‌ఫ్రంట్ పార్టీకి వ్యతిరేకంగా ఇటీవల రొడీషియాలో వామపక్ష ప్రతిపక్ష పార్టీలతో ఏర్పడిన సెంటర్‌పార్టీ మహాసభ నిన్నటితో ముగిసింది. ఈ సందర్భంగా బ్రిటన్‌తోగల దేశ స్వాతంత్ర్యం విషయమై వున్న వివాదం పరిష్కారానికి కొన్ని ప్రతిపాదనలు చేసింది.

ఎలిజబెత్‌రాణిని రాజ్యాధినేతగా పునః ప్రతిష్ఠించే రాజ్యాంగం ప్రాతిపదికగా తక్షణం చర్చలు ప్రారంభం కావాలని ఆ పార్టీ కోరింది. అలాగే 1961 లో బ్రిటన్-రొడీషియాలు మౌలికంగా అంగీకరించిన రాజ్యాంగానికి కట్టుబడివుండాలని ఆ పార్టీ కోరింది.

రాజ్యాంగంలోని జాతి వివక్షతకు సంబంధించిన నిబంధనలను ప్రతిఘటించడానికి పార్లమెంటులో శ్వేతజాతీయులకు, ఆఫ్రికన్లకు అధికారం వుండాలని సూచించింది.

ఓటింగ్ పద్ధతిని తమ పార్టీ ప్రస్తుత విధానంలోనే వుంచుతుందన్నారు.

తాము అధికారానికివస్తే ఆచరణ సాధ్యమైనంత త్వరలో జాతివివక్షతను రూపుమాపుతామని చెప్పారు,

మాజీ బ్రిటన్ వలస కార్యాలయ అధికారి రివర్డ్‌సల్లివాన్ పార్టీ అధ్యక్షుడుగా ఎన్నికైనారు.

8 కంపెనీలకు అనుమతి

పెట్టుబడుల పెంపుకు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

8 కోట్ల రూపాయలవరకూ పెట్టుబడులను పెంచుకోడానికి ఎనిమిది కంపెనీలకు అనుమతి లభించినట్లు అధికారరీత్యా నేడిక్కడకు తెలియ వచ్చింది.

రు. 71 లక్షల మేరకు బోనస్ షేర్లను ఆయ కంపెనీలు విడుదల చేయవలసి వుంటుంది. ఈ అంగీకారం 12 నెలలవరకూ అమలులో వుంటుంది.

బీహారులోని ఓటిస్ ఎలివేటర్ కంపెనీ, మెటానికా వర్క్సు ప్రైవేట్ లిమిటెడ్, హిందుస్తాన్ కండక్టర్స్ ప్రైవేటు లిమిటెడ్; కొట్టాయంలోని రబ్బరు కంపెనీ. ఢిల్లీలోని రాన్‌బాక్సీ లాబొరేటరీ కంపెనీ, కలకత్తాలోని ఎలక్ట్రికల్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ, అహమ్మదాబాద్‌లోని గుజరాత్ ఇండస్ట్రియల్ కంపెనీ పూనాలోని స్వస్తిక్ రబ్బర్ ప్రాడక్టు కంపెనీలకు అనుమతి లభించబడింది.

జీవిత భీమాసంస్థ ప్రీమియం రేట్ల తగ్గింపు : లోక్ సభలో మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

యాక్చురీస్ కమిటీ నివేదిక దృష్ట్యా ప్రీమియం రేట్లను తగ్గించడానికి జీవితభీమా సంస్థ యోచిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక స్టేట్ మంత్రి శ్రీ పి. సి. సేఠీ నేడు లోక్‌సభలో పేర్కొన్నారు.

అవసరమైతే ప్రభుత్వం ఈ విషయంపై జీవితభీమా సంస్థకు తగు సూచన లివ్వగలదన్నారు.

భీమాసంస్థ ప్రీమియం రేట్లు తగ్గిస్తే వ్యాపారం అభివృద్ధి చెందగలదని, కాని భీమాసంస్థ ఇంతవరకూ రేట్లను ఎందుకు తగ్గించలేదని అనేకమంది సభ్యులు ప్రశ్నించారు.

ఈ సందర్భంగా శ్రీ యస్. యస్. ద్వివేది పరిపాలనా సంస్కరణల కమిషన్ సిఫార్సులను ఉదహరించగా, శ్రీ ఇంద్రజిత్ గుప్తా మాట్లాడుతూ జీవితభీమా సంస్థకు గత సంవత్సరం ప్రీమియంద్వారా వచ్చిన ఆదాయం రు. 15.35 కోట్లువుందని, కనుక ప్రస్తుత సంవత్సరంలో ప్రీమియం రేట్లు తగ్గించాలని కోరారు.

భీమా సంస్థకు వచ్చే లాభంలో దాదాపు 99 శాతం బోనస్ రూపంలో పోలసీ హోల్డర్లకు యివ్వడం జరుగుతుందన్నారు.

ప్రీమియం రేట్లు తగ్గించే సమస్యపై ప్రభుత్వమే నిర్ణయం చేస్తుందని భీమాసంస్థ చైర్మన్ శ్రీ బేడీ లోగడ ప్రకటించినట్లు శ్రీ భోలానాథ్ పేర్కొన్నారు.

యాక్చురీస్ కమిటీ నివేదిక పరిశీలించిన అనంతరం భీమాసంస్థ ప్రీమియంరేట్లు తగ్గించాలనీ నిర్ణయానికి వచ్చిందని. ఏదేమైనా ప్రభుత్వం ఆమోదించ వలసివుంటుందని శ్రీ సేఠీ తెలియచేశారు.

కాలికట్, ఏప్రిల్ 14

కేరళలోని నల్లాలమ్ ప్రాంతంలో రాష్ట్ర రోడ్డు రవాణా బస్సు గత రాత్రి విద్యుత్‌స్తంభానికి గ్రుద్దుకుని కాలవలో పడిన ఫలితంగా దాదాపు 30 మంది గాయపడ్డారు.

గాయపడినవారిలో 5 గురిని జిల్లా ఆస్పత్రిలో చేర్చారు.

విశాలాంధ్ర

1969 ఏప్రిల్ 15 మంగళవారం

విచ్ఛిన్నకర ధోరణి

తెలంగాణా ప్రజల పురోభివృద్ధికి ఆటంకం, ఇతర అన్ని ప్రాంతాలలో వలెనే భూస్వామ్య. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ. ఈ వ్యవస్థను కాపాడుతున్న కాంగ్రెసు ప్రభుత్వ విధానాలు.

మౌలికమైన ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చి ప్రత్యేక తెలంగాణాతో అక్కడి ప్రజల సమస్యలన్నీ పరిష్కారమౌతాయని కొన్ని స్వార్థపరవర్గాలు ప్రచారం చేస్తున్నాయి. గత 12 సంవత్సరాలుగా పెద్దమనుషుల ఒప్పందాన్ని, రక్షణలను ఉల్లంఘించిన కాంగ్రెసు ప్రభుత్వఅక్రమాలను అవకాశంగా తీసుకుని ఈ వేర్పాటువాదాన్ని ఈ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి

ఇందుకు విరుద్ధంగా, సమగ్ర ఆంధ్ర రాష్ట్రంలోనే తెలంగాణా ప్రజల అభివృద్ధి సాధ్యమనేశక్తులూ తెలంగాణాలో ప్రబలంగానే ఉన్నాయి.

ఎవరి వాదనను వారు చెప్పుకోవచ్చు. ప్రశాంతంగా ఆందోళనలూ జరుపుకోవచ్చు.

కాని ప్రత్యేక తెలంగాణా వాదులు ఈ పద్ధతి నవలంభించడంలేదు.

బస్సులను ధ్వంసం చేయడం, తమ వ్యతిరేకుల గృహాలపై దాడులు చేయటం, ప్రజలను భయభ్రాంతులను చేయడం వంటి దౌర్జన్య చర్యలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ప్రత్యేక తెలంగాణా కూడదని వాదించే తెలంగాణా నాయకులపై దౌర్జన్యాలకు, అఘాయిత్యాలకు పూనుకుంటున్నారు.

తెలంగాణా వృద్ధనాయకులైన మాడపాటి హనుమంతరావు గారి ఇంటిపైన, తదితర సమైక్యతావాదుల ఇండ్లపైన దాడులు చేసిందెవరు? శాసనసభ్యురాలైన శ్రీమతి మంకమ్మచే బలవంతంగా ప్రత్యేక తెలంగాణాకు అనుకూల ప్రకటన చేయించేందుకై వత్తిడి చేసిందెవరు?

ఇవి ఎవరో కొద్దిమంది దుండగులు చేస్తున్నారని ఆ ఉద్యమ నాయకులు వాదించవచ్చు. కాని వాస్తవాలు అందుకనుగుణంగా లేవు.

ప్రత్యేక తెలంగాణా ఏర్పాటుకు దేశవ్యాపితంగా వ్యతిరేకత ఉంది. ప్రజాతంత్రవాదులెవరూ దీనిని బలపరచటంలేదు, కేంద్రప్రభుత్వమూ ఇందుకు విముఖంగా ఉంది.

ఇట్టి ప్రజాతంత్ర వ్యతిరేక నినాదంకొరకు చేసే ఆందోళనకారులు సహజంగానే నిస్పృహ, నిరాశలకులోనై, దౌర్జన్య చర్యలకు, సంఘవ్యతిరేక చర్యలకు దిగుతున్నారు. ఈ ఉద్యమ స్వభావాన్నుండే ఈ దౌర్జన్య చర్యలు ఆవిర్భవిస్తున్నాయి.

ఈ వాస్తవాన్ని వారు గుర్తించక పోవచ్చు. కాని ప్రజానీకం మాత్రం గుర్తిస్తున్నది.

నేడే అనగా ఏప్రిల్ 15న ప్రత్యేక తెలంగాణావాదులు సమ్మెకు పిలుపిచ్చారు. ఈ సమ్మెలో పెక్కు సంఘాలు పాల్గొనటం లేదు. అదే రోజున సమ్మెకు పిలుపిచ్చిన తెలంగాణా సర్వీసెస్ అసోసియేషన్ల బాధ్యులు, ప్రత్యేక తెలంగాణా నినాదాలతో తమకు సంబంధంలేదని ప్రకటించడం ముదావహం.

కొన్ని భూస్వామ్య. శక్తులు బాహాటంగా ప్రత్యేక తెలంగాణా అంటుండగా డాక్టర్ చెన్నారెడ్డి లాంటి కొందరు పరోక్షంగా ఆ మాట అంటున్నారు.

"ప్రత్యేకతెలంగాణా సమస్యపై నేనింకా ఏమీ చెప్పలేను. నా అభిప్రాయాలు సమయం వచ్చినపుడు చెబుతా" అని ఆయన ప్రకటించడం ఇందుకు తార్కాణం.

అటూ, ఇటూ కూడా భూస్వామ్య వర్గాలవారికి ప్రాతినిధ్యం వహించే పార్టీలు మాత్రమే ప్రత్యేక తెలంగాణానినాదాన్ని చేపట్టాయి. ప్రజానీకం ముఖ్యంగా తెలంగాణా ప్రజానీకం ఇది ఒక హెచ్చరికగా గ్రహించాలి.

తూర్పు గోదావరిజిల్లా 5 వ రైతు మహాసభ

సన్నాహాలు ప్రారంభం

ముమ్మిడివరం. ఏప్రిల్ 14

తూర్పుగోదావరిజిల్లా రైతుసంఘ 5 వ మహాసభ ముమ్మిడివరంలో ఏప్రియల్ 17, 18 తేదీల్లో జరుపుటకు చురుకుగా సన్నాహాలు జరుగుతున్నాయి.

10 అంశములతో కూడిన కరపత్రాలతో శ్రీయుతులు రెడ్డి కొండలరావు పులుగూరి వెంకటేశ్వర్లు దంగేటిముసలీరావు చింతపల్లి కృష్ణమూర్తి వగైరా కార్యకర్తలు కొంగా ఎర్రండి గ్రామగ్రామాన ఎక్కటి ప్రతి రైతు పెద్దలను కలుసుకొని మహాసభ ఏర్పాటు గురించి వివరిస్తున్నారు. రైతులంతా రైతుసంఘ ఆవశ్యకతను గుర్తించుచూ [illegible]

ఇప్పటికి ముమ్మిడివరం కొత్తలంక క్రాప, [illegible] లంకపూతి రాజోలంక కొమానపల్లి అన్నంపల్లి గాడి [illegible] అయినాపురం. గోమదేవవిహారం, భీమనపల్లి చేన్నేంగున్నేపల్లి, చెయ్యేరు, బంటుమిల్లి పెనుమెల్లి మొదలయిన గ్రామాలలో పర్యటన జరిగింది

ఈనెల 1 వ తేదీ నుండి ముమ్మిడివరంలో ఆహ్వాన సంఘం ఆఫీసు ప్రారంభించి కేంద్రంగా పెట్టుకొని పని చేయుట జరుగుచున్నది. 4వ మహాసభ జరిగిన దాదాపు 20 సంవత్సరాల తదుపరి యీ 5వ మహాసభ జరుగుట కార్యకర్తలలో ఉత్సాహాన్ని రేకెత్తిస్తున్నది.

ఈ సభకు రాష్ట్ర సంఘ అధ్యక్షులు శ్రీ వై. వి. కృష్ణారావు (యం. యల్. సి) శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య (యం. యల్. ఏ) శ్రీ నంబు అప్పారావుల హాజరగుచున్నారు.

18వ తేదీ రాత్రి బహిరంగ సభ ఏర్పాటు చేయబడింది. ప్రఖ్యాత రెడ్డిసోదరుల బుర్రకథ గాయకులు జ్వాలా నాట్యబృందం వారిచే బొబ్బిలియుద్ధం బుర్రకథ నాటకం ఏర్పాటు చేయబడినవి. జిల్లాలోని అన్ని తాలూకాలనుండి ఎక్కువగా ప్రతినిధులు హాజరవుతారని ఆహ్వానసంఘం భావిస్తుంది.

ఆగ్నేయ రైల్వే సాధించిన ప్రగతి

భారత రైల్వే పరిశ్రమ ఈనాడు ప్రజాసేవే ఏకమావధిగా సాంకేతిక విప్లవ లాభాలను సంతరించుకొంటూ మహత్తర పరిణామాలకు లోనవుతోంది. అభివృద్ధిలేమిని, సనాతన పద్ధతుల్ని రైల్వేలకు అంటగట్టి అందనా కట్టడం పలువురికి ఏరిపాటి కాని గతాన్నధిగమించి ఏ పరిశ్రమకూ దీటురాని విధంగా సాటిలేని పురోగతిని రైల్వేలు సాధిస్తున్నాయనడంలో అతిశయోక్తిలేదు.

ఆగ్నేయ రైల్వే 1968-69 ఆర్థిక సంవత్సరాన్ని పరిశోధన భరిత సంవత్సరంగా పేర్కొనవచ్చు. రైల్వేలలోని వివిధ శాఖల నిర్వహణలో పరిశోధనాత్మక సాంకేతికపద్ధతులు 1966 సంవత్సరార్ధంలో ప్రారంభమై 1967-69 మధ్యకాలానికి ప్రబల పరిణతి పొందాయి. ఈ పద్ధతుల్ని అమలుపరచటం వలన ఆగ్నేయ రైల్వే సాధించిన సామూహికాభివృద్ధి దాని ఉత్పాదన, రవాణా, ఉత్పత్తి, ఆర్థికరంగాలలో గడించిన పురోగతి ద్వారా విశదమవుతుంది.

శ్రీ

జగ్జిత్ సింగ్

జనరల్ మేనేజర్, ఆగ్నేయ రైల్వే

రవాణా

రవాణా నిర్వహణలోని డీసెల్, విద్యుత్, ఆవిరి ఇంజనులు, లక్షలాది వేగన్లు రైల్వేకు పరిగణింపదగిన ఆస్తి. వీటి నిరంతర పరిశ్రమణం ఉత్పాదన కాయువుపట్టు. రోజుకు రవాణా బండి ఇంజను చుట్టివచ్చే సగటు దూరాన్నిబట్టి రైలుబళ్ళ కదలికలోని తీరుతెన్నులు తెలుస్తాయి. ఈ విధంగా కాలంలోను, దూరంలోను ఏమాత్రం అభివృద్ధి సాధించినా అది రైల్వే సాధన సంపత్తికి, నిర్వహణా సామర్థ్యానికి తార్కాణంగా పేర్కొనవచ్చు. ఆగ్నేయ రైల్వే సాధించిన ఈ అభివృద్ధిని ఈ క్రింది అంకెలు నిరూపిస్తాయి.

	1966—67	1967—68	1968—69 ఫిబ్రవరి వరకు
సరకురవాణా			
ఇంజను కిలోమీటర్లు రోజువారీ	191	215	230
వాగను కిలోమీటర్లు రోజువారీ	69.0	78.2	81.9
గూడ్సుబళ్ళ వేగం కి.మీ. గంటకు	19.9	20.4	22.6
మొత్తం గూడ్సుబళ్ళ వేగం కి.మీ. గంటకు	16.6	17.4	19.1

ఉత్పాదన

కేవలం (గూడ్సు) బండ్ల రాకపోకలను బట్టి ఉత్పాదనా శక్తిని అంచనా కట్టలేము. బొగ్గు గనులు తదితర ప్రదేశాలకు వాగనులను, ఇంజన్లను ఆ యా స్థలాల్లో లభించే విద్యుచ్ఛక్తి నిష్పత్తిపై ఆధారపడి ఒక్కొక్కప్పుడు ఖాళీగా లేదా తక్కువగా సరఫరా చేయవలసి వుంటుంది. ఆ కారణంచేత అన్నివాగన్లు కిలోమీటర్లు ఉత్పాదన సూచించవు. అందుచేత రైల్వేలో రెండు విభిన్న ఉత్పత్తి సూచికలను వాడతారు. వాటిని 'నెట్‌టోన్ కిలోమీటర్స్ పర్ ఇంజన్ అవర్', నెట్‌టోన్ కిలో మీటర్స్ పర్ వాగన్‌డేగా పేర్కొంటారు.

	1966-67	1967-68	1968 69 ఫిబ్రవరి దాకా
నెట్‌టోన్ కిలో మీటర్స్ పర్ ఇంజన్ అవర్	4856	5331	5654
నెట్‌టోన్ కిలో మీటర్స్ పర్ వాగన్ డే	919	1025	1100

ఉత్పత్తి

రైల్వేలోని రవాణా, ఉత్పాదనల పరిణామే ఉత్పత్తి. తన సేవలందుకునే పరిశ్రమల రవాణావసరాలను తీర్చడమే రైల్వేల లక్ష్యం. భౌగోళిక పరిశీలన దృష్ట్యా చూస్తే రూర్ ఆవ్ ఇండియా అని పిలువబడే పారిశ్రామిక ప్రాంతానికి ఆగ్నేయ రైల్వే అధిక సేవ అందిస్తోంది. దేశంలోని నాలుగు పెద్ద ఉక్కు కర్మాగారాలు ఆగ్నేయరైల్వేలో ఉన్నాయి. అధికబొగ్గు ఉత్పత్తి కేంద్రాలు, లోహ ఖనిజాలు, డొలమైట్, సున్నపురాయి లభ్యం కావటంతో తలయెత్తిన అనేక అనుబంధ పరిశ్రమలు తద్వారా వివిధ సరకు రవాణాతో ఆగ్నేయ రైల్వే ఎదిగి. (ప్రమాణం అమితంగా పెరిగాయి దానికి ఉదాహరణ - 1966 లో 6960 గా వున్న రోజువారీ సగటు వేగను భర్తీ 1968-69 సంవత్సరానికి 7601 కి పెరిగింది. సగటున రోజువారీ వేగను భర్తీ అపారంగా పెరిగి ముఖ్యంగా గడచిన నాలుగు మాసాల్లో వరుసగా 8018, 8291, 8665, 8612 వేగన్లకి చేరింది.

ఆర్థిక స్తోమత

ఏ పరిశ్రమకయినా ఆర్థిక స్తోమత అతి ముఖ్యమైనది. ఆగ్నేయ రైల్వే 1967-68 లో గత సంవత్సరం కంటె ఆరోగ్యకరమైన అభివృద్ధి సాధించింది. సాధన సంపత్తులను పెంచుకోవటం, సిబ్బంది ఖర్చులు పెరగడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటూనే 1966 - 67 లో 71.10% వున్న నిర్వహణా నిష్పత్తిని 1967-68 లో 67.95%కు తగ్గించగలిగింది. తత్ఫలితంగా 1966-67 లోని రు. 12.17 కోట్ల నికరాదాయాన్ని 1967-68 లో రు. 15.5 కోట్లమేరకు వృద్ధిచేయ కలిగింది 1968 - 69 మధ్యకాలంలో ఖర్చులు మరింత పెరిగినప్పటికీ నిర్వహణా నిష్పత్తి, నికర లాభాలలో మరింత పెంపు కానవచ్చే సూచన లున్నాయి. 1968 లో ఒరిస్సాలో సంభవించిన తుపాను, వరదల మూలంగా తూర్పుతీర మార్గం నెల రోజులకు పైగా మూతపడినప్పటికీ 1968-69 లో ఈ అభివృద్ధి సాధించబడటం నిజంగా ఒక ఘన విజయం.

విస్తరణ, ఆధునికీకరణ

మూడు పంచవర్ష ప్రణాళికల కాలంలో ఆగ్నేయ రైల్వే అపారంగా విస్తరించబడింది. అనేక పునర్నిర్మాణ కార్యక్రమాలు అమలు జరిగాయి. వాటిలో అతి ముఖ్యమైనది కొత్తవలస - కిరండూల్ రైల్వే మార్గం. బైలదిల్ల నుండి విశాఖపట్నంవరకు నిర్మింపబడిన ఈ మార్గంద్వారా జపానుకు ఎగుమతి అయ్యే ఇనుపరాయి రవాణా చేయబడుతోంది 448 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గం 1968 నవంబరులో తెరువబడింది. 71 కి. మీటర్ల పొడవుగల పాంచ్‌పురా-హాల్దియా రేవునిర్మాణం చురుకుగా సాగుతోంది. ఇందులో 60 కి. మీటర్ల దూరం రైలుమార్గ నిర్మాణం (దుర్గా చెక్‌వరకు) 1969 జనవరిలో ముగిసింది. దానిద్వారా ముఖ్యంగా రేవుకు సరకు రవాణా చేయబడుతోంది. అండుల్ నుండి కలకత్తా కార్డు లింకును నేరుగా కలిపే లైను నిర్మాణం ఈ సంవత్సరార్ధంలో ముగుస్తుంది. కలకత్తా పరిసరాల్లో ఆగ్నేయ రైల్వే బళ్ళ రాకపోకలకు ఇది

(మిగతా 3 వ పేజీలో)

సమైక్యతా సదస్సు ఆపడం ప్రత్యేకతెలంగాణా బలపర్చడమే

ఖమ్మం జిల్లా అఖిలపక్ష సదస్సు సన్నాహకసంఘం ప్రకటన

ఖమ్మం, ఏప్రిల్ 14

ఆంధ్రప్రదేశ్ ప్రజల సమైక్యత వర్ధిల్లాలని, ప్రత్యేక తెలంగాణా వాదాన్ని నిరసించుటకు యీ నెల 8 వ తేదీ నాడు ఖమ్మంలో జరుప దలచిన సదస్సును బహిరంగ సభను 144 వ సెక్షను ద్వారా నిషేధాజ్ఞలతో చివరి సమయంలో జరుపరాదనే ఆటంక పర్చడం ప్రత్యేక తెలంగాణా వాదాన్ని ప్రోత్సహించడమే అవుతుందని జిల్లాఅధికార్ల చర్యను నిరసిస్తూ ఖమ్మంజిల్లా అఖిలపక్ష సన్నాహక సంఘం నేడొక ప్రకటన గావించింది.

ఖమ్మంజిల్లా కమ్యూనిస్టుసమితి, మరియు కమ్యూనిస్టు కమిటీ (మార్క్సిస్టు) జనసంఘం మరికొందరు పెద్దలతో ఖమ్మంజిల్లా అఖిలపక్షసదస్సు సన్నాహక సంఘం ఏర్పడిన విషయం పాఠకులకు విదితమే.

వారు గావించిన ప్రకటనలో ఇలా వుంది

అనేకమంది వీరులు ప్రాణాలర్పించిన ఫలితంగా శతాబ్దాలుగా ముక్కచెక్కలై వున్న తెలుగుప్రజలంతా ఏకమై విశాలాంధ్ర రాష్ట్రాన్ని సాధించుకున్న తరువాత 12 ఏండ్ల కాంగ్రెసు దుష్టపరిపాలన ఫలితంగా తెలంగాణా ప్రజలకిచ్చిన హామీలను అమలుపర్చని కారణంగా తెలంగాణా ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తిని ఆసరాగా తీసుకొని యిప్పట కొంతమంది పదవీ వ్యామోహపరులు తిరిగి ఆంధ్ర ప్రజలను చీల్చి రాష్ట్ర విచ్ఛిత్తి జరిం ప్రత్యేక తెలంగాణా వాదాన్ని లేపి తమ పబ్బం గడుపుకోజూస్తున్నారు.

విచ్ఛిన్నకారుల కుచ్చితాలనుంచి రాష్ట్ర ప్రజల సమైక్యతను కాపాడుటకై ఖమ్మంజిల్లా అఖిలపక్ష సదస్సు జరపాలని ఉభయ కమ్యూనిస్టుపార్టీలు, జనసంఘం ఉమ్మడి కార్యక్రమంపైన అంగీకరించి పట్టణంలో వున్న అభ్యుదయకాములైన మరికొందరితో ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పడి యీ నెల 8 వ తేదీనాడు అఖిలపక్ష సదస్సు జరపాలని నిర్ణయించింది.

సదస్సు ఏర్పాటుకు ప్రచారం వారం రోజులకు పైగా పెద్ద ఎత్తున జరపబడ్డాయి.

చివరి నిమిషంలో ఆటంకం

జిల్లా అంతటా ఇంత పెద్ద ఎత్తున ప్రచారం జరిగి ప్రజలు చద్ది మూటలతో బయలుదేరబోయే సమయంలో అధికార్లు అకస్మాత్తుగా అడ్డుపడ్డారు. తెల్లవారి సదస్సు జరుపుతుందనగా 6 వ తేదీనాడు అనవసరంగా ఇప్పట 144వ సెక్షన్ ప్రవేశపెట్టి 7 వ తేదీ మధ్యాహ్నం వరకు పర్మిషన్‌కోసం వెళ్ళగా జిల్లా కలెక్టరు సభ జరుపరాదనే ఆంక్ష విధించారు వీరితోపాటు జిల్లా పోలీసు సూపరింటెండెంటుకూడా శాంతి భద్రతలు పరిరక్షింపజాలనని. సదస్సును వాయిదా వేసుకోవడం మంచిదని తన అశక్తతను వ్యక్తపరుస్తూ సదస్సుకు అనుమతి నిరాకరించారు.

చివరకు బహిరంగసభను మానుకొని కేవలం సదస్సును సినిమా హాలులోనైనా జరుపుకొనుటకుకూడా అధికార్లు అంగీకరించలేదు. ఇంతకుముందు వారం రోజుల క్రితమే యిప్పట మిక్కుటమైన పోలీసు పహరాతో ప్రత్యేక తెలంగాణా వాదుల సదస్సు, బహిరంగ సభ జరుపుకొనుటకు అనుమతి యిచ్చిన రక్షణ శాఖకు యింతలోనే శాంతి భద్రతలు మృగ్య మవుతాయనే సాకుతో హఠాత్తుగా నిషేధాజ్ఞలను జారీ చేసి ఆంధ్రప్రజల ఐక్యతా సదస్సును సాగనీయకుండా చేయడం జూస్తే ఇప్పట అధికార్ల ప్రవర్తన ప్రత్యేక తెలంగాణా వాదులకు పరోక్షంగా తోడ్పడటమేతప్ప మరేమీ కాదని భావిస్తున్నాం. జిల్లా అధికార్లు అవలంబించిన ఈ విధానాన్ని ఖండిస్తూ తీవ్రనిరసనను తెలియజేస్తున్నాం.

ఖమ్మం జిల్లా అధికార్ల చర్య జాతి సమైక్యతకే విరుద్ధం

యీ నెల 8వ తేదీనాడు ఖమ్మంలో జరుగవలసిన ఆంధ్రప్రదేశ్ సమైక్యతా సదస్సు చివరి నిమిషంలో అకస్మాత్తుగా వాయిదా పడిన విషయం అనేక దూరప్రాంతాల ప్రజలకు, కార్యకర్తలకు తెలియక అనేకమంది కమ్యూనిస్టుపార్టీ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యకర్తలు ప్రజలు ఆనాడు ఖమ్మం వచ్చారు. వచ్చిన వారందరికీ సదస్సు వాయిదా పడిందన్న వార్త తెలిసిన వెంటనే వారంతా కమ్యూనిస్టుపార్టీ కార్యాలయంలో జిల్లా రైతుసంఘ అధ్యక్షులు శ్రీ వానిరెడ్డి వెంకటపతి అధ్యక్షతన సమావేశమయ్యారు. వచ్చిన వారిలో ముఖ్యంగా 100 మైళ్ళ దూరంలో అటవి ప్రాంతం బూర్గంపాడుతాలూకా, మణుగూరు, అశ్వాపురం ప్రాంతాల నుంచి 20 మంది కార్యకర్తలు పాల్గొనడం గొప్ప విశేషం.

144 సెక్షను ప్రవేశపెట్టి సభకు ఆటంకం కలిగించినందుకు ఖమ్మం జిల్లా అధికార్ల చర్యను ఖండిస్తూ, వీరి చర్య ప్రత్యేక తెలంగాణా వాదులకు తోడ్పడటమే అవుతుందని, ఈ అధికార్ల చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విచారించాలని తీర్మానించారు.

నూజివీడులో 16వ తేదీన కరువు యాత్ర

నూజివీడు, ఏప్రిల్ 14

నూజివీడు తాలూకాలో నాలుగు సంవత్సరాలుగా కరువు వ్యాపించివుంది. దాదాపు అన్ని గ్రామాలలోను మంచినీటి కరువు ఏర్పడింది. ఆహారధాన్యాల ధరలు విపరీతంగా పెరిగిపోయివున్నవి.

ప్రభుత్వం మాత్రం సహాయ కార్యక్రమాలు అమలు జరుపుటకు బదులానిర్బంధ శిస్తువసూళ్ళు చేస్తున్నది.

వ్యవసాయ కార్మికులకు బంజరు భూములకు పట్టాలు యివ్వలేదు పైగా బంజరు భూములను రిజర్వు ఫారెస్టులలో చేర్చడం. దీనికితోడు రాజకీయ బాధితులపేర భూస్వాములు కాజేయడం జరుగుతూ వుంది.

ఇత్యాది విషయాలు ప్రభుత్వ దృష్టికి తెచ్చుటకు ఈనెల 16 వ తేదీ నూజివీడులో కరువుయాత్ర నిర్వహింపబడుతూ వుంది.

ఈ యాత్ర ఆర్. డి. వో. ఆఫీసు వద్దకు గొనిరాబడుతుందని రైతులు, వ్యవసాయ కార్మికులు అందరూ యీ యాత్రలో పాల్గొనాలని తాలూకా కమ్యూనిస్టు సమితి కోరింది

విద్యార్థులను మోసగించిన వినుకొండ టీచరు

యూనివర్శిటీఫీజులు స్వాహా

వినుకొండ, ఏప్రిల్ 14

గుంటూరుజిల్లా వినుకొండలోని జి.కె.టి. కాలేజి టీచరు శ్రీ ఆర్. రామేశ్వరరావు విద్యార్థులవద్ద యూనివర్శిటీ ఫీజులు వసూలు చేసి చెల్లించలేదని తెలుస్తున్నది.

11 మంది విద్యార్థులు గుంటూరు సెంటరుకు హాల్ టిక్కెట్ల కొరకు వెళ్ళి, ఫీజులు చెల్లించని కారణంగా హాల్ టిక్కెట్లు రాక తిరిగి వచ్చారు. ఈ టీచరు ప్రస్తుతం ఎరాలీలో వున్నట్లు తెలుస్తున్నది. (వి. వి.)

రెడ్యాల గ్రామంలో సమైక్యతా సభ

మానుకోట, ఏప్రిల్ 14

వరంగల్ జిల్లా మానుకోట తాలూకా రెడ్యాల గ్రామంలో ఈ నెల 6 వ తేదీన తెలుగు ప్రజల సమైక్యతా సభ జరిగింది

సభకు శ్రీ భైరా లక్ష్మీ నర్సయ్య అధ్యక్షత వహించారు. సభకు ముందుగా ఊరేగింపు జరిగింది.

ఆంధ్ర తెలంగాణా వేర్పాటు వాదానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా కారణ భూతమయిందీ శ్రీయుతులు ఎం. వెంకటనర్సు, నారాకృష్ణయ్య వివరించారు.

తెలుగు ప్రజలు ఐక్యంగా వుండాలని తెలంగాణా రక్షణలు అమలుకు రాజ్యాంగాన్ని సవరించాలని కోరారు. (వి. వి.)

పెద్దాపురంలో బియ్యానికి కటకట

బ్లాక్ మార్కెటులో కొనలేక ప్రజల ఆందోళన

పెద్దాపురం, ఏప్రిల్ 14

పెద్దాపురంలోవున్న 17 రేషన్ షాపులలోను వారం రోజులనుండి బియ్యం సప్లయి లేక ప్రజలు బ్లాక్ మార్కెటులో కె. జి. కి రు. 1-10 నుండి రు. 1-20 చొప్పున కొనలేక చాలా ఇబ్బంది పడుచున్నారు.

డీపోలకు అమలాపురం తాలూకాలోని అనాతవరంలోవున్న మిల్లునకు. కోటావేయగా డీలర్లు వెళ్ళి మిల్లు యజమానిని కోటా యిమ్మని అడిగారు. జిల్లాకలక్టరు యిచ్చిన ఆర్డరు ప్రకారమే,ఇదివరకే అమ్మివేసినామని సరుకులేదని చెప్పినారు.

డీలర్లు తిరిగివచ్చి పెద్దాపురం ఆర్.డి.ఓ. గార్కి తెలియజేసినారు. అందుపై ఈ నెల 9న పెద్దాపురం కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ బళ్ళా అప్పారావు, డిప్యూటీ కలక్టరును కలిశారు.

అందుపై, డిప్యూటీకలక్టర్ శ్రీ టి. నారాయణరెడ్డి ప్రస్తుతం లెవీ ద్వారా ప్రొక్యూర్ చేసినసరుకుతక్కువగాయున్నదని, ఈ విషయం జిల్లా కలక్టరుగార్కి కూడా తెలియచేసినని. వెంటనే బియ్యంసప్లయి చేయి చుటకు ప్రయత్నం చేస్తాననిచెప్పారు.

పెద్దాపురంలో మంచి నీటి కొరత

పెద్దాపురంలో సుమారు 7 వందల యిళ్ళకు వేసినకుళాయిలు వున్నవి. కొన్ని మెరక ప్రదేశాలలోవున్న, కుళాయిలనుండి నీరురాక ప్రజలు చాలాఅవస్థలు పడుచున్నారు. మున్సిపల్ ఆఫీసులో కుళాయి స్కీమునకు సంబంధించిన టెక్నికల్ సూపర్‌వైజరు అనుభవమైన వారులేరు. వారియిష్టమొచ్చిన చోట్ల, పైపులైను లిఫ్టుస్కీమును ఎలాంటోకా లేకుండా చేస్తున్నారు.

ఆఖరికి, మున్సిపాలిటీ తగుచర్య తీసుకోనందున 5 వ వార్డు శ్రీ యం. యస్. రామారావు (ప్లీడరు) చైర్మన్ శ్రీ ముప్పన రామారావుకు, మున్సిపల్ సెక్రటరీకి తనయింటికిఉన్న కుళాయినుండి నీరువచ్చుట లేదు.

అంతరిక్ష వేదికపై నౌకల అవతరణ

సోవియట్ కృషి

మాస్కో, ఏప్రిల్ 12

చంద్రుడు, ఇతరగ్రహాలైన శుక్రుడు అంగారకుని చేరుకునేందుకు భూపరిక్ష తిరిగే అంతరిక్షవేదికపై అంతరిక్ష నౌకలను దించేకార్యక్రమంతో సోవియట్ ముందుకు సాగుతున్నదనిఅంతరిక్షనావికుడుబోరిస్ వాలినోవ్ నేడు ఇక్కడ అన్నారు. చంద్రునిపై సోవియట్ నౌక ఎప్పుడు దిగుతుందోమాత్రం ఆయన పేర్కొనలేదు.

బియ్యందొంగరవాణా చేస్తున్న కార్లపట్టివేత

హైదరాబాదు, ఏప్రిల్ 13

ఆంధ్రప్రదేశ్‌లో ఒక మండలం నుండి మరొక మండలానికి బియ్యం దొంగ రవాణాకు యింతవరకు లారీలు, బస్సు, కంచరగాడిదలు, గుర్రాలను వినియోగించగా, యిప్పుడు కార్లను వినియోగిస్తున్నారు.

గత బుధవారం గుంటూరు జిల్లాలోకి వెడుతుండగా, నిఘా శాఖ సిబ్బంది, 27 బస్తాల కిచిడీ బియ్యం తీసుకు వెడుతున్న మూడు కార్లను వెంటాడి తరిమినట్లు నిఘా శాఖ సూపరింటెండెంటు శ్రీ జి. గురునాదరావు నేడిక్కడ చెప్పారు. నిఘాశాఖ సిబ్బంది హెచ్చరిక చేయగా, ఒక కారును వెంటనే ఆపవేశారు, కాని మరో కారును మూడుమైళ్లు వెంబడించి వెళ్ళి పట్టుకోవలసి వచ్చింది. మూడవకారు నడుస్తుండగానే, ఆ కారు డ్రైవరు కారు నుండి బయటకు ఉరికాడనీ, తర్వాత కారు ఆగిపోయిందనీ, చివరికి డ్రైవరును అరెస్టు చేయడం జరిగిందనీ తెలిపారు

హైదరాబాదు నగరంలో ఏప్రిల్ 4 న ఒక రేషన్‌షాపు యజమాని వద్దనుండి 37 దొంగ రేషను కార్డులు నిఘాశాఖ పట్టుకుంది. అయితే ఆ కార్డులు ఎలా లభించినదీ ఆ వర్తకుడు చెప్ప నిరాకరించాడు.

గత మార్చి నెలలో 20 మంది కిరసనాయిల్ వర్తకులను పట్టుకుని వారి వద్ద నుండి 63 వేల లీటర్ల కిరసనాయిల్ స్వాధీనం చేసుకోబడింది.

గత నెలలో 340 క్వింటాళ్ళ బియ్యంతో సహా రు 8.4 లక్షల విలువచేయు సరుకులు స్వాధీనం అయాయి.

ఇదే కాలంలో దొంగరవాణా చేసినందుకు దొంగవర్తకం చేసినందుకు, ఆహార కంట్రోలు ఉత్తరవులు ఉల్లంఘించినందుకు155మంది అరెస్టుచేయబడ్డారు. దొంగరవాణాకు వినియోగింపబడుతున్న 6లారీలు 60 బళ్లు, 150 జంతువులు స్వాధీనం చేసుకోబడ్డాయి. మొత్తం 64 మంది వ్యక్తులకు శిక్షలువిధింపబడ్డాయి.

పోలెండు - సింగపూర్‌ల మధ్య త్వరలో దౌత్యసంబంధాలు

వార్సా, ఏప్రిల్ 12

పోలెండు సింగపూర్‌ల మధ్య రాయబార స్థాయిలో దౌత్యసంబంధాలను ఏర్పరచుకోడానికి నిశ్చయించుకున్నట్లు స్థానిక "పాప్" వార్తాసంస్థ నేడు ప్రకటించింది

ఇంతవరకు పోలెండు సింగపూర్‌లకు దౌత్యస్థాయిలో వాణిజ్య సంబంధాలు మాత్రమే ఉన్నాయి.

భారత్‌లో బిల్లెట్ల ఉత్పత్తి అభివృద్ధి

కలకత్తా, ఏప్రిల్ 12

సంవత్సరానికి సుమారు 5, 60 వేల టన్నుల బిల్లెట్లను ఉత్పత్తి చేసే ఒక బిల్లెట్ మిల్లును భిలాయ్‌లో నెలకొల్పేందుకు ఉక్కు సారధ్యసంఘంచేసిన సిఫార్సులను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు భారీ ఇంజనీరింగ్ మంత్రి మహమ్మద్ షఫీకురేషి. నేడిక్కడ చెప్పారు.

చతుర్థప్రణాళికలో ఉక్కు ఉత్పత్తిపై పరిశీలన జరపడానికి పైస్థాయి సంఘం నియమించబడింది.

భారత ఉక్కు వాణిజ్యవేత్తల సంఘ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభిస్తూ భారత్‌లో బిల్లెట్ల ఉత్పత్తి 1968-69 సంవత్సరానికి సుమారు 8,70,000 టన్నులు ఉత్పత్తిఅవుతూందనీ, 1967-68 లో 12 లక్షల బిల్లెట్లు ఉత్పత్తి అయ్యాయని చెప్పారు.

ఒంగోలు కళాశాలను ప్రభుత్వంస్వాధీనం చేసుకోవాలి

గుంటూరుజిల్లా విద్యార్థి ఫెడరేషన్ నాయకుని ప్రకటన

ఒంగోలు, ఏప్రిల్ 14

విద్యార్థుల, అధ్యాపకుల, పురజనుల విశ్వాసాన్ని కోల్పోయిన ఒంగోలు సి. ఎస్ ఆర్. శర్మ కళాశాల కమిటీని రద్దుపరచి, కాలేజిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలనీ, లేనియెడల పరిస్థితి యిలాగే సాగితే విద్యార్థులు ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవలసి వుంటుందని ప్రభుత్వానికి హెచ్చరిక చేస్తూ గుంటూరుజిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ నల్లూరి వెంకటేశ్వరరావు క్రింది విధంగా ప్రకటిస్తున్నారు:

కనీస కోర్కెల సాధనకై విద్యార్థి ఫెడరేషన్ అధ్వర్యాన రెండు మాసాల్క్రితం విద్యార్థులు 6 రోజులు నిరసనవ్రతం చేయవలసి వచ్చింది. ప్రతినెలా జీతమివ్వాలని కోరుతూ 48 మంది అధ్యాపకులు 24 గంటలు సామూహిక నిరశనవ్రతం చేశారు. కాని ఫలితం శూన్యం అధ్యాపకులు సైతం తీవ్ర పోరాటానికి సన్నద్ధ మయ్యారంటే ఈ కమిటీ అసమర్థత, అవకతవకలు అర్థమవుతాయి

ఈ కళాశాల స్థాపించి 17 సంవత్సరాలయింది.

ఈ 17 సంవత్సరాలకాలంలో ఏఒక్కసారీ ఎన్నికలు జరుగలేదు. క్రొత్తవారిని చేర్చుకొనే దానికి యిష్టపడరు కమిటీలో చేరలనుకునేవారికి సరియైన ప్రోత్సాహమివ్వ

వీరు యిన్ని సంవత్సరములనుండి అభివృద్ధి పేరుతో కొన్ని లక్షల రూపా విరాళంగా వసూలు చేశారు. వీరు సాధించిన అభివృద్ధి ఏమిటంటే సి బి జడ్ గ్రూపు నిన్నగాక మొన్న పెట్టటం, సైన్సు విద్యార్థులకు ప్రాక్టికల్సుకు సరియైన పరికరాలు లేకపోవటం, ఉన్న పరికరాలకు సైతం "హ్యా" నిస్తమే.

క్లాసు తరగతుల విషయము చూస్తే బాగా ఎండకాచినా గాలికొట్టినా, వర్షమొచ్చినా ఆరోజు 'హాలిడే'.

కనీస సాదా అనే విచక్షణలేకుండా విరాళాలు పేరిట వేలకువేల రూపాయలు గోళ్ళూడగొట్టి వసూలుచేస్తున్నారు. కాని లైబ్రరీ, సైకిల్‌షెడ్లు, లేడీస్ వెయిటింగ్ రూము తదితర కనీస సౌకర్యములకొరకు విద్యార్థి ఫెడరేషన్ అధ్వర్యాన ఆరురోజుల నిరసనవ్రతం చేయవలసి వచ్చింది

అసలే అధిక ధరలకు అందరితో పాటు బాధ అనుభవిస్తున్న అధ్యాపకులకు రెండు మాసముల నుంచి జీతములు యిచ్చుట లేదు. ఇంకా నాలుగు మాసముల వరకూ యిచ్చే ఆశ కూడా లేదు ఇది కాలేజీ మొదటినుంచి వస్తున్న ఆచారమే.

ఈనెల 14 వ తేదీ లోపల తమ కోర్కెలు నెరవేరనిచో 15 నుండి పరీక్షలకు పర్యవేక్షణకు పోకుండా వుండుటకు టీచర్లు నిర్ణయం చేసినారు. అప్పటికీ నెరవేరనిచో నిరవధిక లేక ఆమరణ నిరాహారదీక్ష చేయుటకు సన్నద్ధులవుతున్నట్లు తెలుస్తున్నది

పై న్యాయమైన అధ్యాపకుల కోర్కెలను విద్యార్థి ఫెడరేషను పూర్తిగా బలపరుస్తున్నది.

తిరుపతి పురపాలక సంఘ ఎన్నికలు

పట్టణ కమ్యూనిస్టు నాయకుడు జగన్నాథం 15 వ వార్డునుండి పోటీ

తిరుపతి, ఏప్రిల్ 14

తిరుపతి పురపాలక సంఘ ఎన్నికలకో పోటీ చేసేవారి నికర జాబితా ప్రకటించబడింది. 20వ వార్డులలోని 24 సీట్లకుమొత్తం 84 మంది పోటీ చేస్తున్నారు.

ప్రస్తుతం పోటీచేస్తు వారిలో శ్రీ ఎ. యస్. రామయ్య, జి. సి. సుబ్రమణ్యం, పి. మునిరెడ్డి, పి. మునిస్వామిరెడ్డి మాజీ పురపాలక సంఘ అధ్యక్షులు. పి. యస్. గురవారెడ్డి ప్రస్తుతం అధ్యక్షులుగా వుండి మరల పోటీచేస్తున్నారు.

రాజకీయ పార్టీలుగా ఒక్క జనసంఘం మాత్రం పోటీచేస్తున్నది. పట్టణ కాంగ్రెసు కార్యదర్శి, పట్టణకాంగ్రెసు అధ్యక్షులు, పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ జగన్నాథం ఇండిపెండెంటు అభ్యర్థులుగా పోటీచేస్తున్నారు.

శ్రీ ఎ. యస్. రామయ్య, శ్రీ పి. యస్. గురవారెడ్డి రెండు గ్రూపులకు నాయకులుగా పురపాలకసంఘ రాజకీయాలలో చాలాకాలమునుంచి వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికలలోకూడా వారి గ్రూపులే ప్రధానపాత్ర నిర్వహించనున్నాయి.

10 వ వార్డులో పోటీచేస్తున్న శ్రీ కె. ఆర్. వెంకటాచలం అయ్యర్ స్థానిక భీమాస్‌గ్రూపు హోటల్సు యజమాని, లక్షాధికారి. వీరిప్రత్యర్థి శ్రీ ఎ. మునిరత్నం నాయుడు బాగా చదువుకున్న యువకుడు. ఈ వార్డులో శ్రీ అయ్యర్ ఓటుకు రు. 50/- వరకు ఖర్చుపెడతారని అనుకుంటున్నారు.

సభలు- సమావేశాలు

నవయుగవైతాళికుడు సంఘ సంస్కర్త శ్రీ కందుకూరి వీరేశలింగం జయంత్యుత్సవం ఈనెల 16వ తేదీ రాజమండ్రి టౌన్‌హాలులో సాయంకాలం 6½ గంటలకు జరుగుతుంది.

* * *

పల్నాడు తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ కార్యకర్తల జనరల్‌బాడీ సమావేశం నడికుడెలో ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుంది

రాయ్‌బరేలీ, ఏప్రిల్ 12

రాయ్‌బరేలీకి సుమారు రెండు మైళ్ళలో ప్రెఫ్యాన్ వద్ద సుమారు 0 లక్షలవ్యయంతో నిర్మించిన విద్యుత్ ఉప కేంద్రానికి నేడు ప్రధాని ఇందిరాగాంధి ప్రారంభోత్సవం చేశారు

వనరుల అభివృద్ధి పరస్పరం ముడిపడి వున్నాయనీ. వనరుల కొరత ఏర్పడితే, అభివృద్ధి జరగదనీ ఆమె అన్నారు.

విద్యారంగంలో ప్రభుత్వ వైఫల్యం

పులివెందుల సమితి ప్రాథమికోపాధ్యాయ సంఘ సమావేశంలో నాయకుల విమర్శ

పులివెందుల, ఏప్రిల్ 14

పాఠశాలల జాతీయ కరణలో ప్రభుత్వం తిరోగమనం పట్టినట్లయితే రాష్ట్రవ్యాపితంగా ఉపాధ్యాయులు తీవ్రఆందోళనకు దిగవలసి వుంటుందని, అట్టి విపత్కర పరిణామాలు వుత్పన్నం కాకుండా చూడాలని, ప్రభుత్వం వెంటనే సమగ్రమైన విద్యాబిల్లును ప్రవేశపెట్టి మిగిలిపోయిన పాఠశాలలను జాతీయం చేసుకోవాలని కోరుతూ పులివెందుల సమితి ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యవర్గ, ప్రత్యేకాహ్వానితుల సమావేశంలో పలువురు ఉపాధ్యాయ నాయకులు ఉద్ఘాటించారు.

సమితి, జిల్లాపరిషత్తులస్థాయిల్లో అపరిష్కృతమైన సమస్యల పరిష్కారానికై ఉపాధ్యాయులు రాష్ట్రవ్యాపితంగా కలెక్టరు కార్యాలయాల ఎదుట ధర్నా చేయవలసి వచ్చిందని శ్రీయుతులు కె. నాగముని, టి. లక్ష్మిరెడ్డి పి. రామన్న, పి. సి. వెంకటేశు కె. చెన్నకేశవరెడ్డి, ఎస్. వి. కొండారెడ్డి ,వివరించారు.

పులివెందుల సమితి ఉపాధ్యాయ ఫెడరేషన్ (రిజిష్టర్డు) కార్యవర్గ ప్రత్యేక ఆహ్వానితుల సమావేశం పులివెందుల అంకాలమ్మపేట అప్పర్ ప్రైమరి సమితి పాఠశాలయందు జరిగింది. సమావేశానికి శ్రీ యస్. వి. కొండారెడ్డి అధ్యక్షత వహించారు. వివిధ సెంటర్లనుండి ఉపాధ్యాయులు హాజరయ్యారు. ప్రత్యేకాహ్వానంపై రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ (రిజిష్టర్డు) కార్యదర్శి శ్రీ కె. నాగముని కూడా హాజరయ్యారు.

సమితి సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ యస్. వెంకట్రామయ్య కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

ఖాళీగావున్న అధ్యక్షస్థానానికి శ్రీ లక్ష్మిరెడ్డిని ఎన్నుకున్నారు.

కాంట్రాక్టు పద్ధతిన సస్యరక్షణ పథకం

పశ్చిమ గోదావరిజిల్లాలో

ఏలూరు, ఏప్రిల్ 14

పశ్చిమ గోదావరిజిల్లాలో ప్రైవేటు సంస్థలచే కాంట్రాక్టు పద్ధతిని సస్యరక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.

ఆకివీడు పంచాయితీ సమితిలోని చెరుకుమల్లి, ఉప్పలూరు, విస్సాకోడేరు సమితికి చెందిన వీరవాసరం, పోడూరు సమితిలోని ఆచంట, పెనుమంట్ర సమితిలోని మామిడూరు, పెరవలి సమితిలోని తేతలి, దువ్వ, పెదపాడు సమితికి చెందిన శ్రీపర్రు, మానూరు, కాలిపూడి గ్రామాల్లో మొత్తం 1285 ఎకరాలలో ప్రయోగాత్మకంగా పురుగు, తెగుళ్ళబారి నుండి, సస్యరక్షణ కార్యక్రమం చేపట్టబడింది. ఆ యా గ్రామాల రైతులు ఈ పద్ధతి ఎంతో ప్రోత్సాహకరంగా ఉందని అభిప్రాయాలను తెలియజేస్తున్నారు.

ఈ కార్యక్రమం నిర్వహించినతరువాత, జిల్లాలోని బ్లాక్ డెవలప్‌మెంటు అధికారులు, శాస్త్రజ్ఞులు, పంచాయితీ సమితి అధ్యక్షులు, వ్యవసాయ విస్తరణాధికారులు, తదితర అధికార, అనధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రిమిసంహారక ఔషధాలను తయారుచేయు ప్రైవేటు కంపెనీల సహకారంతో కాంట్రాక్టుపద్ధతిని సస్యరక్షణ కార్యక్రమం నిర్వహించటం, ఒక వినూత్న పద్ధతినీ, భారతదేశంలో ప్రథమంగా ఈ జిల్లాలోనే ప్రవేశపెట్టబడిందని అన్నారు.

ఈ కార్యక్రమం నిర్వహించుటకు దాదాపు 100 స్ప్రెయర్స్ జిల్లాపరిషత్ నిధులనుండి. జిల్లా సంక్షేమ నిధినుండి వాడుకలోకి వుండాలని అన్నారు. ఈ సందర్భంలో జరిగినసమావేశానికి జిల్లాపరిషత్ అధ్యక్షులు శ్రీ సి. హెచ్. వి. హెచ్. రామజోగయ్య అధ్యక్షత వహించారు.

కమ్యూనిస్టుపార్టీ శాఖ నిర్మాణం

కొయ్యలగూడెంలో

రామన్నపేట, ఏప్రియల్ 14

రామన్నపేట తాలూకా దేవలమ్మనాగారం మజరగా కొయ్యలగూడెం గ్రామంలో నూతనంగా కమ్యూనిస్టుపార్టీ శాఖ నిర్మాణం ఇటీవల జరిగింది.

శ్రీ వంగెం లక్ష్మినారాయణ అధ్యక్షతన 35 మందితో సమావేశం జరిగింది.

సమావేశానికి భువనగిరి తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యవర్గ సభ్యులు శ్రీ జంగ ఎల్లయ్య, యాదవరావు హాజరయికమ్యూనిస్టుపార్టీ నిర్మాణాన్ని గురించి కాంగ్రెస్ప్రభుత్వ దివాళాకోరు విధానాన్ని గురించి వివరించారు

తెలంగాణా ఆందోళనపై మాట్లాడుతూ 1956 పెద్ద మనుషుల ఒప్పందాన్ని జరిపించేందుకు గ్రామశాఖలు కదిలిపని చేయాలని తెలిపారు.

ఈ సమావేశంలో రామన్నపేట తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యవర్గ సభ్యుడు శ్రీ బూడిద రాంరెడ్డికూడా మాట్లాడారు.

తదనంతరం కార్యదర్శిగా శ్రీ గుజ్జుల సత్తిరెడ్డి సహాయకార్యదర్శిగా శ్రీ జంగం మల్లారెడ్డి కార్యవర్గ సభ్యులు శ్రీ యుతులు బూడిద రాంరెడ్డి కందకట్ల చంద్రారెడ్డి వనం అనోద్య, కంది లచ్చిరెడ్డి, గుజ్జుల లక్ష్మారెడ్డి ఎలిగుంట గాలయ్య, గుజ్జుల నర్సిరెడ్డిలతో శాఖ కార్యవర్గం ఎన్నికయింది.

విశాఖ ఆర్. టి. సి. ఎంప్లాయీస్ యూనియన్ కమిటీ ఎన్నిక

విశాఖపట్నం, ఏప్రిల్ 11

ఆంధ్రప్రదేశ్ రోడ్ ట్రాన్స్‌పోర్టుకార్పొరేషన్ విశాఖ డిపో కార్మికుల సమస్యలను అధికారులకు నివేదించడానికై డిపో కమిటీ ఇటీవల ఏర్పాటు చేయబడింది

ఈ సందర్భంగా జరిగిన సభకు పశ్చిమగోదావరి ఆర్ టి సి. యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షులు శ్రీ కె నారాయణ రాజు అధ్యక్షత వహించారు. ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి శ్రీ యం. వి. యస్. కపర్ది రాష్ట్రవ్యాపితంగా ఎంప్లాయీస్ యూనియన్ చేసిన కృషిని వివరించి, ఐ ఎన్. టి. యు సి. కి చెందిన పోటీ సంఘపు బూటకపు కబుర్లకు మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నంలోని ప్రముఖ కార్మిక, కమ్యూనిస్టు కార్యకర్త శ్రీ యం భద్రమూర్తి శర్మ ఆర్ టి సి. కార్మికుల న్యాయమైన కోర్కెలపట్ల పట్టణంలోని ఇతర కార్మికుల సంఘీభావం ఎల్లప్పుడూ వుంటుందన్నారు. పశ్చిమ గోదావరిజిల్లా బ్రాంచి కౌన్సిల్ సహాయ కార్యదర్శి శ్రీ వాసిరెడ్డి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కన్వీనరుగా శ్రీ పి యస్. యన్. పాత్రుడు, ఆర్గనైజరుగా శ్రీ నారాయణ, కోశాధికారిగా శ్రీ ఆర్ కామేశ్వరరావు, శ్రీయుతులు ని హెచ్. శ్రీరాములు, పి కె. యం రాజులు సభ్యులుగా 5 గురితో డిపో కమిటీ ఎన్నికయింది. (వి. వి)

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

శ్రీ జ్ఞానానందకవి వివరణ

కాకినాడ, ఏప్రిల్ 14

స్థానిక మెక్లారిన్ హైస్కూలులో పాఠశాల దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని గాంధీ శతజయంత్యుత్సవం జరుపబడింది. సభకు ప్రధానాచార్యులు శ్రీ జె. ఇస్రాయేల్ అధ్యక్షత వహించారు.

గాంధీజీ శతజయంత్యుత్సవ సందర్భంగా శ్రీ జ్ఞానానందకవి విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మామూలు చదువు సంధ్యల కంటే శాస్త్రీయంగా సాంకేతికంగా పరిజ్ఞానం అలవర్చుకోవటం నేడు దేశానికి ప్రధాన అవసరం అని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణా రహితంగా వర్తిస్తే దేశశ్రేయస్సు, ప్రజాశ్రేయస్సు దెబ్బతింటుంది అన్నారు

శ్రీ కనకదండి గోపాలకృష్ణ శాస్త్రి గాంధీ జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీ శాస్త్రి జ్ఞానానందకవికి పండిత సత్కారం జరిగింది

తిరుపతి వార్తలు

ప్రకాశం హైస్కూలు వార్షికోత్సవం

తిరుపతి, ఏప్రిల్ 14

1100 మంది విద్యార్థినీ, విద్యార్థులుగల స్థానిక ప్రకాశం పురపాలకోన్నత పాఠశాల తొమ్మిదవ వార్షికోత్సవం ఇటీవల జరిగినది. శ్రీ సుబ్బరామరెడ్డి పార్కులో జరిగిన యీ వుత్సవానికి కడప రామకృష్ణ వున్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కె. రామమూర్తి అధ్యక్షత వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ కె. వి. నరసింహమూర్తి సాంవత్సరిక నివేదికను సమర్పిస్తూ తమ స్కూలునందు ప్రతి ఏటా 50 నుంచి 60 శాతం విద్యార్థులు ప్రభుత్వ పరీక్షలలో వుత్తీర్ణులవుతున్నట్లు తెలియజేశారు.

డాక్టర్ యస్. బ్రహ్మాజీరావు విద్యార్థులకు బహుమతి ప్రదానం గావించారు. 11 వ తరగతి విద్యార్థి చి॥ బాలగోపాలు అత్యధిక మార్కులు సంపాయించి బంగారుపతకం బహుమతిగా పొందారు.

10 వ తరగతి విద్యార్థిని చి॥ మాలిని అన్ని పాఠ్య అంశములందు అధికతర మార్కులు సంపాయించి పదికిపైగా బహుమతులు తీసుకున్నది

ఈ స్కూలుకు బిల్డింగ్ వసతిలేక పురపాలకసంఘ పార్కునందు షెడ్డులలో తరగతులు నిర్వహిస్తున్నారు. శిథిలమైన పార్కు అగుటవలన మొక్కలు పెరకివేయబడి వికృతంగా వెల్లడుమ్ము లేస్తున్నది. ఆ దుమ్ము ప్రదేశముననే సాంవత్సరిక ఉత్సవం నిర్వహించబడినది. ఆహ్వానాలు అందచేసినప్పటికి బాధ్యతగల పురపాలక అధికారులు ఆ ఉత్సవములకు హాజరుకాలేదు

రైల్వే లైనుపై శవం

తిరుపతి రైల్వేస్టేషన్‌కు తూర్పున మీటర్ గేజ్ లైను పైన శ్రీ మహదేవప్ప అనే వ్యక్తి శవం 9 వ తేది ఉదయం కనుగొనబడినది. ఈ మహదేవప్ప, టి టి. దేవస్థానపు వర్కుషాపునందు ఫిట్టర్ అని చెప్పబడుతున్నది

దేవస్థానపు కొత్త సత్రం ప్రక్కన మామిడితోటలో కాపురమున్న శ్రీమతి సుగుణ అనే మస్తాన్‌బీతో యీ మహదేవప్పకు అక్రమ సంబంధమున్నట్లు, ఆమెతో యిలాంటి సంబంధమున్న కొందరు మహదేవప్పను హత్యచేసి రైలులైన్‌పై వేసినట్లు పట్టణమున వదంతిగా వున్నది.

శ్రీమతి సుగుణ అనే మస్తాన్‌బీని రైల్వే పోలీసువారు అరెస్టు చేసినారు.

తిరుపతి వాస్తవ్యులు అంకడు, సింగ్, బాలసుబ్రమణ్యం అనువారిని అనుమానముపైన పోలీసువారు కస్టడిలోనికి తీసుకున్నారు.

రైల్వే పోలీసు వితరణ

తిరుపతి రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ శ్రీ వెంకటాచార్యులు యాత్రికులు మరచి వదలివేసిన బంగారు నకలెస్‌ను స్వాధీన పరచుకుని ప్రభుత్వానికి అప్పగించినపుడు దక్షిణాంధ్ర విలేకరికి తెలియచేయబడినది

ఒక ప్లాస్టిక్ బుట్ట, అందున్న పెడిన్ చీరెలు, చిన్నపిల్లల దుస్తులు 200 పైగా తెల్లగుబ్బు పొందగబడివున్న సుమారు రూ 800/ ఖరీదుచేయు బంగారు నెక్‌లెస తిరుపతి రైల్వే ప్లాట్ ఫారం మీద శ్రీ వెంకటాచార్యులకు కనిపించినది ఆ సొత్తుకు సంబంధపడినవారు కనుపించనందున తిరుపతి రైల్వే పోలీసువారు ఆ సొత్తును చంద్రగిరి [illegible] వారికి అందజేసినట్లు, ఆ సొత్తుయజమానులు వచ్చి తీసికొనిపోవచ్చునని రైల్వే పోలీసు అధికారులు తెలియచేస్తున్నారు.

మానుకోట తాలూకా గ్రామాల్లో గ్రూపు సమావేశాలు

తెలుగుప్రజల ఐక్యతకోరుతూ

మానుకోట, ఏప్రిల్ 14

తెలుగు ప్రజల సమైక్యతను కోరుతూ వరంగల్‌జిల్లా మానుకోట తాలూకా పేకులగూడెం, మల్లన్నగూడెం, బొడ్డుగొండ గ్రామాల్లో ఈ నెల 7 వ తేదీన గ్రూపు సమావేశాలు జరిగాయి.

సమావేశం అవసరాన్ని గురించి తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ వెంకటమల్లు, సమితి సభ్యులు శ్రీ వి. రాధాకృష్ణ వివరించారు.

కంభాలపల్లిలో జనరల్ బాడీ

కంభాలపల్లిగ్రామంలో కమ్యూనిస్టు పార్టీ జనరల్‌బాడీ సమావేశమై శ్రీ సోమమల్లయ్య అధ్యక్షతనజరిగింది.

కాంగ్రెసు ప్రభుత్వ విచ్ఛిన్నకర ధోరణిని ఖండిస్తూ, తెలుగు ప్రజల ఐక్యతను గురించి శ్రీ వెంకటమల్లు వివరించారు.

శ్రీశైలం ప్రాజెక్టు లేబర్ కాలనీలో 35 గుడిసెల దగ్ధం

శ్రీశైలం ప్రాజెక్టు, ఏప్రిల్ 14

శ్రీశైలం ప్రాజెక్టు లేబరు కాలనీలో ఈనెల 7వ తేదీన అగ్ని ప్రమాదం సంభవించి 35 గుడిసెలు దగ్ధమై పోయినవి. ఈ ప్రమాదానికి గురయిన వారిలో ప్రాజెక్టు డిపార్టుమెంటుచే క్వార్టర్సు పొందగలిగిన యోగ్యతవుండి 5 సంవత్సరాల నుండి పని చేయుచున్నవారు 8 మంది వున్నారు.

వెంటనే యూనియన్ కార్యకర్తలు భాస్కర్ ప్రకాశం, శాస్త్రి, కరుణాకర్ వెళ్ళివారి జాబితా తయారుచేసి, ఎ. ఎం. యు, ఓ. ను తీసుకవచ్చి అగ్నిబాధితులకు వెంటనే సహాయానికై ఇంటికి 5 కిలోల బియ్యం ఇప్పించారు, ఇంటి సామానులు డబ్బు ఇప్పించుటకై ప్రయత్నం చేస్తున్నారు. ఈ శ్రామికులకు ప్రభుత్వం తగిన విధంగా సహాయం చేయకోరుచున్నారు.

కాకినాడ పోర్టు లేబర్ యూనియన్ భవన ప్రారంభోత్సవం

కాకినాడ, ఏప్రిల్ 14

కాకినాడ పోర్టు మరియు షోర్ లేబర్ యూనియన్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవ సభ ఇటీవల జరిగింది. పట్టణ కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీరామాయణం సత్యనారాయణ సభను ప్రారంభించారు. కమ్యూనిస్టు నాయకులు డా॥ యం. కె. విశ్వనాథం జండా ప్రతిష్టించారు, కార్మిక నాయకులు శ్రీ కాళా జనార్దనరావు సభకు అధ్యక్షత వహించారు.

సభలో యూనియన్ కార్యదర్శి శ్రీ చింతపల్లి అప్పారావు, శ్రీ రామాయణం సత్యనారాయణ, డా॥ ఎం. కె. విశ్వనాథం, కార్మిక నాయకులు శ్రీ హుస్సేన్, రిక్షా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శ్రీ కొప్పర్తి వీరభద్రరావు, ఇట్ల మరియు బండ్ల కార్మిక సంఘ నాయకులు శ్రీ గుబ్బల నారాయణ ప్రసంగించారు.

శ్రీ రామాయణం సత్యనారాయణ తమ ప్రారంభోపన్యాసంలో కార్మిక సంఘానికి ఆఫీసు ఆవశ్యకతను వివరించారు.

డా॥ యం. కె. విశ్వనాథం తమ ప్రసంగంలో ఎర్రజండా చరిత్రను వివరించి ఈ జండాక్రింద కార్మికవర్గ రాజ్యాలు నేడు ఏర్పడ్డాయని, అవి సుభిక్షంగా ఉన్నాయని అన్నారు.

శ్రీ గుబ్బల నారాయణ కార్మికవర్గ ఐక్యతావశ్యకతను వివరిస్తూ, పట్టణంలోని వివిధ కార్మికసంఘాల ప్రతినిధులతో ట్రేడ్ యూనియన్ కౌన్సిలును ఏర్పరచాలన్నారు.

సభాధ్యక్షులు శ్రీ కాళా జనార్దనరావు కార్మికవర్గ సందేశంతో సభ ముగిసింది. (వి వి.)

చైనాతో ఒప్పందానికై పిలుపు

జపానుచే సూచన

టోక్యో, ఏప్రిల్ 12

చైనాతో శాంతి ఒప్పందం చేసుకోవాలని, పూర్తి దౌత్యసంబంధాలను ఏర్పాటు చేయవలసిందిగా నేడు జపాన్ ప్రధాని ఇసాకు సాటో పార్టీకి చెందిన ఒక ముఖ్యుడు నేడు విజ్ఞప్తి చేశారు.

ఇటీవల పెకింగ్‌లో జరిగిన జపాన్ వాణిజ్య ప్రదర్శనకు ఆయన ప్రధాన బాధ్యుడు.

గుంటూరుజిల్లాలో సమైక్యతా ప్రచారం

జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యక్రమం

గుంటూరు, ఏప్రిల్ 14

విశాలాంధ్ర సమైక్యతా ప్రచారానికై రాష్ట్రకమ్యూనిస్టు సమితి యిచ్చిన కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి, రాష్ట్రంలో ప్రస్తుత విచ్ఛిత్తికి కారణభూతమైన శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం అధికారంనుండి వైదొలగాలని డిమాండ్ చేస్తూ జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యక్రమం తీసుకొన్నది.

జిల్లాలో పొగాకు రైతులు నష్టపడిన తీరును గమనించి తగిన ఆందోళన కార్యక్రమాన్ని రూపొందించుటకు జిల్లా కమ్యూనిస్టు (మార్క్సిస్టు) పార్టీతో కలిసి తీసుకున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయుటకు దీక్షతో పని చేయాలని నిర్ణయించింది.

జిల్లాలో యింతవరకూ జరిగిన పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ, పార్టీ నిధి వసూళ్ళు, సమీక్షించారు. సభ్యత్వ పునరుద్ధరణ 'మేడే' నాటికి పూర్తి చేయాలని వివిధ శాఖలను ఆదేశించారు

నాగిరెడ్డిపర్యటన కార్యక్రమం

జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ నాగిరెడ్డి క్రింది విధంగా పర్యటిస్తారు.

ఈ నెల 16 వ తేదీన బాపట్ల తాలూకా నర్సాయిపాలెంలో బహిరంగసభలో పాల్గొంటారు 17 వ తేదీన గుంటూరు తాలూకా తాడికొండ 18 న ఒంగోలు తాలూకా 19 న సత్తెనపల్లి, 20 న చిలకలూరిపేట 21 న గుంటూరు తాలూకా పెదవడ్లపూడి, 22 న గుంటూరు తాలూకా, 23 న నర్సరావుపేట 29 30 తేదీల్లో తెనాలి తాలూకా, మే 2 న రేపల్లె తాలూకా ఇతర ఏరియాలో పర్యటిస్తారు

గంగాధరరావు పర్యటన

జిల్లా సమితి సహాయ కార్యదర్శి శ్రీగంగాధరరావు బాపట్లతాలూకా ఇంకొల్లు ఈ నెల 16 న రేపల్లె (తాలూకా జనరల్‌బాడీ), 17 న నర్సరావుపేట తాలూకా, 18 న గుంటూరు తాలూకా, 20 న తెనాలి తాలూకా (వ్యవసాయ కార్మికమహాసభ). 22, 23 తేదీలలో నర్సరావుపేటలో (జిల్లా వ్యవసాయ కార్మిక మహాసభ). 24 25 తేదీల్లో మంగళగిరి, 26, 27 తేదీల్లో చీరాల, 28, 29 తేదీల్లో తెనాలి తాలూకాలు పర్యటిస్తారు.

బొడ్డు కృపానందం పర్యటన

శ్రీ బొడ్డు కృపానందం ఈనెల 14 15 తేదీలలో బాపట్ల తాలూకా, 16 న [illegible] తాలూకా కరాలపాడు 17, 18 19 తేదీల్లో నర్సారావుపేట, 20 న గుంటూరు తాలూకా ఆత్మకూరు (వ్యవసాయ కార్మిక మహాసభ.) 22, 23 తేదీలలో నర్సరావుపేట జిల్లా వ్యవసాయ కార్మిక మహాసభలో పాల్గొంటారు.

పి. శ్రీరాములు పర్యటన

శ్రీ పి శ్రీరాములు ఈ నెల 15 వ తేదీన బాపట్ల తాలూకా ఇంకొల్లు 16 న నర్సాయిపాలెంలో పర్యటిస్తారు.

వెంకటస్వామి పర్యటన

శ్రీ నాతాని వెంకటస్వామి ఈ నెల 16 న తెనాలి తాలూకా కౌన్సిల్, 19 న వినుకొండ తాలూకా సమితి జనరల్‌బాడీకి హాజరవుతారు.



కొత్తవలస - కిరండుల్ కొండల మార్గంలో ముడి సరుకులు తీసుకొని వెళుతున్న రైలు

ఆగ్నేయ రైల్వే ప్రగతి పథం

(4 వ పేజీ తరువాయి)

ఎంతో దోహదకారి కాగలదు టికియా పారా పాంచ్ ఖరాం మధ్య మూడవ లైను నిర్మాణం పూర్తయింది, ప్రస్తుతం ఖర్గపూర్-విజయనగరం జంటమార్గం పని చురుకుగా సాగుతోంది ఇప్పటికి మొత్తం 530 కి మీటర్ల జంట మార్గం రవాణాకు తెరువబడింది. మిగిలిన శాఖల్లోను పని 1971 నాటికి పూర్తి కాగలదని అంచనా పదిన్నర కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మితమయ్యే 84 కి. మీటర్ల కటక్ - పారదీప్ రైలుమార్గ నిర్మాణానికి సర్వే పని పూర్తయి నిర్మాణం ఆరంభమయింది. ఒరిస్సాలోని పారదీప్ ఓడరేవు కుపకరించే ఈ మార్గ నిర్మాణం 1971 నాటికి పూర్తవుతుంది

నింపురా, వాల్తేరులోని మార్షలింగు యార్డులు. షాలిమార్ వద్ద గల టెర్మినల్ యార్డు నిర్మాణదశదాటి పని ప్రారంభించాయి. నింపురా, టాటానగర్, వాల్తేర్, భిలాయ్, బొండమొండ మార్షలింగు యార్డులలో ఆధునిక యంత్రాలను ప్రవేశపెడుతున్నారు. ఎలక్ట్రిక్ రైళ్ళ కోచీలకై హౌరా వద్దగల టికియా పారాలో ఒక స్థావరం నిర్మితమయింది.

బొకారాలో స్థాపించబడే ఉక్కు కర్మాగార సేవల దృష్ట్యా, నాలుగున్నర కోట్ల రూపాయలఖర్చుతోమార్షలింగుయార్డుఎక్చేంజ యార్డు నిర్మించబడనున్నాయి 1971లో ఉక్కుకర్మాగార ఉత్పత్తిదశ అంచనాలమేరకు చేరుకునేలోగాఈ యార్డుల నిర్మాణం పూర్తవుతుంది బొకారో కర్మాగార రవాణావసరాలను తీర్చేందుకు రెండు కోట్ల రూపాయల ఖర్చుతో రాజబేరా - బొకారాల మధ్యనున్న 11 కిలో మీటర్ల ఒంటి మార్గం జంటగా మార్చబడుతోంది, మురీ - హటియా జంట మార్గ నిర్మాణ నిమిత్తం రు. 5.75 కోట్లు వెచ్చింపబడుతోంది.

ఆగ్నేయ రైల్వేలోని అనేక ముఖ్య మార్గాలలో ఆటోమేటిక్ సిగ్నలింగు పద్ధతి అమలులోవుంది. రద్దీ హెచ్చుగానున్న అన్ని స్టేషన్‌లలో రూట్ రిలే ఇంటర్ లాకింగ్ పద్ధతి ప్రవేశ పెట్టబడింది

విద్యుద్దీకరణ

హౌరా - ఖర్గపూర్ మధ్య గల యావత్తు 116 కి మీటర్ల మార్గంలో విద్యుద్దీకరణ కార్యక్రమం పరిసమాప్తి కావటంతో ప్రస్తుతం శివారు సర్వీసులోవున్న ఇ ఎం. యు సర్వీసుల కదనంగా నాలుగు జతల మెయిల్, ఎక్స్‌ప్రెస్ బళ్లు, ఏడుజతల ప్యాసింజరు బళ్లు 1968 69 కాలంలో ఆవిరి ఇంజన్లు వదలి విద్యుత్తు వాడనారంభించాయి ఈ మార్గంలో అంతకు పూర్వమే 13 జతల ప్యాసింజరు బళ్లు విద్యుత్తుతో నడుస్తున్నాయి

రూర్కెలా, దుర్గ రైలుమార్గాన్ని 28 కోట్ల రూపాయల వ్యయంతో విద్యుద్దీకరిస్తున్నారు, రూర్కెలా - ఝార్సుగూడా (102 కి మీ) విద్యుద్దీకరణ కార్యక్రమం ఈనెల లోనే పూర్తి కానున్నది. ఆగ్నేయ రైల్వేలో ఇప్పటికి 849 రూట్ కిలోమీటర్ల మార్గంలో 2040 ట్రాక్ కిలో మీటర్ల మార్గంలోవిద్యుద్దీకరణ జరిగింది. ఈ ఏర్పాట్లన్నీ పూర్తయ్యేసరికి నేరుగా కలకత్తా నుండి దుర్గవరకు విద్యుత్ రైళ్ళను నడిపి ప్రయాణ వేగాన్ని పెంచి ప్రయాణ వ్యవధిని గణనీయంగా తగ్గించ వీలవుతుంది

కొత్త వర్క్‌షాపులు

రైల్వేవిద్యుద్దీకరణ కుపకరించేపూతఇనుము తయారు చేసేందుకు రు. 20 లక్షలతో రాయ్‌పూర్‌లో 'గాల్వనైజింగ్‌ప్లాంటు' స్థాపించడం జరిగింది రు. 6 37 కోట్ల వ్యయంతో నిర్మించినవాగన్ రిపేరు షాపుకూడ ఇక్కడేవుంది.

నూతన దృక్పథం

రైల్వేలతో రోడ్డు రవాణా పోటీపడటం రైల్వేఅంగీకరిస్తుంది, ఆహ్వానిస్తుంది అయితే అదిఆరోగ్యప్రదమయినపోటీ. రోడ్డురవాణాకు హానికలిగించే దృక్పథంతోగాక గతంలో తరలిపోయిన రవాణాను తిరిగి రాబట్టుకోవడానికి ఆగ్నేయ రైల్వే 'మార్కెటింగ ఆర్గనైజేషన్' సంస్థను నెలకొల్పింది. 'ఆటోమొబైల్' పరిశ్రమ తన రవాణాను తిరిగి రైల్వేలకు మళ్లించటం రైల్వేకు గొప్ప సంతృప్తినిచ్చింది హిందూస్తాన్ మోటార్స్ ఈ సదుపాయాలను బాగా వినియోగించుకొని మద్రాసు, బొంబాయిలకు తరలించే తమ యావత్తు రవాణాను ఆగ్నేయ రైల్వే కప్పగించటం దీనికొక ఉదాహరణ. వారి రవాణావసరాల కోసం సగటున నెలకు ఆరు 'ప్రత్యేక మోటారు రవాణా రైళ్ళు' నడుస్తున్నాయి. విద్యుత్పరికరాలు పాదరక్షలు మందులు, బిస్కట్లు, సిగరెట్లు, టీ మున్నగు అధిక రవాణా వస్తువులను 'మార్కెటింగ్' సేల్స్ ఆర్గనైజేషన్, ద్వారా తిరిగి రైల్వే రాబట్టుకో గలిగింది.

సరకు ప్యాకింగు నిబంధనలోని సాధకబాధకాలను తొలగించి, వివిధ రవాణా పద్ధతులు అమలులోగల ప్రాంతాలకు సైతం త్వరితంగాను, భద్రంగాను, హెచ్చురాబడి నిచ్చే చిన్న వస్తువుల రవాణా నాకరిస్తూ అతిత్వరలోనే కంటైనర్ సర్వీసులను అమలుకు తేవాలని రైల్వే ఉబలాటపడుతోంది.

కలకత్తా, దాని పరిసర ప్రాంతాలలో ఆరంభమయిన, మొబైల్ బుకింగు స్కీము రైల్వేపరకు రవాణాలో సాధించిన నైపుణ్యానికి మచ్చుతునక, ఒకముక్కలో చెప్పాలంటే రైల్వే గుడ్స్‌షెడ్ ఫ్యాక్టరీవరకు విస్తరిల్లిన దన్నమాట, రవాణాకై రైల్వే కప్పగించిన సరకును ఫ్యాక్టరీ లోనే రైల్వే రశీదు క్రింద బుక్‌చేసి, ఆయా ఫ్యాక్టరీలు తమ స్వంత రవాణాతో షాలిమార్ రైల్వే గూడ్స్ షెడ్‌కు చేర్చగా, తిరిగి రైల్వేవారివి వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తోంది అనేక పెద్ద కంపెనీలు ఈ స్కీములో చేరగా రవాణా చెప్పుకోదగిన రీతిలో పెరిగింది రైల్వే, రోడ్డు రవాణాల మధ్య పరస్పర సహకారానికి దోహదకారిగా రైల్వే, తాను ప్రకటించిన విధానానికి అనుగుణంగా రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ అక్టు, 1960 ప్రకారం బీహార్, మధ్యప్రదేశ్‌లలోని రోడ్డు రవాణా సంస్థలలో షేర్లు కొనడం ద్వారా ఆర్థిక సహకారాన్నందించింది. ఈ రెండు రాష్ట్రాలలో యింతవరకు ఈ స్కీముక్రింద వరుసగా రు. 44 36 రు. 121 48 లక్షలు పెట్టుబడి పెట్టబడినాయి. ఒరిస్సాలోని మరొక సహకార రోడ్డు రవాణా సంస్థలో రైల్వే రు. 6 లక్షం పెట్టుబడి పెట్టింది.

ఆగ్నేయరైల్వే నేడు తన యావత్తు శక్తిసాధన సంపత్తులను ఉపయోగించి మహత్తర మార్పుల్ని తెస్తోంది, భారతీయరైల్వేలలోకెల్ల హెచ్చురవాణా సాంద్రతగల ప్రాంతాలు ఆగ్నేయ రైల్వేలో వున్నాయి. ఈ వత్తిళ్ళనన్నింటినీ తట్టుకోడానికి ఎంతో మెళకువతో పని చేయవలసివుంది. ఏకొద్ది ఏమరుపాటు జరిగినా అది పెద్దవిఘాతంలా మారి విపత్కర పరిణామాలతో అన్ని శాఖలను గొలుసులా బంధిస్తుంది. గరిష్ట ప్రమాణంలో పనిచేసే బృహత్తర విద్యుదుత్పాదక కేంద్రంతో రైల్వేను పోల్చవచ్చు. ఏచిన్న పొరపాటు జరిగినా యావత్తు ప్రాంతంలో అంధకారం అలుముకొంటుంది ఈమాదిరిగానేరైల్వేలలో సూక్ష్మ కేబుల్ దొంగతనంవంటి ఏచిన్న అడ్డంకి కలిగినా వార్తా ప్రసారాదులలో అనేక అఘాతాలు కలిగి దాని ప్రభావం సుదూర ప్రాంతాలకు సయితం ప్రాకుతుంది, అభివృద్ధిని కానరాకుండా చేసే రెండు చీడపురుగులు భారత రైల్వేలను పీడిస్తున్నాయి

టికెట్లులేని దొంగ ప్రయాణీకుల పనికట్టడానికి భారత రైల్వేలు ఇటీవల తమ ఉద్యమాన్ని తీవ్రం చేశాయి.

గడచినపదిమాసాల్లోఒక్క ఆగ్నేయ రైల్వేలోనే 26 09 లక్షల దొంగప్రయాణీకులు పట్టుబడ్డారంటే రైల్వేల ఆర్థికాభివృద్ధిని ఎంతగా దెబ్బతీస్తున్నారో తెలుసుకోవచ్చు. వారికి విధించిన శిక్షల మూలంగా రు 88 62 లక్షలు వసూలయింది

రైల్వేలలో రిలేస్ బ్రేక్‌బ్లాక్స్ రాగితీగెలు ఇత్యాదివస్తువుల చౌర్యంవలన నాటికొనుగోలు ఖరీదుకుమించిననష్టం రైల్వేలకుకలుగుచుంది ఇలాంటి జాతి వినాశకర శక్తులను ఎదుర్కొనేందుకు ప్రజలు అత్యంత జాగరూకతతో మెలగి సహకరిస్తేనే భారత రైల్వేలు జాతికి ఇతోధికసేవ చేయగలుగుతాయి.



విశాఖపట్నం పోర్టులో ఓడలోనికి ముడిఇనుమును నింపుతున్న దృశ్యం

లేఖలు

గుంటూరు జనరల్ ఆసుపత్రి దుస్థితి

ఆర్యా.

ప్రభుత్వం ప్రైవేటు ప్రాక్టీసు నిషేధించినప్పటినుండి గుంటూరులోని ప్రభుత్వపు ఆస్పత్రిలో డాక్టర్ల నిర్లక్ష్య వైఖరి మితిమీరిపోతున్నది. రోగులను ఆదరంతో, ఆప్యాయంగా పరామర్శించవలసిన డాక్టర్లు కొంతమంది రోగులకు జబ్బు నయం అయినా, కాకపోయినా తమకువచ్చే జీతం రాకపోతుందా అనే భావంతో రోగులయెడ నిర్లక్ష్యంగా, యీపెడంపు వైఖరి అవలంబించుచున్నారు ముఖ్యంగా ఆర్తోపెటిక్ శాఖనుండి మరీ దారుణ వార్తలు వినబడుతున్నాయి.

తత్ఫలితంగా ఎందరో నిర్భాగ్యుల జీవితాలు తారుమారౌతున్నాయి. ఎందరో అమాయకులు వికలాంగులగుచున్నారు. జనరల్ హాస్పిటల్ అంటే ప్రజానీకంలో భీతి ఏర్పడుతుంది. డాక్టర్ల వైఖరి అనరాగా తీసుకొని వార్డులలో పేషంట్ల స్థితి చూచే పద్ధతి కూడా అంతంత మాత్రంగానే వుంది.

సుమారు 3, 4 నెలలనుండి "ఫిల్ము కొరత" అనే సాకుతో ఎంతో పెద్ద సిఫారసు వుండి, డాక్టర్లు స్వయంగా జోక్యము కలిగించుకొని ప్రత్యక్షంగావుంటేతప్ప సామాన్యజనానికి ఎక్సరేలు తీయుటలేదు. అడ్మిట్ అయిన పేషంట్లకు ఎమర్జన్సీ అని వ్రాసిన ఎక్సరేలు నిరాకరింప బడుతున్నవి. అడ్మిట్ అయిన పేషంట్లు బయటకువచ్చి తీయించుకొనుటకు పేదవరక హాస్పిటల్‌లో ఎక్సరేలతీయక ఎక్సరేలేనిదే డాక్టర్లు పరిశీలించేయక బాధపడుతున్నారు.

ఇయటలేని ఫిలిం కొరత ఆస్పత్రిలో ఎలావచ్చిందో మరి పేషంటు గతి యేమికావాలనో ఆలోచించండి. అలాగే వి. డి ఆర్. ఎల్ అనే రక్తపరీక్ష వగైరా ఈ విధమైన రక్తపరీక్షకు ఇంజక్షనుచేసే 9 వ నెంబరు రూములోనే యింజక్షన్లు చేసేవారే రక్తం తీస్తారు.

అచటకు వెళ్ళితే యిప్పుడు కాదు. మేం పనిలోవున్నాం, వేచివుండండి అంటారు. కొంతసేపు గడిచిన తరువాత అడిగితే పిలిచినపుడు మీరు రాలేదు 15 నిమిషాలు మాత్రమే మేంతీస్తాం రేపురండి అంటారు

ప్రతిరోగి రెండవ పర్యాయం వస్తేగాని యిచ్చట రక్తంతీసుకోరు. రక్తపరీక్ష ఫలితాలు రావటానికి కనీసం 10 రోజులు పడుతుందంటారు, వాస్తవానికిమెడికల్‌కాలేజి నుండి మూడవ నాటికే ఫలితాలు (30 నెంబరు) ఎక్సరేలకు దగ్గరలోనున్న రూములో ఉంటాయి. కాని అక్కడ నుండి ఆ కాగితాలను 9 వ నెంబరు రూములోనికి తీసుకవచ్చే నాథుడు లేక యీ ఆలస్యం జరుగుతుంది. 10 రోజులు అనగానే రోగికి నిరాశా నిస్పృహలు ఆవరించుకొని ప్రభుత్వ ఆస్పత్రిఅంటేనే విసుగుకలుగుతుంది. మామూలుగా రక్తపరీక్ష చేసే 15 నెంబరు గదిలోనే యీ వి. డి ఆర్. ఎల్. రక్తపరీక్షకుకూడా రక్తం తీసుకుంటేఏయిబ్బందీ లేకపోతుంది కదా! దేవుడు వరమిచ్చినా పూజారి వరమీయడన్నట్లుంది యీహాస్పిటల్ పరిస్థితి.

ఇలాంటివి ఎన్నో చిక్కులు, సమస్యలు, ప్రతిరోగిని యీ ఆస్పత్రిలో ప్రతినిత్యం ఎదుర్కొన్నవి. డాక్టర్లు అవలంబించుచున్న నిర్లక్ష్య నిరంకుశ పద్ధతులను నివారించుటకు తక్షణ చర్యలు అమలు జరుపవలసినదిగా గుంటూరు జనరల్ హాస్పిటల్ ప్రధాన వైద్యాధికారులను కోరుతున్నాను. రోగులయెడ ప్రస్తుతం అవలంబించుచున్న నిర్లక్ష్య నిరంకుశ యీ పెడంపు వైఖరి మానుకొని మానవతాదృష్టిని అలవరచుకొనవలసినదిగా డాక్టర్లను కోరుతున్నాను.

ఇట్లు
మానం వెంకటనారాయణ
గుంటూరు

బ్యాంకుల జాతీయం ఆవశ్యకత

శ్రీ గోవిందన్‌నాయర్ వివరణ

అలెప్పి, ఏప్రిల్, 13

బ్యాంకు పరిశ్రమ జాతీయకరణకు ప్రత్యామ్నాయం బ్యాంకులపై సామాజిక అజమాయిషీకాదని కేరళ వ్యవసాయమంత్రి శ్రీ యం. యన్. గోవిందన్ నాయర్ తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

బ్యాంకు పరిశ్రమను పూర్తిగా జాతీయం చేయనిదే సోషలిజంవైపు పురోగమించ జాలమని ఆయన అన్నారు.

గతరాత్రి యిక్కడ తిరువాన్కూరు స్టేట్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ 10 వ వార్షిక మహాసభను ప్రారంభిస్తూ ఆయన పై విధంగా అన్నారు.

ప్రైవేటు బ్యాంకులతో పోటీగా స్టేట్ బ్యాంకుల సామర్థ్యాన్ని మెరుగుపరచాల్సిన బాధ్యత ఉద్యోగులపై నున్నదని శ్రీ గోవిందన్‌నాయర్ తెలిపారు.

ఈ వారంలో కేంద్ర మంత్రివర్గ సమావేశాలు

న్యూఢిల్లీ ఏప్రిల్ 1

కేంద్ర మంత్రివర్గం యీ వారం నాలుగుసార్లు సమావేశం కానున్నట్లు తెలియవచ్చింది.

దీర్ఘకాలంగా పరిష్కారం కావలసిన కొన్ని సమస్యల నిమిత్తం యీ సమావేశాలు జరుగుతాయి.

వీటిలో తొలి సమావేశం మంగళవారం జరుగుతుంది.

తిరిగి వారాంతంలో చతుర్థ ప్రణాళిక ముసాయిదాపై పరిశీలనకు సమావేశాలు జరుగుతాయి.

ఈ వారాంతంలో జాతీయ అభివృద్ధి మండలి సమావేశం అవుతుంది.

తూర్పుపాకిస్తాన్ కాందిశీకులకుఆర్థిక పునరావాసం

కలకత్తా, ఏప్రిల్ 1

తూర్పుపాకిస్తాన్‌నుంచి వచ్చిన కాందిశీకుల ఆర్థిక పునరావాస సమస్యలపై కేంద్రం తిరిగి అంచనా వెయ్యాల్సిన అవసరంకలదని పశ్చిమ బెంగాల్ కాందిశీక పునరావాస మంత్రి శ్రీ నిరంజన్ సేన్ గుప్తా నేడిక్కడ కాందిశీకులపునరావాస సమస్యపై జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో తెలియజేశారు

ఆ సమావేశానికి శ్రీ వి. నిరంజప్ప, శ్రీ ఎం.ఎన్. దాండా హాజరయ్యారు. వీరు కేంద్రపునరావాస మంత్రిత్వశాఖ కార్యదర్శి, ఉపకార్యదర్శులు

కేంద్ర సిద్ధాంతానికి ఐక్య సంఘటన ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకత తెలిపింది.

పోలీసు, రెవెన్యూ అధికారుల ఘెరావో

నెల్లూరు జిల్లాలో

నెల్లూరు ఏప్రిల్ 12

నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకాలోని కొండముదుసుపాలెంలో దాదాపు రెండు వందలమంది గ్రామస్తులు నిన్న రెవెన్యూ, పోలీసు అధికారులను ఘెరావో చేశారు.

అధికారులు శిస్తు వసూళ్ళ కొరకు ఆగ్రామం వెళ్ళినట్లు నేడిక్కడకు అందిన వార్తలు తెలుపుతున్నాయి. ఈ సందర్భంగా ఘర్షణ జరిగినట్లు, 4 గురు గ్రామస్తులను అరెస్టుచేసినట్లు తెలుస్తుంది.

ఆయుధాలను ధరించిన 20 మంది. [illegible] గ్రామంలోని [illegible] యిళ్ళపై దాడి జరిపినట్లు తెలుస్తుంది

ఆర్థిక, సామాజిక అసమానతలు

ని శ్రీమతి ఇందిరాగాంధి విచారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13

ఆర్థిక, సామాజిక అసమానతలు, విపక్ష స్వాతంత్ర్యం అర్థాన్నే తారుమారు చేస్తాయనీ జాతీయ ఐక్యత ప్రాతిపదికనే అవి తుడిచి పెట్టేస్తాయనీ భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ ఆకాశవాణి ప్రసంగంలో నేడు తెలియజేశారు.

జలియన్‌వాలాబాగ్ మృతవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ తెలుపుతూ, కాలం తీరిపోయిన అశాస్త్రీయమైన తప్పుడు అభిప్రాయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ప్రజలు పునరంకితం కావాలని నేడు ఆమె విజ్ఞప్తి చేశారు.

చాలమంది ప్రజలలో దీర్ఘంగా నాటుకుపోయిన తప్పుడు భావాలు, ఇటీవల చేయబడిన కొన్ని ప్రకటనలలో మరొకసారి వెలుగులోకి వచ్చాయని, పూరీ శంకరాచార్య వెలిబుచ్చిన అభిప్రాయాలపై ప్రధాని తెలియజేశారు.

విదేశీ పాలకులు జరిపిన అన్యాయాలను, అవమానాలను సహించ లేనప్పుడు దేశంలో ఏ భాగంలోనైనా, ఏ రూపంలోనైనా ఏ ఒక్క పౌరుడు అవమానాలకు, అన్యాయాలకు గురికాకుండా చూడవలసిన బాధ్యత మనపై మరింతగా కలదని ఇందిరా గాంధీ అన్నారు.

లక్షలాది ప్రజల అశేషత్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యమహావృక్షం అభివృద్ధిపొందింది. ఆ మహావృక్షం యింకా పూర్తిగా పూలు పూచి, ఫలాలు కాయవలసి వుందని ఆమె అన్నారు. మనం యీ మహావృక్షాన్ని పెంచి పోషించాలనీ, దాని రక్షణకు మన జీవితాలను కూడా అర్పించడానికి సిద్ధంకావాలనీ అన్నారు.

1919 లో యిదే వైశాఖదినాన బ్రిటిష్ సామ్రాజ్యవాదుల తుపాకిగుండ్లకు వేలాది దేశభక్తులు తమ ప్రాణాలను అర్పించిన చరిత్రాత్మక గార్డెన్స్‌లోనే ప్రధానినేడు ప్రసంగించారు సభకు అనేకమంది ప్రజలు హాజరయ్యారు.

మృతవీరుల సంస్మరణ

మధ్యాహ్నం సరిగ్గా 4 గంటలకు సుమారు 30 వేలమంది ప్రజలు మృతవీరుల సంస్మరణ సందర్భంగా రెండు నిమిషాలు లేచి నిలబడి మౌనంపాటించి, శ్రద్ధాంజలిఘటించారు. సరిగ్గా అదే సమయంలో మృతవీరుల సంస్మరణార్థం ప్రచురించిన తపాలాబిళ్ళను ప్రధాని విడుదల చేశారు. "భారతమాత పుత్రుడు" అనే పేరుతో ఏర్పాటు చెయ్యబడిన ప్రదర్శనను ప్రారంభించారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు జరిపిన హత్యాకాండ నుండి బ్రతికి బయటపడ్డ ఏడుగురికి ఒక్కొక్కరికి రు. 5000 చొప్పున, ఒక్కొక్క శాలువ ప్రధాని బహూకరించారు. జలియన్ వాలాబాగ్ _ మృతవీరులకు పూలహారం వేశారు.

తెలంగాణా పై ప్రధాని ప్రకటనకు హర్షం

జమాయత్-ఇ-ఉలేమా తీర్మానం

హైదరాబాదు, ఏప్రిల్ 13

తెలంగాణా సమస్య పరిష్కారానికి ప్రధాని సూచించిన అష్ట సూత్ర కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ జమాయత్-ఇ-ఉలేమా పర్యవసభ్య సమావేశం నేడు యిక్కడ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

ప్రత్యేక తెలంగాణా, ఆ ప్రాంత ప్రయోజనాలకు అనుగుణం కాదని కార్యవర్గం చేసిన తీర్మానంలో కోరింది,

యుగోస్లావియాలో ఎన్నికలు

బెల్‌గ్రేడ్, ఏప్రిల్ 13

యుగోస్లావియా ప్రజలు నేడు దేశవ్యాపితంగా జరిగిన ఎన్నికలలో వోట్లు వేశారు.

ఉదయం 8 గంటలకు టిటో వోటు వేసి వచ్చారు.

దేశంలో మొదటిసారిగా జరిగిన ఎన్నికలలో 170 మంది అభ్యర్థులు 120 సీట్లకు పోటీచేస్తారు.

పూరీ శంకరుని, గోల్వాల్కర్ దిష్టిబొమ్మల దహనం

పూనా, ఏప్రిల్ 13

అస్పృశ్యతపైన చతుర్వర్ణాలపైన పూరీ శంకరాచార్య, ఆర్. యస్. యస్. నాయకుడు శ్రీ గోల్వాల్కర్ చేసిన ప్రకటనలను ఖండిస్తూవారి దిష్టిబొమ్మలు తగలబెట్టారు. ఎ. యస్. యస్. పి నేటి సాయంత్రం ఏర్పాటు చేసిన 'సమతమోర్చా' సందర్భంగా వారిదిష్టి బొమ్మలు తగుల బెట్టబడ్డాయి.

బెంగాల్‌లో మేడే శెలవు

కలకత్తా, ఏప్రిల్ 12

పశ్చిమబెంగాల్ ఐక్యసంఘటన ప్రభుత్వం మేడేను శెలవు దినంగా ప్రకటించింది.

మే దినంనాడు తమ సిబ్బంది పనిచెయ్యాలని ఎవరైనా షాపు యజమాని పారిశ్రామికవేత్త కోరిన పక్షంలో, వారికి 1½ రెట్లు వేతనం యివ్వాలని ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

తెలంగాణా నాయకుల ప్రకటన

ప్రధాని ప్రకటన సంతృప్తికరంగా లేదట!

హైదరాబాదు, ఏప్రిల్ 13

తెలంగాణా సమస్యపై లోక్ సభలో ప్రధాన మంత్రి ఇందిరాగాంధి చేసిన ప్రకటన తమకు ఆశాభంగం కలిగించిందని ఢిల్లీ చర్చల్లో పాల్గొని నేడు యిక్కడికి తిరిగివచ్చిన తెలంగాణా నాయకులు ప్రకటించారు.

ప్రధాని ప్రకటన తెలంగాణా పరిస్థితికి అనుగుణంగా లేదని వారు అన్నారు.

రాష్ట్ర మాజీ రెవిన్యూమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి, మాజీ కేంద్రమంత్రి డాక్టరు చెన్నారెడ్డి, తెలంగాణా ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు శ్రీ జె. చొక్కారావు. హైదరాబాదుకు రాగానే రాష్ట్ర మాజీ సమాచారశాఖమంత్రి శ్రీ కొండాలక్ష్మణ్‌తో సమావేశమై వెంటనే ఒక సంయుక్త ప్రకటన చేశారు,

ఢిల్లీ చర్చల్లో ప్రత్యేక తెలంగాణాను వ్యతిరేకించామనటం సరికాదనీ, అసలు ఈ విషయం చర్చల్లో ప్రస్తావనకే రాలేదని డాక్టరు చెన్నారెడ్డి పత్రికా విలేకరులకు సమాధానం చెప్పారు.

ప్రత్యేక తెలంగాణాను మీరు వాంఛిస్తున్నారా? అని ప్రశ్నించగా తగు సమయంలో ఈవిషయంపై అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తానని ఆయన అన్నారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటును సమర్థించే గొప్ప రాజకీయ సిద్ధాంతాలు వున్నాయని ఆయన చెప్పారు.

తెలంగాణా పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు కేంద్ర మంత్రి వర్గ ఉపసంఘం, కనీసం కేంద్ర ప్రభుత్వం ప్రతినిధి వర్గాన్ని అయినా పంపాలని తాము చేసిన సూచనను ఖాతరు చేయలేదని శ్రీ చెన్నారెడ్డి అన్నారు.

తెలంగాణా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాజకీయ, పరిపాలనా సంబంధమైన చర్యలు తీసుకోవాలనీ, శాంతి భద్రతల సమస్యగా తీసుకోగూడదని ఆయన చెప్పారు.

తెలంగాణా ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు. తెలంగాణా మిగులు నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఏ వనరుల నుండి సేకరిస్తుందో ఆశ్చర్యకరంగా వుంది దీనిపై ఆంధ్ర ప్రాంతంలో రానున్న పరిణామాలను గణనలోకి తీసుకోకుండా వుండలేము. ఈ విషయాన్ని ఢిల్లీ సమావేశంలో పరిశీలించనేలేదు అని ఆయన అన్నారు.

తెలంగాణా మిగులు నిధులను తేల్చేందుకు న్యాయ పరిశీలన అవసరం లేదని, శ్రీ కుమార్ లలిత్ నివేదిక, ప్రాంతీయ కమిటీ అభిప్రాయాలను పరిశీలించి ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావచ్చునని. యింకా తేడాలేమైనా ఉన్న పక్షంలో రాష్ట్రపతి ఉత్తర్వులో పేర్కొన్న ప్రకారం గవర్నర్‌కు నివేదించవచ్చునని ఆయన అన్నారు.

ప్రశ్న : ప్రస్తుత ప్రతిష్టంభనకు మార్గమేమిటి ?

జవాబు : రోగనివారణకు మొదట మాత్ర వాడి ప్రయత్నిద్దాం. అది నిరుపయోగమైన పక్షంలో ఇంజెక్షన్. తుది దశలో ఆపరేషన్.

ప్రశ్న : మీరు డాక్టరా? లేక సర్జనా ?

జవాబు : నేను సర్జన్‌ను. అయితే యిప్పుడు ప్రాక్టీసు చేయటంలేదు

సంజీవయ్యా రాక

మాజీ కేంద్రమంత్రి శ్రీ డి. సంజీవయ్య కాంగ్రెస్ శాసనసభ్యులు శ్రీ బి. రాజారాంతో ఢిల్లీ నుండి నేడు యిక్కడకు వచ్చారు.

విమానాశ్రయం నుండి నేరుగా సికింద్రాబాదు గాంధీ ఆసుపత్రికి వెళ్ళి సికింద్రాబాద్ పోలీసు కాల్పుల్లో గాయపడ్డవారిని పరామర్శించారు.

నగరంలోని రెండు జైళ్ళలో వున్న సత్యాగ్రహు లనుకూడా ఆయన తరువాత కలుసుకుంటారని శ్రీరాజారామ్ అన్నారు.

8 వ రోజు జనసంఘ్ ధర్నా

మహబూబ్ నగర్ జనసంఘ్ నాయకులు శ్రీ హస్నాన్ మహమ్మద్ పహిల్వాన్‌తో సహా 10 మంది జనసంఘ్ కార్యకర్తలను నేడు రాజభవన్‌వద్ద అరెస్టు చేశారు.

ప్రస్తుతంమంత్రివర్గాన్ని బర్తరఫ్ చేయాలని ధర్నాలు జరుపుతూ యింతవరకు 124 మంది జనసంఘ్ కార్యకర్తలు అరెస్టు అయినారు.

మహబూబ్‌నగర్ వద్ద బస్సుకు నిప్పు

కర్నూలు నుండి వస్తున్న ఆర్. టి. సి బస్సుకు మహబూబ్‌నగర్ సమీపంలోని కొత్తకోటవద్ద దుండగులు నిప్పంటించారు. అయితే బస్సుకు ఎక్కువనష్టం జరుగక ముందే డ్రైవరు. కండక్టరు తదితరులు రక్షించగలిగారు.

శ్రీ చంద్రశేఖర్ సవాల్

తనపై విధించబోయే క్రమశిక్షణా చర్యపై

చండీఘర్, ఏప్రిల్ 13

రాజ్యసభలో చేసిన ప్రసంగానికి కాంగ్రెస్ పార్టీ తనను మందలించడానికి వీలులేదని కాంగ్రెస్ యంగ్‌టర్క్ నాయకులు శ్రీ చంద్రశేఖర్ నేడు యిక్కడ పత్రికల వారితో అన్నారు

తనను మందలించడం సభా హక్కుల ఉల్లంఘన క్రిందికి వస్తుందని శ్రీయుతులు భూపేష్ గుప్తా. రాజ నారాయణ్ తెలిపిన విషయం సాంకేతికంగా సరిఅయిందని ఆయన అన్నారు.

తనపై చర్యతీసుకోవాలా? లేదా? అనే విషయం కాంగ్రెస్‌పార్టీ ఉమ్మడి విజ్ఞతకు సంబంధించిన విషయమని ఆయనచెప్పారు.

మందలించడమంటే శిక్షించడమేననీ, చార్జిషీటు యివ్వకుండా శిక్షించడానికి వీలు లేదని ఆయన అన్నారు.

శ్రీ మురార్జీపై వ్యక్తిగత కక్ష ఏమీ లేదనీ, పోరాటమంతా ఆర్థిక కేంద్రీకరణ పైననేనని ఆయన అన్నారు.

ఆర్థిక వ్యత్యాసాలు. సంపద కేంద్రీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీలోని ఒకవర్గం మినహా పి యస్.పి. ఎస్.ఎస్.పి. కమ్యూనిస్టు రిపబ్లికన్ తదితర ప్రగతిశీల పార్టీలు ఐక్యపోరాటం సాగించాలని ఆయన సూచించారు.

ఈ సూచననే ఒకసారి జవహర్‌లాల్ నెహ్రూ చేశారనీ. ఇంతవరకు దానిని కదపడం జరగలేదని ఆయన అన్నారు.

రాజస్థాన్‌లో నరబలి

హోం మంత్రి ధృవీకరణ

జయపూర్, ఏప్రిల్ 14

తంక్‌జిల్లా అకోరా గ్రామంలో గత సంవత్సరం మార్చి 3 వ తారీఖున నరబలి చేశారనే వార్తను రాజస్థాన్ హోం మంత్రి శ్రీ దామోదరలాల్ వ్యాస్ ధృవపరచారు. ఈ విషయం చాలావరకు నిజమని ఆయన యు. యన్. ఐ ప్రతిలేకరికి నేటి వుదయం చెప్పారు

చాముండి మాతను నరబలిచే సంతృప్తిపరచి గుప్తధనాన్ని పొందాలనే ఆశతో ముగ్గురు వ్యక్తులు బలవంతంగా ఆనే 60 సంవత్సరాల వ్యక్తిని బలియిచ్చారని స్వతంత్ర పార్టీ శాసనసభ్యుడు శ్రీ దిగ్విజయసింగ్ నిన్న తెలియజేశారు.

ఒక బిల్లు తొయియని సలహా ననుసరించి వారీ విధంగా చేశారన్నారు. ఈ ముగ్గురు వర్రంగిలి గ్రామం వెలుపలి నిర్మానుష్యం ప్రదేశానికి తీసుకువెళ్ళి గొడ్డలితో నరికారని చెప్పారు. అతను క్రిందపడినవెంటనేకత్తితో మెడనుకోసి. రక్తాన్ని ఒకసీసాలో నింపుకొన్నారని చెప్పారు

తరువాత మృతదేహాన్ని ఒక బావిలో విసిరివేసినట్లు శ్రీ సింగ్ తెలియజేశారు. రక్తాన్ని చాముండిమాత ఆలయానికి తీసుకవెళ్ళి, అక్కడ హోమగుండం ఏర్పాటుచేసి. మంటలపై చల్లారని అన్నారు. తరువాత గుప్తధనమున్న స్థలాన్ని త్రవ్వుచుండగా వారినేదో భయపెట్టిందని, అందువల్ల వారా స్థలాన్ని వదలి వెళ్ళారని శ్రీ సింగ్ తెలియజేశారు

* * *

ఆసన్‌సోల్ గనుల ప్రాంతంలో ఇరు వర్గాలమధ్య జరిగిన కొట్లాటలో 26 మంది గాయపడ్డారు.

పశ్చిమాసియాపై నాలుగు అగ్రరాజ్యాల చర్చల్లో ప్రగతి

బ్రిటిష్ విదేశాంగ మంత్రి స్టీవర్ట్ ప్రకటన

న్యూయార్క్, ఏప్రిల్ 14

పశ్చిమాసియాపై నాలుగు అగ్రరాజ్యాల మధ్య జరుగుతున్న చర్చలలో కొంత పురోగతి కనిపిస్తోందని బ్రిటిష్ విదేశాంగమంత్రి మైకేల్ స్టీవర్ట్ నిన్న యిక్కడ చెప్పారు.

పశ్చిమాసియా సమస్యపై నాలుగు అగ్రరాజ్యాలూ ఒక అంగీకారానికి రాగలిగితే, ఆ అంగీకార ప్రభావం యుద్ధంలో నిమగ్నమైయున్న ఇజ్రాయిల్, ఈజిప్టులపై పడక మానదని స్టీవర్టు అన్నారు

పశ్చిమాసియా సమస్య విషయంలో సోవియట్ యూనియన్ అరబ్బు అనుకూల ప్రచారం చేస్తున్నప్పటికీ, సంప్రతింపుల్లో వారి ధోరణి యదార్థ పరిస్థితులకు అనుగుణంగా వుందని స్టీవర్ట్ అభిప్రాయపడ్డారు.

భారత-జోర్డాన్ వాణిజ్య ఒప్పందం

అమ్మాన్, ఏప్రిల్ 14

భారత, జోర్డాన్‌దేశాల ప్రతినిధులు వాణిజ్యఒప్పందంపైనిన్న సంతకాలుచేశారు. భారతదేశం తరపున విదేశవాణిజ్య శాఖ డైరెక్టర్ శ్రీ కె. ఎస్. సింగ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. గత బుధవారం ఆయన ఇక్కడకు వచ్చారు. జోర్డాన్ తరపున విదేశ వాణిజ్య శాఖాధికారి శ్రీ ఇస్మాయిల్ సంతకం చేశారు.

సంతకాలు జరిగిన తరువాత శ్రీ సింగ్ ఆయన బృందం స్వదేశానికి బయలుదేరారు.

ఇరాక్, న్యూజిలాండ్‌లకు భారత్ రైల్వే బోగీలు

మద్రాసు, ఏప్రిల్ 14

ఇరాక్, న్యూజిలాండ్ దేశాలకు ఎయిర్ కండీషన్డ్ రైలు బోగీలను సరఫరా చేయుటకు పెరంబూరు యింటెగ్రల్ కోచ్‌ఫ్యాక్టరీ నుండి కొటేషన్లను పంపించినట్లు జనరల్ మేనేజర్ శ్రీ ఆర్. రాజగోపాలన్ నేడు పత్రికా విలేకరులకు తెలియచేశారు.

ఇరాక్‌కు 78 బోగీలను. న్యూజిలాండ్‌కు 31 బోగీలను సరఫరా చేయుటకు కొటేషన్లు పంపినట్లు ఆయన తెలియజేశారు.

45 బోగీలను సరఫరా చేయవలసిందిగా థాయ్‌లాండునుండి. 100 బోగీలను సరఫరా చేయవలసిందిగా. తైవాన్ నుండి ఆర్డర్లు వచ్చాయని ఆయన అన్నారు. బర్మా రైల్వేలకు 66 బోగీలను సప్లై చేశామని ఆయన అన్నారు ఈ ఫ్యాక్టరీలో తయారైన బోగీల ధరలు అంతర్జాతీయ మార్కెట్టులో పోటీకి నిలబడగలవన్నారు.

పాల టాంకరు చెట్టుతో ఢీ

ఫలితంగా ఒకరి మృతి

కలకత్తా ఏప్రిల్ 14

24 పరగణాల జిల్లాలోని రాజ్‌పూర్ జ్యూస్టోర్ రోడ్డుమీద రాష్ట్ర ప్రభుత్వ పాల టాంకరు చెట్టును గుద్దుకున్నందువల్ల ఒకరు మరణించారు. మరో ముగ్గురు గాయపడ్డారు.

ప్రమాదానికిముందు యీ పాల టాంకరు హరింఘాటనుండి బెల్గాచియా పాల కేంద్రానికి పాలను మోసికొనిపోతూ వుంది. గాయపడిన వారినందరినీ ఆస్పత్రిలో చేర్చారు.

న్యూజిలాండ్ ప్రభుత్వంచేత బహూకరించబడిన యీ పాలటాంకరు పూర్తిగా ధ్వంసమైంది.

పిక్నిక్ బస్సుప్రమాదం

6 గురి మృతి, 20 మందికి గాయాలు

న్యూజిలాండ్, ఏప్రిల్ 14

పిక్నిక్‌కు వెళుతున్న 34 మందితోకూడిన బస్సు నగర్వాహియా ప్రాంతం లోయలోపడి మునిగిపోయిన ఫలితంగా సుమారు 6 గురు మరణించారని, 20 మంది గాయపడ్డారని అనధికార వార్తలబట్టి తెలుస్తుంది. చాలామంది బస్సులోనే ఇరుక్కుపోయారు.

వెలికి తీసిన కొంతమందిని హామిల్టన్ ఆసుపత్రిలో చేర్చారు.

ప్రయివేటు కళాశాలల లోపాల సవరణకు ప్రత్యేక కమిటీ

హరిద్వార్, ఏప్రిల్ 14

దేశంలోని ప్రయివేటు కళాశాలల యాజమాన్య సంఘాల లోపాలను తొలగించేందుకు ఒక ఉపసంఘాన్ని నియమించడానికి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ ఉద్దేశించింది

వివిధ విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులను సంప్రదించిన మీదట కమిటీ నియామకం జరుగుతుందని కేంద్ర విద్యాశాఖమంత్రి శ్రీ వి. కె ఆర్. వి రావు నేడు పత్రికల వారికి చెప్పారు.

పంటకాలం తల్లిదండ్రులకు సహాయ పడేందుకు వీలుగా గ్రామీణ విద్యార్థులకు వేసవి సెలవలను వివిధ విద్యాసంస్థలు యిచ్చేలాగా తన మంత్రిత్వశాఖ త్వరలో నిబంధనలను ఆ యా సంస్థలకు పంపుతుందని ఆయన చెప్పారు.

ఉత్తర ప్రదేశ్. బీహారులకు విద్యానిధులు తక్కువగా కేటాయించినందుకు శ్రీ రావు తన విచారాన్ని వ్యక్తపరిచారు అక్కడ నిరక్షరాస్యత చాలా హెచ్చు ఆ లాగే స్త్రీలకు విద్యా సౌకర్యాలు అల్పంగా వున్నట్లు ఆయన చెప్పారు, అందువల్ల యిక్కడ విద్యాఅశాంతి ఎక్కువగా వుండుటలో ఆశ్చర్యపడవల్సిందేమీలేదని శ్రీ రావు చెప్పారు అంతకుముందు ఆయనకు విద్యా వాచస్పతి బిరుదు ప్రదానం జరిగింది

నర్సుల కరువుభత్యం పెంపు

పరిశీలనలో వున్నదని మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

నర్సుల కరువుభత్యాన్ని, సిటీ కంపెన్‌సేటరీ అలవెన్సును పెంచే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ కె కె షా నేడు లోక్‌సభలో తెలియజేశారు.

శ్రీ విశ్వంభరన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రీ షా పై విషయాన్ని తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమైక్యతావశ్యకత

కదిరి మునిసిపల్ కౌన్సిల్ తీర్మానం

కదిరి ఏప్రిల్ 13

ప్రత్యేక తెలంగాణా వాదం అరిష్టదాయకమని. ప్రాంతీయ అసమానతలు తొలగించాలని, రాష్ట్రసమైక్యత కాపాడబడాలని కోరుతూ కదిరి మునిసిపల్ కౌన్సిల్ తీర్మానం చేసింది

యమునా నదీముఖం అభివృద్ధికి త్రిదశ పథకం

న్యూఢిల్లీ ఏప్రిల్ 14

యమునానది ముఖద్వారం అభివృద్ధికి త్రిదశపథకాన్నొకదానిని ఢిల్లీ అభివృద్ధి సంఘం తయారుచేసిందని గృహనిర్మాణ. పట్టణ అభివృద్ధిశాఖ మంత్రి శ్రీ కె. కె. షా నేడు వ్రాతపూర్వకంగా లోక్‌సభలో చెప్పారు.

మంకీ బ్రిడ్జినుండి బస్ ఫ్యాక్టరీవరకు గల నదీ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడానికి మొదటి దశలో రు. 0.95 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేయబడినట్లు శ్రీ కె. ఎల్. గుప్తాకు మంత్రి చెప్పారు.

యీ పథకంలో చెత్తాచెదారాన్ని. ప్లాట్ ఫారాలను, తీసివేయడం, ప్రాంతాలను చదును చేయడం కరకట్టలను నిర్మించడం. మొదలగు కార్యక్రమాలు యిమిడివున్నాయి. గడ్డి జాతుల మొక్కలను, పువ్వు జాతులను, పొదలను, చెట్లను, పెంచడం, గొట్టపు బావులను త్రవ్వి ఆ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీసుకు రావడానికి ప్రయత్నాలు జరుగుతాయి. రెండు, మూడు దశలలో స్నానాల తొట్టి, రిక్రియేషనల్ ఏరియాలను అభివృద్ధి చేస్తారు.

గోదావరి లోయ కేంద్రంగా

ఆంధ్రప్రదేశ్‌తోసహా పలు రాష్ట్రాల్లో భూకంపన

జంట నగరాల్లో తీవ్ర కంపనలు; గంటసేపు విద్యుత్‌కు అంతరాయం

విజయవాడ, ఏప్రిల్ 13

నేటిరాత్రి 9 గంటల ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ అంతటాను, మహారాష్ట్ర. ఒరిస్సా. మధ్యప్రదేశ్, మైసూరు రాష్ట్రాలలోను భూకంపనలు సంభవించాయి.

భూకంపన కేంద్రం భద్రాచలం సమీపంలోని గోదావరి లోయ గావచ్చునని హైదరాబాద్ జాతీయ భూభౌతికశాస్త్ర పరిశోధనా సంస్థకుడైరెక్టర్ డా॥ హరినారాయణ చెప్పారు.

జంటనగరాలు, విజయవాడ, గుంటూరు, మంగళగిరి, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం, భీమవరం తదితర పట్టణాల్లో భూమి కంపించినట్లు మా విలేకరులు తెలియపరుస్తున్నారు.

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో, విజయవాడ, ఏలూరు పట్టణాలు, ఆ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ప్రవాహం ఆగిపోయి చీకటి ఆవరించింది.

పూనా, బొంబాయి, నాగపూర్, కటక్‌లలో కూడా భూమి కంపించింది. అయితే ఎక్కడ పెద్దనష్టాలేవీ జరిగినట్లు సమాచారం అందలేదు

బొంబాయిలోని కొలాబా పరిశోధనా కేంద్రంలో గతరాత్రి 8.58 గంటలకు భూకంపన రికార్డు చేయబడింది.

విజయవాడలో రెండుపర్యాయాలు భూమి కంపించింది. 8.45గంటలకు ఒకపర్యాయము తిరిగి 9 గంటల ప్రాంతంలో మరొక పర్యాయం భూమి కంపించింది. వేలాదిప్రజలు వీధులలోకి వచ్చారు. భవనాల తలుపులు కిటికీలు ఊగాయి.

జంటనగరాలలో గంట తరువాత విద్యుత్ సరఫరా పాక్షికంగా పునరుద్ధరించబడింది.

భద్రాచలం ప్రాంతంలో కేంద్రం

హైదరాబాదుకు తూర్పు - ఈశాన్య దిక్కుల్లో 220 కిలోమీటర్ల దూరంలో భూకంపన కేంద్రం వున్నట్లు తమ కార్యాలయంలోని భూకంపనను రికార్డుచేసే యంత్రం రికార్డు చేసిందని జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ - హైదరాబాద్ డైరెక్టరు డాక్టరు హరినారాయణ్ చెప్పారు.

రాత్రి 8 గంటల 54 నిమిషాల 53 సెకండ్లకు భూకంపన సంభవించిందని చెప్పారు. తదుపరి గంటలో మరో రెండు మార్లు స్వల్పంగా భూమి కంపించింది.

భద్రాచలం ప్రాంతంలో గోదావరి లోయలో ఏదో ఒక చోటనుండి భూకంపన సంభవించినట్లు ఆయన చెప్పారు

ఇరువురికి గాయాలు

హైదరాబాద్ నగర శివార్లలో గోడకూలిన ఫలితంగా ఇరువురు గాయపడినట్లు తెలియవచ్చింది

బెల్గాం, హుబ్లీ, షోలాపూర్ నగరాలలోకూడా భూమి కంపించింది.

మధ్యప్రదేశ్‌లోని జగదల్‌పూర్ పరిసర ప్రాంతాలలోకూడా భూమి కంపించింది

విజయవాడలో నేటిరాత్రి 8.58 గంటలకు దాదాపు ఐదు సెకండ్లపాటు భూమి తీవ్రంగా కంపించింది

ప్రజలు భయభ్రాంతులై వీధుల్లోకి పరుగెత్తుకొచ్చారు. ఈ భూకంపనవల్ల పాత భవనాల గోడలు కొన్ని బీటలువారాయి. విద్యుత్ ప్రవాహం దాదాపు 10 నిమిషాలపాటు నిలిచిపోయింది. రోడ్లమీద వాహనాలన్నీ అర్థంతరంగా నిలిచిపోయాయి.

విశాలాంధ్ర దినపత్రిక కార్యాలయంలోని బల్లలు, కుర్చీలు, గోడలు, పై కప్పులతో సహా కంపించి పోయాయి

భూకంపం వివరాలను తెలుసుకునేందుకు మా కార్యాలయానికి ప్రజలు ధారావాహింగా వచ్చారు.

కొన్నిచోట్ల గోడగడియారాలు ఆగిపోయాయి. ఎలక్ట్రిక్ బెల్స్ భూమి కంపించినంత సేపూ నిరంతరంగా మోగాయి.

ఈ భూకంపంవల్ల ఆస్తి. ప్రాణనష్టం జరిగినట్లు వార్తలు అందలేదు.

భూమి కంపించినంతసేపు [illegible] అరుపులు వినవచ్చాయి.

జంటనగరాల్లో భూకంప తీవ్రత

దాదాపు రాత్రి తొమ్మిది గంటల సమయంలో జంటనగరాల్లో 45 సెకండ్లపాటు భూమి కంపించింది.

విద్యుత్ దీపాల మహాసముద్రంగావున్న రెండు పట్టణాలు చీకటి మయమైపోయాయి

జంటనగరాల్లో భూమి యింత తీవ్రంగా ఎన్నడూ కంపించలేదని భూభౌతిక పరిశోధనాసంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ యస్. బాలకృష్ణ అన్నారు విద్యుత్ సరఫరా గంటసేపు ఆగిపోయింది

ఈ భూకంపనకు కేంద్ర స్థానమేదో రేపువరకు చెప్పటం సాధ్యపడదని నిజామియా అబ్జర్వేటరీ ప్రతినిధి ఒకరు చెప్పారు

కొలాబా కేంద్రం రికార్డు

బొంబాయికి 800 కిలోమీటర్ల దూరంలో ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడో ఒకచోట భూప్రకంపన కేంద్రం వున్నదని కొలాబా కేంద్రం రికార్డు చేసింది

సూరత్, బొంబాయి, పూనా, కొల్హాపూర్, నాగపూర్, బెంగుళూరు తదితర దక్షిణ భారత ద్వీపకల్పంలోని పట్టణాల్లో భూమి కంపించిందని వార్తలు తెలుపుతున్నాయి.

'విశాలాంధ్ర విలేకరి' ప్రత్యక్ష కథనం

విజయవాడలో నేటిరాత్రి భారత కాలమాన ప్రకారం 8 గంటల 59 నిమిషాలకు వెంట వెంటనే రెండుసార్లు భూమి కంపించటంతో విజయవాడ పట్టణ ప్రజలంతా భయాందోళనలతో కొన్ని నిమిషాలపాటు గందరగోళపడ్డారు.

మొదట విద్యుత్‌లైట్లు కాంతి తగ్గింది. అలా ఒక నిమిషంపాటు ఉన్నాక మొదటిసారి దాదాపు 1½ సెకన్లు భూమి కంపించింది. విద్యుత్ ప్రసారం ఆగిపోయి విజయవాడ అంతటా చీకటి అలముకొంది.

నిమిషంపాటు చీకటి-[illegible] కొద్దిపాటి [illegible], ఆ తరువాత ఒక సెకన్‌పాటు తిరిగి కొద్దిపాటి ప్రకంపనం జరిగింది. అయిదు నిమిషాల తరువాత విద్యుత్ వచ్చింది.

విజయవాడలో రెండు సంవత్సరాలక్రితం ఒకసారి భూమి కొద్దిపాటి కంపించిన అనంతరం తిరిగి ఈ మధ్య కాలంలో ఇట్టిది సంభవించలేదని చెబుతున్నారు.

నేడు ప్రకంపన జరిగినపుడు భూమిమీద కూర్చున్నవారికి ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లు అనిపించింది

పట్టణంలో నేడు ఆదివారం అవటంవల్ల బజార్లో దుకాణాలన్నిటికి సెలవు.

అయినా క్రిక్కిరిసిన ప్రేక్షకులతో మొదట ఆటజరుగుతున్న పట్టణంలోని సినిమాహాలులు అన్నిటిలోను పెద్ద యెత్తున గందరగోళం బయల్దేరింది. పిల్లలు ఏడ్పులు ప్రారంభించారు. ప్రేక్షకులు రోడ్లపైకి వచ్చివేశారు.

రైస్ అండ్ ఆయిల్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో కన్యాశుల్కం నాటక ప్రదర్శన జరుగుతుండగా భూమి కంపించింది ప్రేక్షకులంతా బయటకు వచ్చేశారు అయితే ప్రశాంతంగా వచ్చి వేయటంవల్ల తోపులాట లేనందున ఎట్టి అవాంఛనీయ పరిస్థితులు జరుగలేదు

ప్రక్కనే ఫిల్మ్‌ఛాంబర్‌లో ఒక విదేశస్తుని గౌరవార్థం సభ జరిగిన అనంతరం నృత్య ప్రదర్శన జరుగుతుండగా భూమి ప్రకంపించింది. అక్కడకూడా అందరూ బయటకు వచ్చి వేశారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నాటకం మధ్యలో కూడా ఇలాగే జరిగింది

అయితే తిరిగి కొద్ది నిముషాలలోనే అంటే 9 గంటల 10 నిముషాలకల్లా తిరిగి అన్ని కార్యక్రమాలూ, సినిమా ప్రదర్శన పునరుద్ధరింప బడింది

ఎవరినోట విన్నా భూకంపనం గురించే చెప్పుకుంటున్నారు. అయితే ఈ ప్రకంపనం క్రింద అంతస్తులో ఉన్నవారి కంటే మేడలలో పై అంతస్తులలో ఉన్న వారిని ఎక్కువగా ఊపివేసింది విద్యుత్ ప్రసారం ఆగిపోవటంవల్ల [illegible] ఆగినా తిరిగి ప్రసారం ప్రారంభం కాగానే ఎట్టి ఆటంకంలేకుండా పనిచేశాయి

ఇటీవల నవరాత్రుల సందర్భంగా కట్టిన పందిరిలుకూడా ఈ ప్రకంపనంవల్ల దెబ్బతిన లేదు

ఒక పోలీస్ కానిస్టేబుల్ విశాలాంధ్ర విలేకరితో మాటాడుతూ అసలు భూకంపనం జరిగినట్లే తన కనిపించ లేదని ఆశ్చర్యం ప్రకటించారు.

పట్టణంలో ఎట్టి అవాంఛనీయ ఘటనలు జరిగినట్లు సమాచారం అందలేదని పోలీసు వర్గాలు తెలియ పరిచాయి

ముస్తాబాదలో

విజయవాడ సమీపానగల ముస్తాబాదలో కొండమీదనుండి క్రిందకు రాళ్ళు జారాయని అక్కడి నుండి అందిన వార్తలు తెలిపాయి.

1970 నుండి సిమెంటుపై కంట్రోల్ రద్దు: లోక్‌సభలో పరిశ్రమల మంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

1970 జనవరి ఒకటవ తేదీనుంచి సిమెంట్ ధరలపై, పంపిణీపైవున్న అన్ని కంట్రోళ్ళను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ విషయాన్ని కేంద్ర పరిశ్రమలమంత్రి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ నేడు లోక్‌సభలో వెల్లడించారు.

సిమెంటుపై సుంకాలను వసూలు చేయడంకూడా ఆ తేదీనుండి రద్దుచేయడం జరుగుతుందని. శ్రీ అలీ అహమ్మద్ పేర్కొన్నారు.

సిమెంటు సరఫరా పరిస్థితి గతంతోపోల్చి చూస్తే మెరుగుగా వున్న దృష్ట్యా కంట్రోళ్ళను తొలగించాలన్న నిర్ణయం చేయడం జరిగిందన్నారు.

సిమెంట్ పరిశ్రమలతో చర్చలుజరిపిన అనంతరం ఈ నెల 16 వ తేదీనుంచి టన్ను సిమెంటుధర రు. 100లకు నిర్ణయించబడటం జరిగిందని శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహమ్మద్ లోక్‌సభలో తెలియచేశారు.

అస్సాం, తిరువాన్కూర్ సిమెంటు ఫ్యాక్టరీల విషయంలో ధరలు విడిగా నిర్ణయించబడతాయి.

సిమెంటుపై గరిష్టధర ఈ సంవత్సరం డిసెంబరు 31 వ తేదీ వరకు మాత్రమే అమలులో వుంటుందన్నారు.

1970 జనవరి నుంచి సిమెంట్ ధరపై. పంపిణీపై కంట్రోళ్ళు తొలగించటంవల్ల కొరత ప్రాంతాలలో ఉత్పత్తి చేయడానికి సిమెంటు పరిశ్రమకు అవకాశం లభిస్తుందన్నారు.



ఎక్కడ లైఫ్‌బాయ్ వున్నదో అక్కడ ఆరోగ్యము వున్నది

లైఫ్‌బాయ్‌తో స్నానము మీకు అత్యంత ఆరోగ్యమైన హాయి గొలుపుతుంది, లైఫ్‌బాయ్‌లో ఉత్తమమైన సబ్బులో వుండ వలసిన అన్ని గుణములే గాక ఇంకా ఎన్నియో వున్నవని మీరు తెలిసికొందురు.

లైఫ్‌బాయ్ మురికిలోగల క్రిములను కడిగి వేస్తుంది

హిందుస్తాన్ లీవర్ ఉత్పత్తి

సాంఘిక సంక్షేమ సాధనే మా లక్ష్యం

శ్రీ అజయ్‌ముఖర్జీ రేడియో ప్రసంగం

కలకత్తా, ఏప్రిల్ 14

అన్నివర్గాల ప్రజలకు సేవజేయడమే ఐక్యసంఘటన ప్రభుత్వ లక్ష్యమనీ, ప్రగతిశీల ప్రజాతంత్ర పాలనద్వారా సాంఘిక సంక్షేమం కలిగించడానికి ప్రభుత్వ విశాల దృక్పథంతో, విశాల హృదయంతో పనిచేస్తుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ అజయ్‌ముఖర్జీ నేడు అన్నారు.

బెంగాల్ నూతన సంవత్సరం సందర్భంగా కలకత్తా ఆకాశవాణి కేంద్రంనుండి ఆయన ప్రసంగించారు. ఇది మొదటి రేడియో ప్రసంగం.

అన్ని రంగాలలోనూ ప్రగతి సాధించడానికి వీలుగా అనిచోట్ల శాంతి భద్రతలు నెలకొల్పాల్సిన అవసరం వుందని అన్నారు.

ఆయన యింకా యిలా అన్నారు.

విశాల దృక్పథం విశాల హృదయంతో మనం పని ప్రారంభించాము. ప్రగతిశీల, ఆరోగ్యకర ప్రజాతంత్ర పరిపాలన ద్వారా సాంఘిక సంక్షేమం సాధించడమే మన ఏకైక లక్ష్యం.

మనం పయనించేమార్గం ఎంత క్లిష్టతరమైనదైనా. దూరదూరమైనదైనా కావచ్చు. అయితే మనం కృత నిశ్చయంగా ముందుకుపోవాలి. మీసాయం మార్గ నిర్దేశం ఉత్తేజం మాత్రమే మాపెన్నిధి. అనేక సమస్యలతో సతమతమవుతున్న పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రంలో పక్షంలోనే అనేక పెద్ద మార్పులు తీసుకరావడం సాధ్యంకాదు. ఈ రాష్ట్రంలోని వివిధ పరిపాలనా రంగాలు మెరుగుపడాలి. ఈకర్తవ్యసాధనకు డబ్బు. వ్యవధి కావాలి. మనకు పెద్ద పెద్ద మొత్తాలులేవు అలాంటి అభివృద్ధి సాధించాలంటే ఈ వనరులు అవసరం కదా! కేంద్రం నుండి తగినంత సాయం లేకుండా ఇతోధికంగా పురోగతి సాధించడం సాధ్యం కాదు.

కేంద్ర సాయం

పశ్చిమ బెంగాల్ భవిష్యత్తు పురోగమ చాలావరకు కేంద్రం అందించే ఆర్థిక సాయంమీద చతుర్థప్రణాళిక జయప్రదంగా అమలు పరచడంమీద ఆధారపడివుంది

నిరుద్యోగం

పశ్చిమబెంగాల్ ఫ్యాక్టరీలలో విస్తృతంగా వున్న నిరుద్యోగాన్ని ప్రస్తావిస్తూ ఆయన అధికంగా మిల్లులు నిర్మించడమే గాకుండా గ్రామీణ ప్రాంతాలలో మధ్యరక, లఘు, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలని అన్నారు.

అధికంగా ఉత్పత్తి సాగించడానికి పారిశ్రామిక శాంతిఅవసరం అని చెప్పారు. యజమాని ఉద్యోగిమధ్య పరస్పర అవగాహన వుండే పారిశ్రామికశాంతి యెలాంటి ప్రమాదం వుండదని అన్నారు.

కార్మికులను సంతృప్తి పరచాలన్న విషయం యజమానులు గుర్తించవలసిన సమయం ఆసన్నమైందని అన్నారు.

అధికంగా ఉత్పత్తి చేయకపోతే కష్టించి పనిచేయకపోతే దేశం తన అవసరాలను తీర్చలేదన్న విషయం కార్మికులు గమనించాలని అన్నారు

ఆర్థిక రంగం

ఆర్థిక రంగానికి సంబంధించి అభివృద్ధి లేని ప్రాంతాలు క్రమేణా పారిశ్రామికవంతం చేయాలని ఐక్యసంఘటన ప్రభుత్వం అనుకొంటున్నదనీ యిలాచేస్తే సమానత అన్న సూత్రం అన్ని ప్రాంతాలకు వర్తించుతుందని అన్నారు.

పారిశ్రామిక హక్కులు. న్యాయమైన కోర్కెలపట్ల యెలాంటి ద్వేషభావం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సేవ చేయాలని ఐక్య సంఘటన ప్రభుత్వం లక్ష్యమని అన్నారు.

ఈ లక్ష్య సాధనకే ఐక్య సంఘటన 32 అంశాల కార్యక్రమం తయారు చేసిందని అన్నారు.

మృతవీరులకు జోహార్లు

1967 లో ఐక్య సంఘటన ప్రభుత్వం బర్తరఫ్ చేసినందుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో అసువులు అర్పించినవారికి మంత్రివర్గం తరపున జోహార్లు అర్పించారు.

ఐక్యసంఘటన ప్రభుత్వం తనకున్న పరిమిత వనరులతో ప్రజల యిబ్బందులను తీర్చడానికి శాయశక్తులా కృషి చేస్తుందని అన్నారు. ప్రజలు తనపై వుంచిన గొప్ప బాధ్యతను నిర్వర్తిస్తుందని అన్నారు.

బెంగాల్ వెనుకబాటు

పశ్చిమ బెంగాల్, అన్ని రంగాలలో వెనుకబడివున్నది. ఆహారం, బట్టలు గృహవసతులు వినిమయ వస్తువుల సరఫరా వైద్యవిద్యా సౌకర్యాలు గూడా ప్రజల అవసరాలకు చాలా తక్కువగా వున్నాయి

ఆహారంలో స్వయం సమృద్ధి సాధనకు ప్రభుత్వం ఇర్రిగేషన్. అధిక దిగుబడి విత్తనాలు నాణ్యమైన ఎరువులు సరఫరా చేయుటానికి విస్తృతమైన చర్యలు తీసుకొంటుంది.

భూమి కౌలుపద్ధతిలోగూడా పెద్దమార్పులు జరుగుతాయి. సహకార సంస్థలలో అవినీతి నిర్మూలన జరగాలి. సహకార సంఘాలను ప్రోత్సహించడానికి వాటిలో చేరాలి.

కాందిశీకులు

తూర్పు పాకిస్తాన్ కాందిశీకుల సమస్యను ప్రస్తావిస్తూ ఆయన అనేక మంది కాందిశీకులు దుర్భర పరిస్థితిలో వున్నారనీ వారి పునరావాసానికి సంబంధించి కేంద్రంతో పరిష్కారానికి రాష్ట్రప్రభుత్వం ప్రయత్నించుతుందని అన్నారు.

వ్యవసాయదారులు కార్మికులు. ఉద్యోగులు ఉపాధ్యాయులు మధ్యతరగతి ప్రజలతోసహా అన్నివర్గాల ప్రజలకున్న సమస్యలు ప్రభుత్వానికి తెలుసుననీ అనుకున్నప్రకారం వారి సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు.

ఈ సమస్యలకు పరిష్కార మార్గం అంత తేలికైనది కాదు. ఓర్పు వహించి మాకు సహకారం యివ్వవలసినదిగా మీకు విజ్ఞప్తి చేస్తున్నాను" అని అన్నారు.

షెడ్యూల్డు జాతుల కులాల వెనుకబడిన జాతుల, గిరిజనుల సమస్యలు తమకు తెలుసుననీ అన్నివర్గాల ప్రజల సర్వతోముఖ అభివృద్ధి సాధించడమే మా ప్రాథమిక లక్ష్యం" అని అన్నారు.

గేదెలు దొరికినవి

2 గేదెలు, ఎర్రగేదె మాశిగేదె 10 వ తేదీన దొరికినవి. స్వంతవారులు వచ్చి తోలుకొని వెళ్ళవచ్చును.

భీమిరెడ్డి రామిరెడ్డి
తేలప్రోలు. గన్నవరం తా॥
కృష్ణాజిల్లా.

Free Free Free
WHITE PATECHES

మా అనుభవసిద్ధమైన ఆయుర్వేదఔషధం డాక్టర్లు తేలికగా తెల్లమచ్చలను పోగొట్టును. దాని శక్తిని ఒక వారం లోపునసే చూపును. చర్మం స్వాభావికరూపం పొందును. రోగులస్థితి పూర్తిగా తెలపండి ప్రచారము కొరకు పైపూత మందు సీసా ఒకటి ఉచితంగా 1000 మందికి పంపెదము.

ManagerRAM PHARMACY 3
P O. Katri Sarai (Gaya).

జిల్లా కలెక్టరువారి కార్యాలయము, కృష్ణాజిల్లా, చిలకలపూడి

R. C. C3 5052 / M / 68

వేలము నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయుట యేమనగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారు స్వాధీనపరచుకొన్నటువంటిన్నీ దఖలుపరచుకో బడినటువంటిన్నీ ఈ క్రింది నమోదుకాబడిన వివరములు గల తుపాకులు. పిస్టళ్లు, రివాల్వర్లు 12-5-'69 వ తేదీ ఉదయము 11 గం॥లకు చిలకలపూడి కృష్ణాజిల్లా కలెక్టరువారి కచేరిలో అడిషనల్ జిల్లా మేజిస్ట్రేటువారిచే ఈ క్రింది షరతులకు లోబడి బహిరంగముగా వేలం వేయబడును. పాట షరతులు పాట కాలములో తెలియపర్చబడును.

1.	యస్. బి యమ్. యల్. తుపాకులు		—	37
2.	డి. బి. యమ్. యల్.	•	—	4
3.	యస్. బి. బి. యల్	••	—	10
4	డి. బి. బి యల్.	••	—	9
5.	యన్. పి. బోరు రివాల్వర్లు		—	4
6	యన్. పి. బోరు పిస్టల్స్		—	5
7.	డి. బి బి. యల్. రైఫిల్స్		—	1
8.	మేచ్‌లాక్ గన్సు		—	10
9.	రివాల్వరు తూటాలు		—	38

వేలము పాట యొక్క షరతులు

1. భారతదేశము ఆయుధ చట్టము మేరకు ఆయుధములు ఉంచుకొనుటకుగాని. అమ్ముటకు వి అమలులోవున్న లైసెన్సుదారులు మాత్రమే వేలములో పాల్గొనుటకు అంగీకరింపబడుదురు.
2. వేలముపాటలో పాల్గొనదలచినవారు వారి యొక్క లైసెన్సును జూపి. కోరిన ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలయును.
3. హెచ్చు పాటదారు పాట పూర్తి అయిన వెంటనే పాట మొత్తం చెల్లించవలయును
4. అవసరమైన యెడల వేలము వేరే దినమునకు వాయిదా వేయబడును.

ఇట్లు
(సం.) రాజా రామ్ కరన్,
అడిషనల్ జిల్లా మేజిస్ట్రేటు,
కృష్ణాజిల్లా, చిలకలపూడి.

బెంగాల్ బంద్‌పై శ్రీ రంగా అక్కసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14

బెంగాల్‌బంద్‌పై చర్చలు జరిపే నిమిత్తం జాతీయ ప్రజాతంత్ర పార్టీలను ఆహ్వానించవలసిందిగా ప్రతిపక్ష నాయకులు శ్రీయుతులు శ్రీ ఎన్ జి రంగా (స్వతంత్ర) కన్వర్ లాల్ గుప్తా (జనసంఘ్). ప్రకాష్‌వీర్‌శాస్త్రి (బి. కె డి) హోంమంత్రి శ్రీ చావన్‌కు విజ్ఞప్తి చేశారు.

శ్రీ చావన్‌కు రాసిన లేఖలో బెంగాల్ బంద్‌ను ఖండించారు.

దేశంలో శాంతి భద్రతలు. రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కేంద్రంధైర్యంతో చర్యలు తీసుకోవాలని ప్రధానికి రాసిన ప్రత్యేక లేఖలో శ్రీ రంగా పేర్కొన్నారు.

బెంగాల్ బంద్‌రోజున బెంగాల్‌లోని కేంద్రప్రభుత్వ కార్యాలయాలలో, సంస్థలలో పనిసాగడానికి వీలుగా ఎటువంటి చర్యలు తీసుకొనందుకు వెంటనే కేంద్ర హోమ్ మంత్రి శ్రీ వై. బి. చావన్ రాజీనామా చేయాలని జనసంఘ్ అధ్యక్షులు శ్రీ అటల్ బిహారీ వాజ్‌పాయ్ నిన్న మధురైలో పేర్కొన్నారు.

కేంద్రప్రభుత్వోద్యోగులను అరెస్టు చేసి. బేడీలు తొడిగి ప్రజలముందు నడిపించడం దారుణమన్నారు.

ప్రస్తుత పరిస్థితిపై ముఖ్యమంత్రి శ్రీ అజయ్‌ముఖర్జీ ఒక మాటకూడా చెప్పకపోవడం

బైఫర్‌కేటెడ్ కోర్సుల అమలుకు అభ్యర్థన

విజయవాడ, ఏప్రిల్ 13

ఏప్రిల్ 12 వ తేదీ సాయంత్రం 2 గంటలకు ఆంధ్రప్రదేశ్ బైఫర్ కేటెడ్‌కోర్సుల స్టాఫ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశము శ్రీ పి. రామచంద్రరావుగారి అధ్యక్షతన జరిగినది. సమావేశంలో వివిధ జిల్లాలనుండి 400 మంది ప్రతినిధులు హాజరైనారు.

సంఘాధ్యక్షులు శ్రీ పి. రామచంద్రరావు. కార్యదర్శి శ్రీ ఎస్. ఎస్. కృష్ణమూర్తి. ఉపాధ్యాయ ప్రతినిధులైన శ్రీ డి. సుబ్రమణ్యం శ్రీ కొల్లూరు కోటేశ్వరరావు ఎం. ఎల్. సి. గార్ల ఆధ్వర్యాన విద్యామంత్రి, విద్యాశాఖ డైరెక్టరుగార్లతో జరిపిన సంప్రదింపులను సమావేశమునకు వివరించారు.

డా॥ కొఠారి కమిషన్ సిఫార్సుల ననుసరించి, వర్కు ఎక్స్‌పీరియన్స్ వృత్తి విద్యా సంస్థలను స్థాపించుట, గ్రేడ్ స్కూళ్ళను ప్రారంభించుట మొదలగు ప్రత్యామ్నాయ పథకములను రూపొందించడమే. 56 పాఠశాలలలో బోధించబడుచున్న కోర్సులను రద్దుచేయ తలపెట్టిన ప్రభుత్వ సంకల్పమును ఈ సమావేశం తీవ్రంగా ఖండిస్తుంది.

1969 జూన్ నుండి ఆంధ్రరాష్ట్రంలోని హయ్యర్ సెకండరీ పాఠశాలలుగా మారనున్నప్పటికి ప్రస్తుతము 56 హైయ్యర్ సెకండరీ మల్టీపర్పస్ పాఠశాలలయందు నిర్వహించబడుచున్న డైవర్సిఫైడ్ కోర్సులను కొనసాగించకుండా నిలుపుదల చేయు ప్రభుత్వ విధానమును యీ సమావేశము ఖండిస్తూ తీర్మానించింది.

ప్రస్తుతము 10 పాఠశాలలోవున్న యీ విధానమును అదేరకంగా సెకండరీ పాఠశాలలుగా మార్చబడుతున్న 56 పాఠశాలలో అదే విధానాన్ని ప్రవేశపెట్టకపోవడాన్ని సమావేశం గర్హించింది.

ప్రభుత్వము యొక్క యీ రెండు నాల్కల వైఖరివల్ల విద్యార్థులలోను, వారి తల్లిదండ్రులలోను సందేహాలను రేకెత్తించుతుంది. అంతేగాక యీ పాఠశాలలలో పని చేయుచున్న 400 మంది సిబ్బంది జీవనోపాధికి పెద్ద గొడ్డలిపెట్టుగా తయారైంది.

ఈ 56 పాఠశాలలలో కూడా మిగతా పాఠశాలల మాదిరిగా కోర్సులను ప్రవేశ పెట్టడానికి అనుమతించుతూ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా ప్రకటన చేయాలని సమావేశం కోరుతోంది. యీ వైఖరిని ప్రభుత్వం తీసికునే లాగు సంతకాల ఉద్యమాన్ని నడపాలని. అప్పటికీ ప్రభుత్వం అంగీకరించకపోతే పరిస్థితుల కనుగుణమైన చర్యలు తీసుకోవడానికి కార్యవర్గానికి అధికారమిస్తూ తీర్మానించింది.

సిబ్బందిని నిరుద్యోగంనుండిరక్షించుటకు తగిన పరిష్కార మార్గాన్ని అన్వేషించేందుకు విద్యా శాఖ మంత్రి అధ్యక్షతన, విద్యా శాఖ డైరెక్టర్. సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ వాణిజ్య పరిశ్రమల డైరెక్టర్, విద్యా శాఖ ఆర్థిక శాఖ కార్యదర్శులు యీ సంఘ సభ్యులతో కూడిన ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించడ మైనది.

రేడియో

బుధవారం ఏప్రిల్ 16
శక 1891 ★ చైత్ర 26

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం: 6.00 వందేమాతరం, ప్రసార విశేషాలు; 6.10 భక్తిరంజని: ప్రయాగ రంగాదాస్ కీర్తనలు: 6.40 అం.వా; 6.45 సూక్తిముక్తావళి; 6.50 పొలం పనులు; 7.00 తె. వా; 7.15 హై. వలె; 7.45 హిందీ పాఠము; 8.00 హిం. వా; 8.15 అం. వా; 8.30 హై. వలె; 9.00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12.30 కార్మికుల కార్యక్రమం; 1.00 మహిళా సమాజం: స్త్రీల కార్యక్రమము; 1.30 అం.వా; 1.40 పసిడి పంటలు, 1.50 తె. వా; 2.00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సాయంత్రం. 5 30 ఎస్. సి. జగన్నాథాచార్యులు; 5.55 స్థానిక ప్రకటనలు; 6.00 అం. వా; 6.05 ప్రాం. వా; 6.15 వాద్య బృందం; 6.30 మధువన్: హిందీ కార్యక్రమం; 6.45 వెలుగుబాట: 7.00 తె వా; 7.15 పంటసీమలు; 7.45 నాటక హై రిలే; 8.15 చిత్రతరంగిణి: 8.35 ఈరోజు పార్లమెంటులో; 8.45 హిం. వా; 9.00 అం. వా; 9.15 రాగప్రస్తార; 9.30 జాతీయ కార్యక్రమము; ఢి. రిలే; 9.45 లలిత సంగీతం; 10.30 అం. వా; 10.35 జన గణ మన - ప్రసార సమాప్తి

హైదరాబాద్ (ఎ)

405.4 మీ. (740 కిలో సై.)
62.50 మీ (4800 కిలో సై)

ఉదయం: 6.30 వందేమాతరం, 6.35 భక్తిరంజని: 7.00 తె. వా; 7.15 ఎస్. ఎస్. శ్రీనివాసన్ - వేణువు: 7.45 సంకీర్తనం: 7.55 సూక్తిముక్తావళి; 8.00 హిం. వా; 8.15 అం.వా; 8.30 డి. సరోజ. 9.00 వాతావరణ సూచన, ప్రసారసమాప్తి.

మధ్యాహ్నం: 12.30 కార్మికుల కార్యక్రమము; 1.00 మహిళాసమాజం: 1.30 అం. వా; 1.40 చిత్రసీమ; 1.50 తె. వా; 2.00 వాతావరణసూచన, ప్రసార సమాప్తి

సాయంత్రం: 5.55 ప్రసార విశేషాలు: 6.00 అం.వా; 6.05 ప్రాం. వా; 6.15 ఉర్దూలో కార్యక్రమం: (హైదరాబాద్ కడపలు మాత్రమే), 6.25 వ్యవసాయదారులకు; 6.30 గ్రామసీమలు, 7.00 తె. వా; 7.15 వెలుగుబాట; 7.30 చిత్రసీమ; 7.45 నూటపదహారు-నాటిక. 8.15 డి. సరోజ; 8.45 భారత సంస్కృతి - ఆంధ్రుల స్త్ర విజయనగర రాజులు: 8.45 హిం: వా: (కడప: విశాఖపట్టణాలు మాత్రం): 9.00 అ వా: 9.15 నడుస్తున్న చరిత్రం; 9.30 జాతీయ కార్యక్రమం; 9.45 లలితసంగీతం; 10.00 ఎస్. ఎస్. శ్రీనివాసన్ - వేణువు; 10.30 అం. వా; 10.35 వాతావరణసూచన-జన గణ మన - ప్రసార సమాప్తి.

కడప

333.3 మీ. (900 కిలో సై.)
సా॥ 5.55 నుండి రాత్రి 10.35 వరకు
శనివారములు మాత్రము
సా॥ 5.55 నుండి రాత్రి 11.05 వరకు

విశాఖపట్నం

322 6 మీ. (930 కిలో సై.)
సా॥5.55 నుండి రాత్రి 10.35 వరకు

హైదరాబాద్ (బి)

283 మీ. (1060 కిలో సై.)

ఉదయం: 6.30 వందేమాతరం; 6.40 అం. వా: 6.45 సుగం సంగీత్; 7.00 జోత్స్నా పాధ్యే - ఖయాల్: 7.30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 2.00 చిత్రపట్ సే; 2.10 ఉ. వా: 2 20 సుగం సంగీత్; 2.30 జ్యోత్స్నా పాధ్యే - ఖయాల్; 2.50 సుగం సంగీత్, 3.00 ప్రసార సమాప్తి.

రాత్రి: 8.00 కన్నడ కార్యక్రమం; 8.30 విరామ సంగీతం; 8.35 ఈరోజు పార్లమెంటులో; 8 45 హిం. వా: 9.00 చిత్రపట్ సే: 9 15 ఉ. వా: 9.30 ఉర్దూలో కార్యక్రమం: 10.00 గురుగోవింద్ సింగ్ రూపకం (హిందీ). 10.30 జన గణమన - ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

211.3 మీ. (1420 కిలో సై.)

ఉదయం: 6.55 వందేమాతరం, మంగళ ధ్వని: 7.00 తె. వా: 7.15 సంగీతమంజరి పితుకుళి మురుగదాస్. 7 30 పామాలై - రాధ, జయలక్ష్మి; 8.00 హిం. వా: 8.15 అం. వా: 8.30 ప్రసార సమాప్తి.

(211.3 (మీ 1420 కి. సై)

మధ్యాహ్నం: 1.00 పాశ్చాత్యసంగీతం; 1.30 అం వా; 1.40 వాద్యగోష్ఠి; 1.50 తె వా: 2.00 ప్రసార సమాప్తి.

211.3 మీ (1420 కిలో సై.)

సాయంత్రం: 5.30 పాశ్చాత్యసంగీతం; 6.00 అం.వా; 6.05 ప్రాంతీయ శెయిదిగళ్; 6.30 కుండలకేశి: నాటిక; 7.00 తె. వా; 7.15 ఉషాసాగర్. 8 00 చిత్రగానం: 8.15 సంగీతమంజరి. 8.30 విరామసంగీతం; 8.35 ఈరోజు పార్లమెంటులో; 8 45 హిం. వా 9.00 అం వా. 9.15 ఢిల్లీ నుండి రిలే. 9.30 జాతీయ కార్యక్రమము ఢి. రిలే: 9.45 10.00 పాశ్చాత్యసంగీతం; 10.30 అం. వా; 10.35 వాతావరణ సూచన, జన గణ మన. ప్రసార సమాప్తి

నిరుద్యోగ వ్యతిరేక నిరాహార దీక్షలు

జయప్రదం చేయవలసినదిగా విద్యార్థి నాయకుడు శ్రీ వర్మ విజ్ఞప్తి

(విశాలాంధ్ర విలేకరి)

ఏలూరు, ఏప్రిల్ 14

ఆంధ్రప్రదేశ్ విద్యార్థి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ డి వి. వి. ఎస్. వర్మ ఒక పత్రికా ప్రకటనలో ఇలా తెలియజేస్తున్నారు.

అఖిల భారత విద్యార్థి యువజనసంఘాల ఆధ్వర్యాన జరుగుతున్న నిరుద్యోగ యాత్రా దళం ఒకటి కేరళనుండి బయలుదేరి మద్రాస్ పర్యటన ముగించుకొని ఏప్రిల్ 16 వ తేదీన నెల్లూరు చేరుకొంటుంది. ఈ దళం ఆంధ్రప్రదేశ్‌లో 10 రోజులపాటు పర్యటన జరుపుతుంది ఈ నిరుద్యోగ యాత్రా దళంలో కేరళ, మద్రాసు, ఆంధ్రప్రదేశ్ విద్యార్థి యువజన నాయకులు పాల్గొంటారు.

ఆంధ్రలో పర్యటన వివరాలు:

ఏప్రియల్ 16-17 తేదీలు నెల్లూరుజిల్లా, 17-18 తేదీలు గుంటూరుజిల్లా, 19, 20, 21 దీలు కృష్ణాజిల్లా 22, 23, 24 తేదీలు పశ్చిమగోదావరిజిల్లా

పై జిల్లాల్లో పర్యటన ముగించుకొని యీ దళం మధ్యప్రదేశ్ మీదుగా ఢిల్లీ చేరుతుంది.

మే 13, 14 తేదీల్లో అక్కడ జరుగు నిరాహారదీక్ష కార్యక్రమంలో పాల్గొంటుంది.

ప్రస్తుతం దేశవ్యాపితంగా నిరుద్యోగ సమస్య విద్యార్థి యువజనుల ఆందోళనకు మూలకారణంగా పరిణమించింది. వారి భవిష్యత్తో చెలగాటమాడుతున్న ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టేందుకు అఖిల భారత స్థాయిలో జరుగుతున్న ఈ తొలిపోరాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుటకు పూనుకోవాలి.

మే 13. 14 తేదీలలో పార్లమెంటుముందు జరుగబోవు సత్యాగ్రహానికి మద్దతుగా దేశంలోని జిల్లా కేంద్రాలన్నింటా జరగబోయే నిరాహారదీక్షల ప్రాధాన్యతను, వివరిస్తూ ఆ కార్యక్రమాని విజయవంతం జేయాలని ఉజ్జ్వల భవిష్యత్తుకుసాగే ఈ ఉద్యమంలో హెచ్చు సంఖ్యలో విద్యార్థి యువజనులు పాల్గొనవలసిందిగా విజ్ఞప్తిచేశారు (వి. వి.)

ఉత్తరప్రదేశ్‌లో చక్కెర మిల్లుల దుస్థితి

లక్నో, ఏప్రిల్ 13

ఉత్తరప్రదేశ్‌లో 71 చక్కెర మిల్లులు చక్కెరధర పడిపోయిన కారణంగా సంభవించిన నష్టాలను పూడ్చేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి

ప్రస్తుతమున్న చక్కెరధర క్వింటాలుకు రు. 260 లు. చక్కెర పరిశ్రమ అధ్వాన్న స్థితిలోవుంది.

యీ పరిస్థితి యిలాగే కొనసాగితేచక్కెర ధర క్వింటాలుకు రు 250 లోపుపడిపోవచ్చునని భారత చక్కెరమిల్లుల అసోసియేషన్ తెలియజేసింది.

జూన్ మధ్య నాటికి వివాహాల సమయంలో చక్కెర వ్యాపారం మాంద్యములో పడవచ్చునని యీ సంఘం ఆందోళన పడింది.

కేంద్ర ప్రభుత్వం విడుదలచేసే చక్కెర స్వేచ్ఛగా అమ్ముకోవడానికి చట్టంచేయాలని మిల్లులు సత్వరమే కోరుతున్నాయి.

చక్కెర ధరలు పడిపోవడానికి చక్కెరనుబజారులో స్వేచ్ఛగా అమ్ముకోవడానికి అనుమతి యివ్వడమే కారణమనియు అసోసియేషన్ అభిప్రాయపడింది.

పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో పైరిల్లా వ్యాధి వల్ల చెరకు పంట దెబ్బతిన్నది తద్వారా 30 మిల్లులున్నయీ ప్రాంతంలో చక్కెరకు లోటు ఏర్పడింది. గత యేడు 8 లక్షల టన్నుల చక్కెరను ఉత్పత్తిచేస్తే ఈ ఏడు పన్నెండు లక్షల టన్నులను ఉత్పత్తి చేశారు.

క్వింటాలుకు రు. 10 చొప్పున చెల్లించాలని ఉ. ప్రదేశ్ చక్కెర మిల్లులను కేంద్ర ప్రభుత్వం కోరింది అలాంటి విధానం మహారాష్ట్రంలోగాని మరేతర దక్షిణ రాష్ట్రాలలోగాని లేదని. కాబట్టి ప్రభుత్వం ఉత్తరప్రదేశ్ చక్కెర మిల్లులదుస్థితిని గమనించి వీరికోర్కెలు తీర్చడానికి సహాయపడాలని అసోసియేషన్ కోరింది.

ప్రేలుడు ప్రమాదంలో 8 గురి మరణం

కాలికట్, ఏప్రిల్ 14

పాల్‌ఘాట్‌జిల్లా నెమ్మర గ్రామంలోని మందుగుండు ఫ్యాక్టరీలో మొన్న ప్రేలుడు సంభవించి 8 గురు మరణించారు

5 గురికి గాయాలు తగిలాయి.

4 గురు అక్కడికక్కడే మరణించారు. మిగతా ముగ్గురు ఆస్పత్రికి తీసుక వెళ్ళిన తరువాత మరణించారు ప్రమాదానికి కారణాలు తెలియలేదు

విశాఖపట్నం ఆస్పత్రిలో రోగి హత్య

కొన్ని వివరాలు

(విశాలాంధ్ర విలేకరి)

విశాఖపట్నం, ఏప్రిల్ 12

ఇక్కడి మెంటల్ ఆస్పత్రిలో ఈ నెల 9 వ తేదీ రాత్రి జరిగిన రోగి హత్య గురించి అదనపు సమాచారం తెలియవస్తున్నది.

సింగిల్ సెల్‌లో ఒకే ఒక రోగిని ఉంచవలసి వుండగా, ఆ సెల్‌లో ముగ్గురు పేషెంట్లను లాకప్‌లో ఉంచటం జరిగిందని తెలియవస్తున్నది.

హత్య 9 వ తేదీ రాత్రిసుమారు 7గంటల సమయంలో జరిగినట్లు చెప్పబడుతున్నది. సెల్‌లో ఆ సమయంలో కొట్లాట జరిగినట్లు పెద్దగా కేకలు వినవచ్చినట్లు ప్రక్క సెల్‌లో ఉన్న రోగులు చెబుతున్నారు.

హత్య కావించబడిన శ్రీ సత్యనారాయణ వయస్సు 15 సంవత్సరాలు. అతని కండ్లు రెండూ ఊడబెరికి, గుడ్డలో చుట్టి హంతకుడు బయటపారవేశాడు కేసు మాఫీచేయించేందుకు యత్నిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంటు రోగి రాత్రి సుమారు 7 గంటలకే హత్యగావింపబడిగా తెల్లవారి గంటతర్వాత వైద్యచికిత్స చేసినట్లు కేస్ షీట్సులో రాసినాడని రోగిమామూలు పరిస్థితుల్లో మరణించినట్లు కథ అల్లటానికి ఈ విధంగా రాసినట్లు చెప్పబడుతున్నది సూపరింటెండెంట్ 10 వ తేదీ ఉదయం రోగిని (శవాన్ని) పరిశీలించినపుడు, రోగికి కళ్ళు లేకపోవటాన్ని గూడా గమనించలేదని అంటున్నారు. ఒకే సెల్‌లో సమవయస్కులను ఉంచటం జరుగుతుందని, చిన్నవయస్కులను, పెద్ద వయస్సుగల వారితో ఉంచటం సరియైన విధానంకాదని కొందరు అంటున్నారు. (వి. వి.)

జీవిత భీమా సంస్థ ఏజంటు ప్రతిభ

బొంబాయి, ఏప్రిల్ 14

అహమ్మదాబాద్‌లోని జీవిత భీమా సంస్థ ఏజంటు శ్రీ యస్. యన్. షాహు ఒక సంవత్సరంలో కోటి రూపాయల విలువగల పాలసీలనుఅమ్మి జీవిత భీమాసంస్థ చరిత్రలో రికార్డును స్థాపించాడని ఆ సంస్థ అధికారి అన్నాడు.

మార్చి 5 వ తేదీవరకు రు. 50 లక్షల విలువగల పాలసీలను మాత్రమే అమ్మాననీ శ్రీ షాహు పత్రికావిలేకరులకు తెలియజేశారు. రికార్డు స్థాపించాలనే ఒక కోర్కెకలిగి మిగతా 25 రోజులలో రు. 51 లక్షల విలువగల పాలసీలను అమ్మినట్లు ఆయన అన్నారు.

బ్యాంకర్ల సమాలోచనలు

బాసెల్ (స్విట్జర్‌లాండ్) ఏప్రిల్ 14

వడ్డీ రేట్ల పెంపుదల, బంగారం ఎదుర్కొంటున్న జటిల సమస్యలను చర్చించడానికి ప్రపంచంలోని ప్రముఖ సంపన్న దేశాల సెంట్రల్‌బ్యాంకర్లు నిన్న ఇక్కడ సమాలోచనలు ప్రారంభించారు." చర్చల వివరాలను వెల్లడించడానికి వారు తిరస్కరించారు.

అమెరికా, బ్రిటన్, జపాన్, కెనడా, ఫ్రాన్స్, పశ్చిమ జర్మనీ, స్వీడన్, బెల్జియం, నెదర్లాండ్స్ స్విట్జర్లాండ్ దేశాల ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొంటున్నారు.

ఐరాస భద్రతా సంఘానికి

భారత్‌పై పాక్ ఆరోపణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12

జమ్మూ, కాశ్మీరులకు చట్టవిరుద్ధ చర్యల చట్టాన్ని విస్తృతపరచినందుకు ఐ. రా. స భద్రతాసమితికి పాకిస్తాన్ ఫిర్యాదు చేసింది.

జమ్మూ - కాశ్మీరులో కాందిశీకులు విడిచి పెట్టి వెళ్ళిన ఆస్తులను కాశ్మీరీలకు కాకుండా చేయడానికి భారత్ యత్నిస్తున్నట్లు, ఐరాసలో పాక్ ప్రతినిధి భద్రతా సమితి సభ్యులకు ఒక లేఖలో తెలియజేశారు. ఈ వార్తను నేడు రేడియో పాకిస్తాన్ ప్రసారం చేసింది.

జెక్‌కు అదనపు సోవియట్ సైనిక బలాలు

ప్రాగ్, ఏప్రిల్ 12

1968 అక్టోబరు 16న సోవియట్, జెకోస్లొవేకియాల మధ్య జరిగిన ఒప్పందం మేరకు జెకోస్లొవేకియాలోని సోవియట్ సైన్యాల, సైనిక పరికరాల సంఖ్య హెచ్చించబడుతుందని జెక్ ప్రభుత్వం నేడు యిక్కడ ఒక ప్రకటనలో తెలియజేసింది.

సోవియట్ సైన్యాల తరలింపు రైళ్ళ ద్వారా కొనసాగుతున్నట్లు ప్రకటనలో తెలియజేయబడింది.


నేడే చూడండి!

మెమ్మెమే
మేకలన్నీ కలసే వుంటాయె
మనసేవుండి
మానవులంతా కలసిపోలేరె

ఒకే మానుమీద యెన్నో పిట్టలున్నాయ్
ఒకే పొలాన కూడ మేస్తాయి పశువులన్నీ
ఇరుగూ పొరుగూ పచ్చగ వుంటే.
ఏడుస్తుంది లోకం ఎందుకో "మెమ్మెమే"

బలముండి బలగముంటె
అవుతాడు వాడు రాజు
జనాన్ని కాలరాసి
అణిచెయడం రివాజు
రోజులు మారిపోతే పేదే
రాజై పోతాడన్నది నేరడే "మెమ్మెమే"

ఆ కాకులెంతో మేలు
కేకేసి కలసి తింటాయ్
మనిషే మేడిపండు
మదిలోన పురుగులుండు
నీది నాది దోచుకుపోయి
దాచుకు తినడం
మరిగాడెందుకో "మెమ్మెమే"

సురేష్ మూవీస్ సమర్పించు
బొమ్మలు చెప్పిన కథ
దర్శకుడు: జి.విశ్వనాథం
నిర్మాత. డి రామానాయుడు
నవయుగ

మార్క్సిస్టు, లెనినిస్టు మూల సూత్రాలు

	పేజీలు	రు. పై.
1. గతితార్కిక భౌతికవాదం	250	1.50
2. చారిత్రక భౌతికవాదం	194	1.50
3. పెట్టుబడిదారివిధానపు అర్థశాస్త్రం	194	1.50
4. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సిద్ధాంతం, ఎత్తుగడలు	398	1.50
5. సోషలిజం, కమ్యూనిజం	421	1.50

ప్రథమ ముద్రణ అంతర్జాతీయ కమ్యూనిస్టు ప్రగతిశీల, ప్రజాతంత్ర ఉద్యమం ప్రశంసలను పొందగలిగింది. ఇది తమకు ఎంతో సహాయకరంగా వుందని అనేకమంది మార్క్సిస్టు ప్రచారకులు, అధ్యాపకులు ఉగ్గడించారు. సమగ్రమైన శాస్త్రంగా మార్క్సిజం. లెనినిజాన్ని సులభ గ్రాహ్యమైనరీతిలో శాస్త్రీయ పద్ధతిలో ఈ గ్రంథాలు విశదీకరిస్తున్నవని వారు మెచ్చుకొన్నారు. "మొదటి ముద్రణ స్వరూప. స్వభావాలతో ఎట్టి మార్పు రాకుండా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమంలోను. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ 22 వ మహాసభ ఆమోదించిన ఇతర డాక్యుమెంట్లలోనూ గల అమూల్యమైన భావాలను పొందుపర్చటం ద్వారా రెండవ ముద్రణ మరింత పరిపుష్టి మొనర్చ బడింది. మొదటి ముద్రణపై పత్రికలు ప్రకటించిన సమీక్షలలోను పాఠకులు లేఖలలో వెలిబుచ్చిన సూచనలను దృష్టిలో ఉంచుకొని రెండవముద్రణ రూపొందించబడింది.

పోస్టేజీ అదనం

★

ప్రతులకు:
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏలూరురోడ్డు: విజయవాడ-2
విశాలాంధ్ర బుక్ హౌస్, సుల్తాన్ బజార్: హైదరాబాద్.

ADMARK


పెరుగుతున్న పరిశ్రమలను నడుపుటకు శక్తి
కిర్లోస్కర్ ఎలెక్ట్రిక్ మోటారు

మీ చిన్నా పెద్ద పరిశ్రమలకు తగిన వివిధ రకముల ఎలెక్ట్రిక్ మోటారు మావద్ద లభిస్తున్నాయి. కిర్లోస్కర్ మోటార్లు దారుఢ్యమైనవి, నమ్మకమైనవి మరియుదీర్ఘకాలము మన్నుతాయి. కనుక అవి మీ పరిశ్రమలలో ఉపయోగమునకు ఎంతో లాభసాటియైనవి. ఈ క్రింద చూపబడిన మోటారు మావద్ద లభిస్తున్నాయి:

● సింగిల్ ఫేజ్ $\frac{1}{4}$ నుండి 1 హార్స్ పవరు ● ఫ్లేమ్ ప్రూఫ్ $\frac{1}{4}$ నుండి 100 హెచ్ పి. ● లూమ్ మోటారు $\frac{1}{2}$ నుండి 1 హెచ్.పి. ● కార్స్ మోటారు $1\frac{1}{4}$ నుండి 2 హెచ్ పి. ● రింగ్ ఫ్రేమ్ మోటార్లు 7 5 నుండి 15 హెచ్ పి ● స్క్విరల్ కేజ్ & స్లిప్‌రింగ్‌వి 500 హెచ్.పి. వరకు.

పూర్తి వివరములకు దయచేసి యీ అడ్రసుకు వ్రాయండి:
కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్, ఉద్యోగ భవన్, తిలక్ రోడ్, పూనా-2.

STUSA 8/69

బ్రాంచి ఆఫీసు: మెస్సర్స్ కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్
338/2&3 రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్, (ఆం.ప్ర.)

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ప్రింటర్ అండ్ పబ్లిషర్ : టి. వెంకటేశ్వరరావు. ఎడిటర్: వేములపల్లి శ్రీకృష్ణ. ముద్రణ : స్వతంత్ర ఆర్టుప్రింటర్స్, విజయవాడ-4.